RNI No.TELTEL/2005/16755

# ప్రజాబలం

PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Website: prajabalam.in

Cell: 9292104449 / 9848384973
SRAVANTHI Enterprises
OFFSET PRINTERS

We undertake
Printing of
Daily News Papers

హైదరాబాద్ 20 మే 2026 బుధవారం | పేజీలు:12 | వెల రూ.2.00 | సంపుటి:21 | సంచిక:296

## యుద్ధ ప్రాతిపదికన పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల భూ సేకరణ ప్రక్రియ

### సీఎం రేవంత్ రెడ్డి



హైదరాబాద్ పాలమూరు – రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టుకు సంబంధించిన భూసేకరణ ప్రక్రియను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. దీనితో పాటు జిల్లాలోని ఇతర ప్రాజెక్టుల విషయంలో కూడా భూసేకరణ ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని చెప్పారు. మంగళవారం నాడు ముఖ్యమంత్రి ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లాకు చెందిన మంత్రులు, శాసనసభ్యులతో ఎంసీఆర్ హెచ్ఆర్డీలో సమావేశమయ్యారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించి ఈ సందర్భంగా కీలకమైన సూచనలు చేశారు.

జిల్లాలోని ప్రాజెక్టుల భూసేకరణ నిధుల విషయంలో జాప్యం జరగకుండా వెంటనే చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి చెప్పారు. పెండింగ్ బిల్లులను చెల్లించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులపై జిల్లా మంత్రులు సంబంధిత జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించి ప్రాజెక్టుల పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు.

సమావేశంలో మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్యేలు కసిరెడ్డి నారాయణరెడ్డి, మధుసూదన్ రెడ్డి, మేఘా రెడ్డి, రాజేశ్ రెడ్డి, వంశీకృష్ణ, వీర్లపల్లి శంకరయ్య, బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు పాల్గొన్నారు.

## భారత్‌లో ఎవరూ అడ్డుకోలేనటువంటి తీవ్రమైన ఆర్థిక తుపాను రాబోతుంది

## లోక్‌సభలో విపక్షనేత రాహుల్ గాంధీ హెచ్చరిక




న్యూ డిల్లి మే 19 :భారత్‌లో ఎవరూ అడ్డుకోలేనటువంటి తీవ్రమైన ఆర్థిక తుపాను రాబోతుందని లోక్‌సభలో విపక్షనేత రాహుల్ గాంధీ హెచ్చరించారు. ప్రధాని మోదీ ఆర్థిక విధానాలు విఫలమవుతున్నాయని, ఆ తర్వాత వాటిల్లే భారీ నష్టాన్ని సామాన్యుడే ఎదుర్కోవాల్సి వస్తుందని పేర్కొన్నారు. రాయ్‌బరేలీలో ఓ సభలో పాల్గొన్న రాహుల్, కేంద్ర ప్రభుత్వ ఆర్థిక విధానాలను తప్పుబట్టారు. శ్రామిక వర్గాన్ని నష్టపరిచి, బిలియనీర్లకు ప్రయోజనం చేకూర్చే విధంగా ఆర్థిక వ్యవస్థను రూపొందించారని దుయ్యబట్టారు. పౌరులను విదేశీ ప్రయాణాలను తగ్గించుకోమని కోరుతున్న ప్రధాని, తాను మాత్రం తరచూ విదేశాలకు వెళుతున్నారని విమర్శించారు. సమస్య పెట్రోల్, విద్యుత్ వాహనాలతో కాదని, అది ద్రవ్యోల్బణంతో అని ప్రధాని అర్థం చేసుకోవాలని సూచించారు. వెంటనే చర్యలు తీసుకుని దేశాన్ని రక్షించాలని కోరారు.

"భారీ ఆర్థిక తుపాన్ రాబోతోంది. దీన్ని ఎవరూ అడ్డుకోలేరు. అంత తీవ్రమైన ఆర్థిక తుపాన్ రాబోతోంది. అది ఎంతపెద్దది అంటే మీరు, నేను మన జీవితంలో ఎప్పుడూ చూడలేనంత పెద్దది. దెబ్బ ఎవరికి తగులుతుంది? అంబానీ, అదానీలకు తగలదు. వాళ్లు తమ ప్యాలెస్‌లో కూర్చుని ఉంటారు. వాళ్ల ప్యాలెస్‌ల చుట్టూ భద్రత ఉంటుంది. భారత రైతుకు, కార్మికుడికి, యువతకు, చిన్న వ్యాపారస్థులకు, చిన్న పరిశ్రమలకు దెబ్బతగులుతుంది. ఏవైతే ఉపాధిని కల్పిస్తాయో, వాటికి నష్టం కలగనుంది. ఇప్పుడు మేం చెప్తున్నాం నెలల ముందు నుంచే నేను చెప్తున్నాను. ఆర్థిక తుపాన్ వస్తోంది, సిద్ధం కావాలి అని. ప్రజలకు భారీ దెబ్బ తగలబోతోంది, పెట్రోల్ ధరలు పెరగబోతున్నాయని, ద్రవ్యోల్బణం ఆకాశాన్ని తాకబోతోందని చెబుతున్నాను. వాళ్లేమో (బీజేపీ) రాహుల్ గాంధీకి ఏం అవగాహన లేదని అంటున్నారు. ఇరాన్–అమెరికా మధ్య యుద్ధం చెలరేగడంతో మన ఇంధన సరఫరాలను ఇరాన్ నిలిపివేసింది. ఫలితంగా దేశవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ కొరత ఏర్పడింది. పెట్రోల్, డీజిల్‌ను పొదుపుగా వాడుకోవాలని, ఎలక్ట్రిక్ వాహనాలకు మారాలని మోదీ ప్రజలకు సలహా ఇస్తున్నారు. కానీ, మరుసటి రోజే మోదీ స్వయంగా విదేశాలకు వెళు_న్నారు."

ప్రభుత్వాన్ని మార్చాలని ప్రజలకు రాహుల్ గాంధీ పిలుపు

ప్రస్తుత కేంద్ర ప్రభుత్వాన్ని మార్చకపోతే దేశం మనుగడ సాగించలేదని లోక్‌సభలో విపక్షనేత రాహుల్ గాంధీ ఆరోపించారు. రాజకీయ వాస్తవాలపై ప్రజలు పూర్తిస్థాయిలో అవగాహన పెంచుకోవాలని పిలుపునిచ్చారు. ప్రజల్లో అవగాహన లోపించడం వల్లే ఎంజీఎన్ఆర్ఈజీఏ వంటి గ్రామీణ సామాజిక భద్రతా కార్యక్రమాలు పూర్తిగా రద్దు అవుతున్నాయని, చిన్న రైతులు ఆర్థికంగా నాశనమవుతారని హెచ్చరించారు. మరోవైపు దేశ అగ్ర నాయకులు మాత్రం కార్పొరేట్ సామాజిక కార్యక్రమాలకు హాజరుకావడానికే దృష్టి సారిస్తున్నారని ఆరోపించారు.

## భద్రతా బలగాల ధైర్యసాహసాలు, త్యాగాల వల్లే నక్సలిజం అంతం

## కేంద్ర హోంమంత్రి అమిత్ షా తెలిపారు.




ఛత్తీస్‌గఢ్ మే 19: భద్రతా బలగాల ధైర్యసాహసాలు, త్యాగాల వల్లే నిర్దేశిత గడువు 2026 మార్చి 31 కంటే ముందే దేశం నుంచి నక్సలిజాన్ని అంతం చేసినట్లు కేంద్ర హోంమంత్రి అమిత్ షా తెలిపారు. ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్‌లో జరిగిన 26వ సెంట్రల్ రీజనల్ కౌన్సిల్ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. బస్తర్ నక్సల్స్ రహిత ప్రాంతంగా మారడం అందరికీ గర్వకారణమని అన్నారు. కేంద్రం చేపట్టిన నక్సల్స్ రహిత పోరాటానికి చాలా బీజేపీయేతర రాష్ట్ర ప్రభుత్వాలు కూడా మద్దతు తెలిపాయని పేర్కొన్నారు. కానీ, ఛత్తీస్‌గఢ్‌లో గతంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం తమకు కనీస సహకారం అందించలేదని ఆరోపించారు. 2023 డిసెంబరు 13న ఛత్తీస్‌గఢ్‌లో బీజేపీ సర్కార్ ఏర్పడిన వెంటనే బస్తర్‌లో మిగిలిన నక్సలైట్లను ఏరివేశామని అమిత్ షా తెలిపారు. బస్తర్ ప్రజలు ఇప్పుడు నిర్భయంగా జీవిస్తున్నారన్న ఆయన, ఈ ప్రాంత అభివృద్ధికి చేపట్టిన 'వీర్ గుండాధర్ సేవా డేరా' కార్యక్రమాన్ని కొనియాడారు.

"బస్తర్ ప్రజల్లో ఇప్పుడు భవిష్యత్తు పట్ల ఆత్మవిశ్వాసం, భరోసా వాతావరణం కనిపిస్తోంది. భయానక వాతావరణం, తుపాకుల నీడలో బతకాల్సిన పరిస్థితులు ఇప్పుడు ముగిసిపోయాయి. ఎట్టకేలకు బస్తర్ స్వేచ్ఛగా ఊపిరి పీల్చుకుంటోంది. బస్తర్ నక్సల్ రహిత ప్రాంతంగా మారడం మనందరికీ ఎంతో సంతోషకరమైన విషయం. 2024 ఆగస్టు 24న జరిగిన ఒక సమావేశంలోనే 2026 మార్చి 31 నాటికి దేశాన్ని నక్సలిజం నుంచి విముక్తి చేస్తామని ప్రకటించాం. భద్రతా దళాల శౌర్యం, ధైర్యం, త్యాగాల ఫలితంగా మార్చి 31 గడువు తేదీకి ముందే నక్సలిజం పూర్తిగా నిర్మూలించాం. కాగా, 2023 డిసెంబర్ 13న విష్ణు దేవ్ సాయి నాయకత్వంలో ఛత్తీస్‌గఢ్‌లో బీజేపీ ప్రభుత్వం ఏర్పడింది. అంతకుముందు ఇక్కడ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉండేది. నక్సల్ రహిత ఉద్యమంలో బీజేపీయేతర ప్రభుత్వాలు చాలా వరకు మాకు మద్దతు ఇచ్చాయి, కానీ ఛత్తీస్‌గఢ్‌లోని కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం మాకు మద్దతు ఇవ్వలేదు."

'అభివృద్ధి జరగకపోవడానికి అసలు కారణం నక్సలిజమే'

"నక్సల్ బరి నుంచి నక్సలిజం విస్తరించడం మొదలైనప్పటి నుంచి దానికి మద్దతిచ్చే మేధావులు ఒక వాదన వినిపిస్తూ వస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో అభివృద్ధి జరగనందు వల్లే నక్సలిజం ఉద్భవించిందని చెబుతున్నారు. కానీ అది నిజం కాదు. వెనక్కి తిరిగి చూస్తే అభివృద్ధి జరగకపోవడానికి అసలు కారణం నక్సలిజమే అని స్పష్టంగా అర్థమవుతుంది. దేశంలో నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల కంటే కూడా వెనుకబడిన ప్రాంతాలు చాలా ఉన్నాయి. కానీ అక్కడ నక్సలిజం పుట్టలేదు. ఆ ప్రాంతాలు క్రమంగా అభివృద్ధి చెందుతూ ముందుకు వెళ్తున్నాయి. మన బస్తర్, ఇతర నక్సల్స్ ప్రభావిత ప్రాంతాలు మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా ఉండిపోయాయి." అని కేంద్ర హోంమంత్రి అమిత్ షా అన్నారు.

## దివ్యాంగులు పట్టుదలతో చదివి ఉన్నత స్థాయికి ఎదగాలి

### టీజిఐఐసి చైర్ పర్సన్ నిర్మల జగ్గారెడ్డి




సంగారెడ్డి మే 19 ఆత్మస్థైర్యం తో పట్టుదలతో చదివి ఉన్నత స్థాయికి ఎదిగిన ఎంతో మంది దివ్యాంగులు ప్రపంచానికి ఆదర్శంగా నిలిచారని TGIIC చైర్‌పర్సన్ నిర్మల జగ్గారెడ్డి అన్నారు. సంగారెడ్డి పట్టణంలోని సంజీవ్‌నగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యాశాఖ సమగ్ర శిక్ష , ALMICO ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా దివ్యాంగ విద్యార్థులకు వినికిడి పరికరాలను , వీల్ చైర్స్ ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకుని జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని నిర్మలా జగ్గారెడ్డి సూచించారు.

ప్రభుత్వం దివ్యాంగుల సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలు చేపడుతోందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. తల్లిదండ్రులు కూడా పిల్లలకు ప్రోత్సాహం అందించి వారి భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దాలని కోరారు.

ఈ కార్యక్రమంలో సంగారెడ్డి మున్సిపల్ చైర్ పర్సన్ కూన వనితా సంతోష్, టీపిసిసి ప్రధాన కార్యదర్శి తోపాజీ అనంత్ కిషన్, కాంగ్రెస్ పార్టీ సంగారెడ్డి టౌన్ ప్రెసిడెంట్ కిరణ్ గౌడ్, కౌన్సిలర్ లు సంగీతా మహేష్, యశోద , విద్యాశాఖ అధికారులు ,తదితరులు పాల్గొన్నారు.

## వాటర్ వర్క్స్ జీఎం ఇంటిపై ఏసీబీ దాడులు







సికింద్రాబాద్ హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ వర్క్స్ జనరన్ మేనేజన్ లక్ష్మీ కుమార్ ఇంటిపై ఏసీబీ దాడులు నిర్వహించింది. దాదాపు రూ. 1.05 కోట్ల రూపాయల నగదు, కేజీ బంగారం లభ్యం అయినట్లు సమాచారం. మల్లాపూర్, వెంకటరమణ కాలనీలో ఉన్నఅయన ఇంట్లో సోదాలు నిర్వహించి, రూ. 1.05 కోట్ల నగదు, బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. నిజామాబాద్లో 3 ఎకరాల భూమి, హైదరాబాద్లో 9 ఫ్లాట్లు, రూ. 100 కోట్లు వరకు ఆస్తులున్నాయని గుర్తించారు.

## ప్రభుత్వ ఉద్యోగాలకు గరిష్ఠ వయో పరిమితిని 34 ఏళ్ల నుంచి 44 ఏళ్లకు పెంపు

హైద్రాబాద్ మే 19 : తెలంగాణలో నిరుద్యోగ అభ్యర్థులకు ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ప్రభుత్వ ఉద్యోగాలకు గరిష్ఠ వయో పరిమితిని 34 ఏళ్ల నుంచి 44 ఏళ్లకు పెంచుతూ నిర్ణయం తీసుకుంది. ఈ ఉత్తర్వులు ఏడాది పాటు అమల్లో ఉంటాయని జీవోలో పేర్కొంది. పోలీసు తదితర యూనిఫామ్ సర్వీసులకు సడలింపు వర్తించదని ప్రభుత్వం స్పష్టం చేసింది. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత గరిష్ఠ వయో పరిమితిని పదేళ్ల పాటు సడలించారు. ఆ తర్వాత మరో రెండేళ్లు పొడిగించారు. ఆ గడువు కూడా ముగియడంతో నిరుద్యోగుల అభ్యర్థన మేరకు ప్రభుత్వం మరో ఏడాది పొడిగిస్తూ తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది.

ఈ మేరకు తాజాగా జీవో జారీ చేసింది.

# బీసీల సమగ్ర అభివృద్ధికి సామాజిక న్యాయమే మార్గం

బూర్గుపల్లి కృష్ణ యాదవ్, MA
బీసీ జాగృతి సేన వ్యవస్థాపక అధ్యక్షులు

హైద్రాబాద్ మే 19;భారత సమాజంలో శతాబ్దాలుగా అల్పసంఖ్యాక ఆధిపత్య వర్గాల చేతుల్లో భూములు, సంపద, అధికారాలు కేంద్రీకృతమవడం వల్ల బీసీ వర్గాలు సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిపోయాయి. కుల వృత్తులపై ఆధారపడి జీవించిన ఉత్పత్తి కులాలు, సేవా వర్గాలు, కళాకారులు సమాజ నిర్మాణంలో కీలక పాత్ర పోషించినప్పటికీ, వారికి కనీస గౌరవం, అవకాశాలు, మానవ హక్కులు కూడా దక్కలేదు.

భూస్వామ్య వ్యవస్థ నుంచి పారిశ్రామిక వ్యవస్థకు మారిన తర్వాత భూస్వాములు పెట్టుబడిదారులుగా, పాలక వర్గాలుగా ఎదిగారు. కానీ శ్రమజీవులు కార్మికులుగానే మిగిలిపోయారు. రెండు వ్యవస్థల్లోనూ నష్టపోయింది ఉత్పత్తి కులాల ప్రజలే. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత కూడా అధికారాలు, ఆస్తులు, రాజకీయ ప్రాధాన్యం ఆధిపత్య వర్గాల చేతుల్లోనే కొనసాగాయి. తరాలు మారినా అసమానతల అంతరాలు మాత్రం మారలేదు.

అయితే నేటి పరిస్థితుల్లో బీసీ సమాజంలో చైతన్యం పెరుగుతోంది. విద్యావకాశాలు విస్తరించడం, సామాజిక ఉద్యమాలు బలపడడం, రాజ్యాంగ హక్కులపై అవగాహన పెరగడం వల్ల బీసీలు తమ హక్కుల కోసం ప్రశ్నించడం ప్రారంభించారు. "మా జనాభాకు అనుగుణంగా పాలనలో, బడ్జెట్‌లో, ఉద్యోగాల్లో, నిర్ణయాధికారంలో సమాన వాటా కావాలి" అనే నినాదం గ్రామ స్థాయి నుంచి జాతీయ స్థాయి వరకు వినిపిస్తోంది.

ప్రజాస్వామ్యంలో అందరూ సమానమని చెప్పే పాలకులు బీసీల జనాభా గణన ఎందుకు చేపట్టడం లేదు? ఈ దేశ మూలవాసులైన మాకు రాజ్యాంగ ఫలాల్లో న్యాయమైన వాటా ఎందుకు దక్కడం లేదు? అనే ప్రశ్నలు నేడు బలంగా వినిపిస్తున్నాయి.

స్థానిక సంస్థల ఎన్నికల్లో దాదాపు నలభై ఏళ్లుగా బీసీ రిజర్వేషన్లు అమలవుతున్నప్పటికీ, జనాభా నిష్పత్తికి తగిన ప్రాతినిధ్యం ఇప్పటికీ లేదు. అసెంబ్లీ, పార్లమెంట్ స్థాయిలో ప్రత్యేక రాజకీయ రిజర్వేషన్లు లేకపోవడంతో బీసీల తరపున గళమెత్తే నాయకత్వం బలహీనంగా మారింది. రాజకీయ పార్టీల దయాదాక్షిణ్యాలపై ఆధారపడి కొందరికి మాత్రమే అవకాశాలు లభిస్తున్నాయి. వారు కూడా స్వతంత్రంగా మాట్లాడలేని పరిస్థితి ఏర్పడింది.



విద్య, వైద్యం, న్యాయం వంటి కనీస మౌలిక హక్కులు ఇప్పటికీ బీసీలకు పూర్తిస్థాయిలో అందడం లేదు. ప్రభుత్వ రంగాల నిర్లక్ష్యంతో ప్రైవేట్ విద్యా సంస్థలు, ప్రైవేట్ ఆస్పత్రులు విస్తరించి సామాన్య ప్రజలపై ఆర్థిక భారం పెంచుతున్నాయి. ఫలితంగా అనేక మంది విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమవుతున్నారు. రోగులు కుటుంబాలకు భారమవుతున్నారు.

బీసీల కోసం అమలు చేస్తున్న అనేక సంక్షేమ పథకాలు కాగితాలకే పరిమితమవుతున్నాయనే విమర్శలు ఉన్నాయి. హాస్టళ్లు, స్కాలర్‌షిప్‌లు, కోచింగ్ సెంటర్లు, ఉద్యోగ శిక్షణ కేంద్రాలను బలోపేతం చేయకుండా బీసీల అభివృద్ధి సాధ్యం కాదు.

ఆర్థిక రంగంలో కూడా పరిస్థితి ఆందోళనకరంగానే ఉంది. సంప్రదాయ కుల వృత్తులు ఆధునీకీకరణ లేక యంత్రాల దెబ్బకు కనుమరుగవుతున్నాయి. చేతివృత్తులపై ఆధారపడిన అనేక కుటుంబాలు ఉపాధి కోల్పోయి అడ్డాకూలీలుగా మారుతున్నాయి. పెద్ద కంపెనీలకు రాయితీలు ఇవ్వడంలో తప్పు లేదు. కానీ చిన్న వ్యాపారాలు, గ్రామీణ వృత్తుల అభివృద్ధిపై కూడా ప్రభుత్వాలు సమాన దృష్టి పెట్టాలి. కుల వృత్తులను ఆధునిక సాంకేతికతతో అనుసంధానం చేసి మార్కెటింగ్ అవకాశాలు కల్పిస్తే బీసీలు ఆర్థికంగా బలపడతారు.

సామాజికంగా కూడా వివక్ష పూర్తిగా తొలగిపోలేదు. అనేక ప్రాంతాల్లో ఇప్పటికీ కుల ఆధారిత అవమానాలు కొనసాగుతున్నాయి. బీసీల రక్షణ కోసం ప్రత్యేక అట్రాసిటీ చట్టం తీసుకువచ్చి కఠినంగా అమలు చేస్తే సమాజంలో మార్పు వచ్చే అవకాశం ఉంది.

డాక్టర్ బి. ఆర్ . అంబేద్కర్ చెప్పినట్లుగా, మెజారిటీ ప్రజలకు పాలనలో భాగస్వామ్యం లేకుండా సామాజిక న్యాయం సాధ్యం కాదు. కేవలం సంక్షేమ పథకాలతో బీసీల సమగ్ర అభివృద్ధి జరగదు. రాజకీయ సాధికారత, విద్యా అవకాశాలు, ఆర్థిక స్వావలంబన, సామాజిక గౌరవం --- ఈ నాలుగు స్తంభాలపై బీసీ భవిష్యత్తు నిర్మాణం జరగాలి.

బీసీ జనాభాకు అనుగుణంగా అధికారంలో వాటా కల్పించాలి. కుల గణన ఆధారంగా విధానాలు రూపొందించాలి. అప్పుడే నిజమైన సామాజిక న్యాయం సాధ్యమవుతుంది.

భవిష్యత్తులో వెనుకబడిన వర్గాల ప్రజలు నాయకత్వ వర్గాలుగా ఎదగాలంటే బీసీ యువత, విద్యావంతులు, మేధావులు సంఘటితమై పల్లెల నుంచి పట్టణాల దాకా చైతన్యం తీసుకెళ్లాలి. సోషల్ మీడియా, ప్రజా ఉద్యమాల ద్వారా తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తేవాలి. అప్పుడే బీసీలకు రాజ్యాధికారంలో సమాన వాటా దక్కుతుంది.

వ్యాసకర్త:
బూర్గుపల్లి కృష్ణ యాదవ్, MA
బీసీ జాగృతి సేన వ్యవస్థాపక అధ్యక్షులు
సెల్: 9866170384

# రాష్ట్ర ఎలక్షన్ కమిషన్ ను కలిసిన టిపిసిసి ఎలక్షన్ కమిషన్ కో-ఆర్డినేషన్ కమిటటి సభ్యులు



హైద్రాబాద్ మే 19 : తెలంగాణ రాష్ట్ర ఎలక్షన్ కమిషన్ సెక్రటరీ లింగ్య నాయక్ ని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఎలక్షన్ కమిషన్ కో-ఆర్డినేషన్ కమిటీ చైర్మన్ పులిపాటి రాజేష్ కుమార్ మరియు సభ్యులు కలవడం జరిగినది.

ఇటీవల రాష్ట్ర ఎలక్షన్ కమీషనర్ ఆదేశాల మేరకు హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి చుడి బజార్ లోని ఈసీఐఎల్ ఇంజనీర్లచే ఈవీఎం లను చెకింగ్/ఎఫ్ ఎల్ సి ప్రక్రియ ప్రారంభించడం జరిగినది.

రాబోయే జడ్పీటీసీ, ఎంపీటీసీ మరియు కార్పొరేషన్ ఎలక్షన్ కోసంఉపయోగించునున్న ఈ వీ2 మోడల్ ఈవీఎం మాషింలను కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తున్నట్లు కమిటీ సభ్యులు పేర్కొన్నారు

రాబోయే జడ్పీటీసీ, ఎంపీటీసీ, మున్సిపల్ కార్పొరేషన్ల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బ్యాలెట్ ఓటింగ్ విధానానికే ప్రాధాన్యం ఇస్తుందని తెలపడం జరిగినది, ఒకవేళ, ఈవీఎంతో ఎన్నికలు జరిగితే, వీ2 మోడల్ మెషీన్లను ఉపయోగించడాన్ని మేము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. ఎందుకంటే ఈ వీ2 మోడల్ ఈవీఎం లకు వివిపిఏటీ ( Voter Verifiable Paper Audit Trail ) సౌకర్యం లేదు, ఓటర్లు ఇచ్చిన ఓటు సరిగ్గా వారు ఇష్టపడే అభ్యర్థికి పోయిందో తెలుసుకునే సౌకర్యం లేదు అందువలన ఎన్నికలకు బ్యాలెట్ పేపర్‌ను వినియోగించాలని కోరారు.

ఈ సమావేశంలో టీపీసీసీ ఎలక్షన్ కమిషన్ కో ఆర్డినేషన్ కమిటీ చైర్మన్ పులిపాటి రాజేష్ కుమార్, సభ్యులు సింగిశెట్టి జగదీశ్వర్ రావు, గోపిశెట్టి రాఘవేందర్, టీ. రేవతి గౌడ్, కాసభ శ్రీనివాస్ రావు పాల్గొనడం జరిగినది.

# కాంగ్రెస్ - బిఆర్ఎస్ లది 'సుఖ సంసారం'..

## ఒకరినొకరు కాపాడుకుంటూ ప్రజలను మోసం చేస్తున్నారు

## మాజీ ఎమ్మెల్యే ఎన్.వి.ఎస్.ఎస్. ప్రభాకర్ ఆగ్రహం

హైద్రాబాద్ మే 19 :తెలంగాణ రాష్ట్రాన్ని గత పదేళ్లు దోచుకున్న బిఆర్ఎస్, ఇప్పుడు పాలిస్తున్న కాంగ్రెస్ పార్టీలు తెర వెనుక ఒకరికొకరు సహకరించుకుంటూ "సుఖ సంసారం" సాగిస్తున్నాయని బిజెపి సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే ఎన్.వి.ఎస్.ఎస్. ప్రభాకర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. బిజెపి రాష్ట్ర కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.

బెయిల్ పార్టీగా కాంగ్రెస్:

దేశంలో జాతీయ పార్టీగా చెప్పుకునే కాంగ్రెస్ ఉనికి కోల్పోతోంది. ఆ పార్టీ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ (సోనియా గాంధీ), లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు (రాహుల్ గాంధీ) ఇద్దరూ బెయిల్ మీద ఉన్నారు. ఆ పార్టీలో అనేక మంది నాయకులు జైలుకు వెళ్లి వచ్చినవారే.

కాంగ్రెస్ – బిఆర్ఎస్ ల దూప్ ఫైట్:

తెలంగాణలో కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీలు డ్రామాలు ఆడుతున్నాయి. గతంలో ఫిరాయింపుల సమయంలో బిఆర్ఎస్ కి కాంగ్రెస్ సహకరిస్తే, ఇప్పుడు కాంగ్రెస్ కి బిఆర్ఎస్ సహకరిస్తోంది. ఒకరినొకరు కాపాడుకుంటూ, పైకి మాత్రం కొట్టుకుంటున్నట్టు నటిస్తూ కాలయాపన చేస్తున్నారు. నాటి ఓటుకు నోటు కేసు నుండి నేటి వరకు రాహుల్ గాంధీ అండతోనే ఇరు పార్టీలు కలిసి సంసారం చేస్తున్నాయి.

కుటుంబమంతా అవినీతి ఊబిలో

బిఆర్ఎస్ అధినేత (కెసిఆర్) పై అవినీతి ఆరోపణలు వచ్చి, నోటీసులు అందితే విచారణకు వెళ్లకుండా కోర్టుల ద్వారా రక్షణ కవచం పొందేందుకు ప్రయత్నించారు. తండ్రి బాటలోనే కొడుకు (కెటిఆర్) కూడా ఫార్ములా-ఇ రేస్, విద్యుత్ కొనుగోలు ఒప్పందాలు, జొన్నవాడ అక్రమ కట్టడాల క్రమబద్ధీకరణ, మియాపూర్ భూములు, ఎంసెట్ పేపర్ లీకేజీ వంటి అంశాల్లో అదే పంథా అనుసరిస్తున్నారని విమర్శించారు.




జైళ్లు, నోటీసులు, కోర్టులు:

లిక్కర్ స్కామ్ లో కూరుకుపోయి బిఆర్ఎస్ కవిత జైలుకు వెళ్లి వచ్చి విచారణ ఎదుర్కొంటున్నారు. మరోవైపు మేనల్లుడు (హరీష్ రావు) ఫోన్ ట్యాపింగ్, కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతిపై నోటీసులు అందుకొని కోర్టుల చుట్టూ తిరుగుతున్నారు. కాళేశ్వరం విషయంలో సిఎజి (జూ+) లాంటి రాజ్యాంగ సంస్థలు తప్పులు పట్టినా వీరికి చలనం లేదని ఎద్దేవా చేశారు.

నైతికత లేని రాజీనామాలు: గతంలో ఎల్ఆర్ఎస్ వ్యవహారం, కుక్కల కాటుకు చిన్నారులు బలి కావడం, భవనాలు కూలిపోవడం వంటి ఘటనలపై కోర్టులు మొట్టికాయలు వేసినా, సుమోటోగా స్వీకరించినా నాటి పురపాలక శాఖ మంత్రులుగా ఉన్న తండ్రీకొడుకులు కనీసం రాజీనామా చేయలేదు. అలాంటి వారు ఈరోజు బిజెపికి నీతులు చెప్పడం హాస్యాస్పద మన్నారు.

అరాచక పాలన:

కేవలం అవినీతి మాత్రమే కాదు.. న్యాయవాదుల హత్యల వెనుక, ఖమ్మంలో స్వంత పార్టీ మహిళా నాయకురాలిపై లైంగిక వేధింపుల వెనుక బిఆర్ఎస్ నాయకుల హస్తం ఉందన్న వార్తలు వచ్చాయి. మహబూబాబాద్‌లో మహిళా అధికారులను సైతం నాటి బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు వేధించిన చరిత్ర ఉంది.

కరిగిపోయిన రాష్ట్ర ఆస్తులు – పెరిగిన కుటుంబ ఆస్తులు: 2009 అఫిడవిట్‌లో కెటిఆర్ చూపించిన పదుల కోట్ల ఆస్తి, ఈరోజు వందల కోట్లకు ఎలా పడగలెత్తింది? ధనిక తెలంగాణ రాష్ట్రాన్ని అప్పుల రాష్ట్రంగా మార్చి, ప్రభుత్వ ఆస్తులను కరిగించేసి.. ఈ తండ్రి, కొడుకు, కూతురు, మేనల్లుడు మాత్రం వందల కోట్లు వెనకేసుకున్నారని ఆరోపించారు.

ఒక్కొక్క కుంభకోణం, ఒక్కొక్క నోటీసు నుండి ఈ కుటుంబం తప్పించుకోలేదు. కాంగ్రెస్‌కు 'బి-టీమ్'గా మారి ఎంత సుఖ సంసారం చేసినా, తెలంగాణ ప్రజలను పిచ్చోళ్లను చేయాలని చూస్తే భారతీయ జనతా పార్టీ ఊరుకోదు. వీరి అక్రమాలను, తెరవెనుక సంసారాన్ని బిజెపి ఖచ్చితంగా బట్టబయలు చేస్తుందని, వీరంతా త్వరలోనే చువ్వలు లెక్కబెట్టడం ఖాయమని ప్రభాకర్ హెచ్చరించారు.

# మా ప్రాజెక్టును నిర్లక్ష్యం చేశారు మంత్రి జూపల్లి కృష్ణారావు



హైద్రాబాద్ మే 19 : పాలమూరు - రంగారెడ్డి ప్రాజెక్టు 90 శాతం పూర్తి చేశామని బీఆర్ఎస్ నేతలు మాట్లాడారని మంత్రి జూపల్లి కృష్ణారావు విమర్శించారు. రెండేళ్లలో పాలమూరు-రంగారెడ్డి పూర్తి చేస్తానని ఆనాడు కేసీఆర్ చెప్పి రూ.లక్ష కోట్ల ప్రాజెక్టుపై రూ.25 కోట్లే ఖర్చు పెట్టారని తెలిపారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కల్వకుర్తి, నెట్టెంపాడు, కోయిల్ సాగర్ కాంగ్రెస్ హయాంలో వచ్చినవేనని గుర్తు చేశారు. కాళేశ్వరం పూర్తి చేసినట్లు పాలమూరు ప్రాజెక్టు ఎందుకు పూర్తి చేయలేదని అని ప్రశ్నించారు. పాలమూరు-రంగారెడ్డికి కావాల్సిన 90 టీఎంసీలు బీఆర్ఎస్ తేలేకపోయిందని, తాము తెచ్చి తీరుతామని అన్నారు. పాలమూరుపై బీఆర్ఎస్‌ది సవతి తల్లి ప్రేమ అని అన్నారు. సమీక్ష అనంతరం ఈ మేరకు మాట్లాడారు.

## ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన విద్య

రుద్రవరం. మండల కేంద్రం రుద్రవరంలో మంగళవారం 'బడి పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగుపేటలో విద్యార్థుల చేరికలపై ఉపాధ్యాయులతో కలిసి విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్పెషల్ ఆఫీసర్ అబ్దుల్ రహిమాన్ మాట్లాడుతూ... "5 సంవత్సరాలు నిండిన ప్రతి బిడ్డను ప్రభుత్వ బడిలో చేర్పించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యం అన్నారు. బడి వయసు పిల్లలెవరూ బడికి దూరం కాకూడదని ప్రభుత్వ పాఠశాలల్లో ఉచిత పుస్తకాలు, యూనిఫార్ములు, షూస్, పౌష్టికాహారంతో కూడిన మధ్యాహ్న భోజనం మరియు డిజిటల్ బోధన వంటి అత్యాధునిక సౌకర్యాలు ఉన్నాయని, ప్రైవేట్‌కు దీటుగా లభిస్తున్న ఈ నాణ్యమైన విద్యను తల్లిదండ్రులంతా సద్వినియోగం చేసుకొని, తమ పిల్లలను ప్రభుత్వ బడుల్లోనే చేర్పించాలి" అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ నాగవీణ, ఎంపీడీఓ ఎన్. భాగ్యలక్ష్మి, ఎంఈఓ-ఎ ఎం. వెంకటస్వామి రెడ్డి, ఎంఈఓ-ఎఎ ఎన్. లక్ష్మి, హెచ్ఎం ఎన్. వెంకటరమణ, ఉపాధ్యాయులు, ప్రాథమిక పాఠశాల మరియు అంగన్వాడీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# బడి పిలుస్తోంది కార్యక్రమం

చాగలమర్రి చాగలమర్రిలోని గుంత పాలెం వీధి నందు పి ఆర్ టి యు మండల పరిషత్ ప్రైమరీ పాఠశాల వారి ఆధ్వర్యంలో బడి పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఒకటో తరగతి నుంచి పదవ తరగతి వరకు ప్రభుత్వ పాఠశాలలో పిల్లలను చేర్పించాలని వారికి ఉచితంగా ఆంగ్ల విద్యా , ఉచిత పుస్తకాలు, ఉచిత యూనిఫాంలు, మధ్యాహ్నం ఉచిత భోజన సౌకర్యం వంటి వాటి గురించి తెలియజేస్తూ పిల్లల పేర్లు నమోదు కార్యక్రమం చేపట్టడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి న్యామతుల్లా, పిఆర్టియు రాష్ట్ర కౌన్సిలర్ బి రవీంద్రారెడ్డి, ఉపాధ్యాయులు మస్తాన్, లక్ష్మయ్య తదితరులు పాల్గొనడం జరిగింది.

# పాపులేషన్ పాలసీపై విమర్శలు

# గళాన్ని వినిపిస్తున్న మహిళా సంఘాలు

విజయవాడ, మే 19, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రతిపాదించిన సరికొత్త జనాభా విధానం ఇప్పుడు దేశవ్యాప్తంగా సామాజిక, రాజకీయ చర్చలకు కేంద్రబిందువుగా మారింది. భవిష్యత్తులో యువ శ్రామిక శక్తి కొరత ఏర్పడకూడదనే ఉద్దేశంతో ఎక్కువ మంది పిల్లలను కనే దంపతులకు ఆర్థిక ప్రోత్సాహకాలు 3వ బిడ్డకు రూ.30 వేలు, 4వ బిడ్డకు రూ.40 వేలు ఇస్తామని చంద్రబాబు ప్రకటించారు. అయితే, ఈ ప్రతిపాదనపై మహిళా సంఘాలు మరియు ఫెమినిస్టులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. మహిళల శరీరం, ఆరోగ్యం వారి వ్యక్తిగత స్వేచ్ఛకు సంబంధించిన అంశాలని, ఓటు బ్యాంకు రాజకీయాల కోసం మహిళలను పిల్లలను కనే యంత్రాలు గా పరిగణించడం ఏమాత్రం సమంజసం కాదని వారు మండిపడుతున్నారు. ప్రముఖ పీడియాట్రీషియన్ డాక్టర్ శివరంజని సంతోష్ ఈ పాలసీపై సోషల్ మీడియా వేదికగా సంధించిన ప్రశ్నలు వైరల్ అవుతున్నాయి. ప్రభుత్వం ఇచ్చే రూ.30,000 లేదా రూ.40,000 సాయం కొద్ది రోజుల్లోనే ఖర్చయిపోతుందని, ఆ తర్వాత ఆ బిడ్డల పోషణ, చదువు, ఆరోగ్య బాధ్యతలను పేద కుటుంబాలు ఎలా మోస్తాయని ఆమె ప్రశ్నించారు. కేవలం తాత్కాలిక నగదు ఆశ చూపి పేదలను ఎక్కువ మంది పిల్లలకు జన్మనిచ్చేలా ప్రోత్సహించడం వారిని మరిన్ని ఆర్థిక కష్టాల్లోకి నెట్టడమేనని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. మౌలిక వసతులు లేని చోట జనాభా పెంపు శిశు, మాతృ మరణాల రేటును పెంచే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. మాజీ హెల్త్ సెక్రటరీ పీవీ రమేష్ కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ప్రభుత్వం జనాభా సంఖ్యను పెంచడం కంటే, ప్రస్తుతం ఉన్న జనాభాకు నాణ్యమైన విద్య, ఉచిత వైద్యం, పౌష్టికాహారం అందించడంపై దృష్టి పెట్టాలని ఆయన సూచించారు. ఆరోగ్య సంరక్షణ వ్యవస్థలు ఇంకా పూర్తిస్థాయిలో బలోపేతం కాకముందే ఇలాంటి నిర్ణయాలు తీసుకోవడం వల్ల తల్లుల ఆరోగ్య భద్రత ప్రమాదంలో పడుతుందని ఆయన విశ్లేషించారు. నాణ్యమైన మానవ వనరుల అభివృద్ధికి సంఖ్య కంటే సౌకర్యాలు ముఖ్యమని ఆయన కోణంలో స్పష్టం చేశారు. ఈ అంశంపై పుదుచ్చేరి మాజీ లెఫ్టినెంట్ గవర్నర్ కిరణ్ బేడీ, సినీ నటి పూనమ్ కౌర్ వంటి వారు కూడా తమ గళాన్ని వినిపించారు. సామాజిక మాధ్యమాల్లో చంద్రబాబు వ్యాఖ్యలను కొందరు దూరదృష్టి గా అభివర్ణిస్తుంటే, మరికొందరు దీనిని మహిళా వ్యతిరేక ధోరణి గా ట్రోల్ చేస్తున్నారు. ముఖ్యంగా మహిళా సంఘాలు ఈ పాలసీని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తున్నాయి. అభివృద్ధి చెందిన దేశాల అనుభవాలను దృష్టిలో ఉంచుకుని సీఎం ఈ ప్రతిపాదన చేసినప్పటికీ, అది మహిళల ప్రాథమిక హక్కులను ప్రభావితం చేసేలా ఉండకూడదని వారు వాదిస్తున్నారు. సీపీఎం నాయకురాలు బృందా కారత్ కూడా చంద్రబాబు పాపులేషన్ పాలసీని ఖండించారు చంద్రబాబు ఎన్డీయేలో చేరిన తర్వాత సొంత తెలివితేటలను, ఆలోచనా విధానాన్ని తాకట్టు పెట్టేంత దూరంగా వెళ్ళిపోయారా అని ప్రశ్నించారు. రూ. 30,000 ఆశ చూపి, ఒక మహిళకు తన సొంత గర్భంపై ఉన్న ప్రాథమిక హక్కును మీరు లాక్కోవాలని చూస్తున్నారు... ఇప్పుడు ఏం జరుగుతుందంటే, ఈ రూ. 30,000 – రూ. 40,000 ఆశకు లోబడి, ఆ మహిళ కుటుంబ సభ్యులు ఆమెపై విపరీతమైన ఒత్తిడి తెస్తారని ఆందోళన వ్యక్తం చేశారు.మరోవైపు, చంద్రబాబు మద్దతుదారులు మాత్రం ఈ పాలసీని సమర్థిస్తున్నారు. ప్రభుత్వం ఎవరినీ బలవంతం చేయడం లేదని, కేవలం స్వచ్ఛందంగా ముందుకు వచ్చే వారికి ప్రోత్సాహం అందిస్తోందని వారు చెప్తున్నారు.

రాబోయే దశాబ్దాల్లో ఏపీలో వృద్ధాప్య సంక్షోభం తలెత్తకుండా ఉండాలంటే ఇప్పుడే మేల్కొనాలని, జనాభా సంతులనం కోసమే ఈ పాలసీని వర్కవుట్ చేస్తున్నారని వారు స్పష్టం చేస్తున్నారు. ఏది ఏమైనా, ముఖ్యమంత్రి లేవనెత్తిన ఈ అంశం ఇప్పుడు జాతీయ మీడియాలో సైతం హాట్ టాపిక్‌గా మారి, భిన్నమైన వాదనలకు దారితీస్తోంది.

చదరపు కిలోమీటర్ కు 480 మంది పైనే

మన దేశంలో జనాభా ఇప్పటికే సుమారు 140 కోట్ల పైగా ఉంది. ఈ నేపథ్యంలో ఇప్పుడు పెంపు అవసరమైన ప్రశ్నలు తలెత్తుతున్నాయి. జనాభా కారణంగా ఇప్పటికే మన దేశంలో వనరులపై ఒత్తిడి పెరుగుతుంది. ప్రజలకు పాలకులు మౌలిక సదుపాయాలు కల్పించలేకపోతున్నారు. మంచి విద్య అందడం లేదు. ఆసుపత్రుల కొరత ఉంది. ఉద్యోగాలు ఉపాధి అవకాశాలు లభించడం లేదు. సంపద కూడా కొందరి వద్దనే ఉంటుంది. ఆర్థిక అంతరాలు పెరుగుతున్నాయి. చదరపు కిలోమీటరుకు కనిపించే జనసాంద్రత భారతదేశంలో ఎక్కువగా ఉంటుంది, ఇది మౌలిక సదుపాయాలపై భారం పెంచుతుంది. రవాణా, ఆరోగ్య, విద్య, నీటి సరఫరా వంటి సేవల అందుబాటును ప్రస్తుత జనాభా కూడా కష్టపడి తీర్చుకుంటోంది. అంతకంటే ఎక్కువ జనాభా పెరగడం పరిస్థితిని మరింత యంత్రంగా మార్చే అవకాశం ఉంది. అమెరికాలో చదరపు కిలోమీటర్ కు 33 మంది, చైనాలో చదరపు కిలోమీటర్ కు 150 మంది ఉన్నారు. మనదేశంలో కూడా ఫెర్టిలిటీ రేటు తగ్గుతుంది. కానీ జనాభా పెంపు ఇప్పట్లో అవసరం లేదు.ఆంధ్రప్రదేశ్‌లో జనాభా 5 కోట్లకు పైగా ఉంది. ఇది దక్షిణ కొరియాతో సమానం. దక్షిణ కొరియా ప్రపంచంలో చాలా మెరుగైన అభివృద్ధి చెందిన దేశం. ఆంధ్రప్రదేశ్లో చాలావరకు మౌలిక సదుపాయాల లేవు. తలసరి ఆదాయంలో ఆంధ్రప్రదేశ్ దక్షిణాది రాష్ట్రాల్లో చివరి స్థానంలో ఉంది. జిడిపి పెంపు ప్రజలకు మెరుగైన జీవనం కల్పించడంపై దృష్టి పెట్టాల్సిన తరుణంలో జనాభా పెంపుకు పిలుపునివ్వడం విమర్శలకు తావిస్తోంది.

చంద్రబాబు జనాభా పెంపు గురించి ప్రజలను ప్రోత్సహించడం కన్నా ముందు సదుపాయాలపై దృష్టి పెట్టాలని సూచిస్తున్నారు. అజీర్ణంతో బాధపడుతున్న వ్యక్తి ఆకలితో ఉన్నవాడిని ఒకప్పుడు తినమని సూచించినట్లుగా ఉందన్న విమర్శలు వస్తున్నాయి. అధిక జనాభా సూచన రాజకీయంగా రాకుండా వాస్తవ సమస్యల్ని మరింత పెంచే ప్రమాదం ఉంది.

# లోకల్ పోరుకు వ్యూహాలు

విజయవాడ, మే 19, ఆంధ్రప్రదేశ్ లో స్థానిక సంస్థల ఎన్నికలకు సమయం దగ్గరపడుతుంది. ఈ మేరకు ఎన్నికల కమిషన్ ఎన్నికలకు సంబంధించి సన్నాహాలు ప్రారంభించింది. ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల సంఘం కసరత్తు చేస్తోంది. దీంతో అన్ని రాజకీయ పార్టీలు అప్రమత్తమయ్యాయి. స్థానిక సంస్థల ఎన్నికల్లో పట్టు నిలుపుకునేందుకు తమ పార్టీ శ్రేణులను సిద్ధం చేస్తున్నాయి. స్థానిక సంస్థల ఎన్నికలకు సెప్టెంబరులో నోటిఫికేషన్ విడుదలయ్యే అవకాశం ఉంది. డిసెంబరు నాటికి ఎన్నికల ప్రక్రియను పూర్తి చేసి, కొత్త ఏడాది నాటికి నూతన పాలకవర్గాలు కొలువుదీరేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.ఇప్పటికే తెలుగుదేశం పార్టీ జిల్లాల వారీగా సమన్వయ కర్తలు నియమించింది. జిల్లాలకు వెళ్లి నియోజకవర్గ ఎమ్మెల్యేలతో సమావేశమై పార్టీ అభ్యర్థులకు సంబంధించిన మార్గదర్శకాలను వివరించాలని పార్టీ నాయకత్వం నిర్ణయించింది. కొన్ని జిల్లాలకు కొందరు ముఖ్యనేతలకు బాధ్యతలను అప్పగించారు. ఇక కూటమిలోని మరొక మిత్రపక్షమైన జనసేన పార్టీ కూడా జిల్లాల వారీగా పరిశీలికులను నియమించింది. వారు జిల్లాలకు వెళ్లి పార్టీ నేతలతో సమావేశమై స్థానిక సంస్థల ఎన్నికలపై నేతల నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకుంటున్నారు. నివేదికను పవన్ కల్యాణ్ కు అందించనున్నారు. బీజేపీ మాత్రం ఇంకా దీనిపై ఇంకా కసరత్తులు మొదలు పెట్టలేదు.మరొకవైపు ప్రతిపక్ష వైసీపీ కూడా ఇప్పటికే స్థానిక సంస్థల ఎన్నికలకు సమాయత్తమవుతుంది. లండన్ పర్యటన నుంచి వచ్చిన తర్వాత వైసీపీ అధినేత వైఎస్ జగన్ కీలక నేతలతో సమావేశమై స్థానిక సంస్థల ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించారు. రిజర్వేషన్లు, పార్టీ కోసం కష్టపడి పనిచేసిన వారికి మాత్రమే టిక్కెట్లు ఇవ్వాలని, అలాగే సామాజిక సమీకరణాలను కూడా ఖచ్చితంగా పాటించాలని వైఎస్ జగన్ నేతలను ఆదేశించినట్లు తెలిసింది. తొలుత మున్సిపల్ ఎన్నికలు జరుగుతుండటంతో బూత్ లెవెల్ కమిటీలను పూర్తి చేసి వారిని యాక్టివ్ చేయాలని, ఇప్పటి నుంచే స్థానిక సమస్యలపై పార్టీ శ్రేణులు ఉద్యమించాలని వైఎస్ జగన్ పార్టీ శ్రేణులకు పిలుపు నిచ్చారు. మొత్తం మీద ఆంధ్రప్రదేశ్ లో లోకల్ హాట్ మొదలయిందనే చెప్పాలి

ఎమ్మెల్యేలకు

స్థానిక సంస్థల ఎన్నికలు ఎమ్మెల్యేలకు సవాల్ గా మారనున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లవుతుంది. అయితే ఈ రెండేళ్లలో కూటమిలోని టీడీపీ, జనసేన, బీజేపీల మధ్య నియోజకవర్గాల్లో సఖ్యత లేదు. దీంతో స్థానిక సంస్థల ఎన్నికల్లో అధికార పార్టీ ఇబ్బందులు తలెత్తే అవకాశముందని భావించి మూడు పార్టీల అగ్రనాయకత్వం అప్రమత్తమయింది. పై స్థాయిలో మూడు పార్టీల్లోని అగ్ర నాయకత్వం సఖ్యతగా ఉన్నప్పటికీ నియోజకవర్గ స్థాయి నేతల మధ్య సంబంధాలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. పదవులు, కాంట్రాక్టులు, ఇసుక, మద్యం వంటి విషయాల్లో తేడాలు రావడంతో కూటమి నియోజకవర్గాల్లో కలసి లేదన్నది వాస్తవం. స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాలు ఎమ్మెల్యేల పనితీరుకు కొలమానం కావడంతో వారిలోనూ ఆందోళన నెలకొంది.

ఏ పార్టీ ఎమ్మెల్యే అక్కడ ప్రాతినిధ్యం వహిస్తుంటే మిగిలిన పార్టీల నేతలను నిర్లక్ష్యం చేస్తున్నారని ఇప్పటికే అనేక చోట్ల నుంచి ఫిర్యాదులు అధినాయకత్వానికి అందుతున్నాయి. ఇందుకు టీడీపీ, జనసేన, బీజేపీ ఏదీ మినహాయింపు కాదు.

తమ గెలుపునకు దోహదపడిన తమ పార్టీకి సంబంధించిన నాయకులకే పదవులు, కాంట్రాక్టులు ఇస్తుండటంతో మిగిలిన పార్టీల నేతలు, క్యాడర్ లో అసంతృప్తి నెలకొంది. అంతెందుకు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురం నియోజకవర్గంలోనే జనసేన, టీడీపీ కార్యకర్తల మధ్య సఖ్యత లేదు. అందుకే అక్కడ టీడీపీ ఇన్ ఛార్జి బాధ్యతల నుంచి వర్మను పార్టీ నాయకత్వం తప్పించాల్సి వచ్చింది.

ఇలా ఉత్తరాంధ్ర నుంచి తీసుకుంటే కోస్తాంధ్ర, రాయలసీమలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. నేతల మధ్య ఎంత సమన్వయం కుదిర్చినప్పటికీ ఫలితం ఎలా ఉంటుందోనన్న ఆందోళన మూడు పార్టీల నేతల్లోనూ వ్యక్తమవుతుంది.

అందుకే అన్ని పార్టీలు జిల్లా, నియోజకవర్గ స్థాయిలో సమన్వయ కమిటీలను ఏర్పాటు చేసుకుని నేతల మధ్య గ్యాప్ లేకుండా చూసుకోవాలని నిర్ణయించాయి. విభేదాల ఫలితం ప్రభావం స్థానిక సంస్థల ఎన్నికలపై పడకూడదని, ఎమ్మెల్యేలతో పాటు టీడీపీ, జనసేన, బీజేపీ ఇన్ ఛార్జులతో సమావేశం ఏర్పాటు చేసుకుని నేతల మధ్య, క్యాడర్ లో నెలకొన్న విభేదాలు తొలగించే ప్రయత్నాలు చేయాలని నిర్ణయించింది. మొత్తం మీద జనసేన, టీడీపీ, బీజేపీ నాయకత్వంలో నియోజకవర్గంలో నెలకొన్న విభేదాలు కొంత అలజడికి కారణమయ్యాయి.

## మే 30న నాగలాపురంలో శ్రీ వేద నారాయణ స్వామివారి దివ్య కంచి గరుడసేవ

తిరుపతి, 2026 మే 19భక్తులను భక్తి పారవశ్యంలో ముంచెత్తే శ్రీ వేద నారాయణ స్వామివారి కంచి గరుడసేవ మే 30న నాగలాపురం ఆలయంలో వైభవంగా జరగనుంది. కంచిలోని శ్రీ వరదరాజ స్వామివారి ఆలయంలో నిర్వహించే మహా గరుడసేవను పురస్కరించుకొని నాగలాపురంలోని శ్రీ వేద నారాయణ స్వామివారి ఆలయంలో ఈ గరుడసేవను నిర్వహించడం ఆనవాయితీగా కొనసాగుతోంది.ఈ సందర్భంగా ఉదయం 6.30 గంటల నుంచి 8.30 గంటల వరకు సర్వాలంకార భూషితుడైన శ్రీ వేద నారాయణ స్వామివారు గరుడ వాహనంపై ఆలయ నాలుగు మాడ వీధుల్లో దివ్య విహారం చేస్తూ భక్తులకు దర్శనమివ్వనున్నారు. స్వామివారి దివ్య మంగళ విహారాన్ని తిలకించేందుకు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి అనుగ్రహాన్ని పొందాలని ఆలయ అధికారులు కోరారు.

# కడపలో రెండు నియోజకవర్గాలపై దృష్టి

కడప, మే 19, ఏపీ రాజకీయాల్లో వైయస్ షర్మిల దూకుడు పెంచాలని భావిస్తున్నారు. వచ్చే ఎన్నికల నాటికి ఎంపిక చేసిన కొన్ని నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాలని భావిస్తున్నారు. ప్రధానంగా గట్టి అభ్యర్థులను బరిలో దించడం ద్వారా ఓట్లతోపాటు సీట్లు పెంచుకోవాలని చూస్తున్నారు. మరోవైపు తాను సైతం ఈసారి అసెంబ్లీకి పోటీ చేసేందుకు సిద్ధపడుతున్నట్లు తెలుస్తోంది. మొన్నటి ఎన్నికల్లో కడప ఎంపీగా పోటీ చేశారు షర్మిల. త్రిముఖ పోటీలో భాగంగా.. ఆమె ఏకంగా లక్ష యాభై వేలకు పైగా ఓట్లతో విజయం సాధించారు. ఒకానొక దశలో కడప ఎంపీగా అవినాష్ రెడ్డి ఓడిపోతారని కూడా అంచనాలు వచ్చాయి. అయితే రాజకీయ ప్రత్యర్థిగా భావించే జగన్మోహన్ రెడ్డి పార్టీని గట్టిగానే దెబ్బతీయగలిగారు షర్మిల. కడప జిల్లాలో కూటమికి ఏడు అసెంబ్లీ స్థానాలు లభించాయి అంటే.. షర్మిల ప్రభావం అధికంగా ఉంది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీపై. వైసిపి ఓడిపోయేందుకు షర్మిల దోహదపడ్డారు.అయితే ఈసారి పార్లమెంట్ స్థానానికి కాకుండా అసెంబ్లీకి పోటీ చేయాలని భావిస్తున్నారు షర్మిల. దానికి కారణం లేకపోలేదు. అసెంబ్లీలో తన వాయిస్ వినిపించడం ద్వారా తన పొలిటికల్ కెరీర్ కు ఒక నిర్మాణం జరుపుకోవాలని చూస్తున్నారు. ఒకవేళ జగన్ మోహన్ రెడ్డి ప్రతిపక్షానికి పరిమితం అయినా.. ఆయన అసెంబ్లీకి రారు. అధికారంలోకి వస్తే అదే జగన్మోహన్ రెడ్డి పై గట్టిగానే తన వాయిస్ వినిపించవచ్చు. ఈ రెండు కారణాలతోనే షర్మిల ఇప్పుడు అసెంబ్లీ వైపు మొగ్గు చూపుతున్నారు. తనకు సేఫ్ గా ఉండే నియోజకవర్గాలను ఎంచుకునే పనిలో ఉన్నారు. రాయలసీమలో అయితే కలిసి వస్తుందన్న అంచనా. ఆపై కడప జిల్లాలో అయితే సునాయాసంగా విజయం సాధించవచ్చు అనేది ఆమె అభిప్రాయం. అందుకే కడప జిల్లాలో ఆమె అన్వేషణ ప్రారంభించినట్లు తెలుస్తోంది.కడప జిల్లాలో ప్రధానంగా రెండు నియోజకవర్గాలపై ఆమె దృష్టి పెట్టారు. ముఖ్యంగా కమలాపురం నియోజకవర్గం పై ఫోకస్ పెట్టారు. దానికి కారణం లేకపోలేదు. ఆ నియోజకవర్గం తన తల్లి విజయమ్మ పుట్టినిల్లు. తన మేనమామ రవీంద్రనాథ్ రెడ్డి అక్కడ ప్రాతినిధ్యం వహిస్తూ వచ్చారు. మొన్నటి ఎన్నికల్లో ఓడిపోయారు. ఆ నియోజకవర్గ అయితే సేఫ్ జోన్ గా ఉంటుందని భావిస్తున్నట్లు సమాచారం.

కడప నియోజకవర్గం పై కూడా ఆమె దృష్టి పెట్టారట. జిల్లా కేంద్రం కావడంతో అక్కడ నుంచి రాజకీయాలు చేస్తే బాగుంటుందన్న అభిప్రాయానికి వస్తున్నారట. పైగా కడప అసెంబ్లీ నియోజకవర్గంలో వైయస్ రాజశేఖర్ రెడ్డి కుటుంబ అభిమానులు ఎక్కువ. మరి షర్మిల ఎలాంటి అడుగులు వేస్తారో చూడాలి.

# చంద్రబాబు.. లోకేష్... దేవాన్ష్



విజయవాడ, మే 19, చంద్రబాబు కుటుంబంలో ఏది జరిగిన ఇప్పుడు ప్రత్యేక ఆకర్షణే. ఇప్పటివరకు చంద్రబాబు.. తరువాత లోకేష్.. ఇప్పుడు దేవాన్ష్ అన్నట్టు పరిస్థితి మారింది. చదువుతో పాటు ఇతరత్రా అంశాల్లో సైతం ముందున్నారు దేవాన్ష్. మొన్నటి వరకు చదరంగంలో సైతం సత్తా చాటారు. ప్రపంచ స్థాయి పోటీల్లో పాల్గొని నైపుణ్యం కనబరిచారు. ఇప్పుడు మరో కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు దేవాన్ష్. ఓ యూట్యూబ్ ఛానల్ ను ప్రారంభించారు. పురాతన జంతువులతో పాటు అంశాలను తనదైన శైలిలో వివరించేందుకు సిద్ధపడ్డారు. యూట్యూబ్ ఛానల్ పరిచయ కార్యక్రమంలో భాగంగా కుమారుడు దేవాన్ష్‌తో పాటు లోకేష్ పాలుపంచుకున్నారు. ప్రోమో వీడియోలో లోకేష్ సైతం కనిపించారు. ప్రస్తుతం ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.నారాతోపాటు నందమూరి కుటుంబానికి సైతం దేవాన్ష్ స్పెషల్. నందమూరి బాలకృష్ణ కుమార్తె బ్రాహ్మణిని లోకేష్ వివాహం చేసుకున్నారు. ఇరు కుటుంబాలకు పెద్ద మనవడు దేవాన్ష్. బాలకృష్ణకు ఏకైక కుమారుడు లోకేష్ కావడంతో.. దేవాన్ష్ సైతం ఏకైక కుమారుడు లోకేష్ దంపతులకు. అయితే చిన్ననాటి నుంచి నానమ్మ భువనేశ్వరి పర్యవేక్షణలోనే పెరుగుతున్నాడు. ఏటా సంక్రాంతి వేడుకల సమయంలో నారావారిపల్లిలో సైతం దేవాన్ష్ సందడి చేస్తుంటాడు. గ్రామానికి వెళ్ళిన క్రమంలో తోటి చిన్నారులతో ఆటలాడుతుంటాడు. కర్ర సాములో సైతం ప్రావీణ్యం పొందాడు. ముఖ్యంగా చెస్ లో రాణిస్తూ వచ్చాడు. ప్రపంచ స్థాయి పోటీల్లో సైతం పాల్గొంటూ వచ్చాడు. ఇప్పుడు కేవలం పరిశోధనాత్మకమైన, ప్రాచీనమైన డైనోసార్లు, ఇతరత్రా జంతువుల గురించి తనకు తెలిసిన విషయాన్ని పంచుకునేందుకు డినోడిట్స్ పేరుతో యూట్యూబ్ ఛానల్లో అందుబాటులోకి వస్తున్నాడు.కచ్చితంగా ఒక ముఖ్యమంత్రి మనవడు, ఒక మంత్రి కుమారుడు, ప్రముఖ హీరో మనవడు, సెలబ్రిటీ హోదాలో ఇప్పుడు దేవాన్ష్ యూట్యూబ్ ద్వారా పరిచయం అవుతుండడం మాత్రం గొప్ప విషయం. ఎందుకంటే ఆయన ఎంచుకునేందుకు సినిమా రంగంతో పాటు రాజకీయరంగం ఎలానూ ఉంది. ఒక పద్ధతి ప్రకారం దేవాన్ష్ విషయంలో అడుగులు వేస్తోంది నారా కుటుంబం. ఈ ప్రత్యేక యూట్యూబ్ ఛానల్స్ కు లక్షల్లో అప్పుడే వ్యూయర్ షిప్ వస్తోంది. ముమ్ముందు కచ్చితంగా ఇది సంచలనాలకు వేదిక కానుంది. ఎక్కువమంది నారా దేవాన్ష్ కు శుభాకాంక్షలు చెబుతున్నారు.దేవాన్ష్ ఒక యూట్యూబ్ ఛానల్ ను ప్రారంభించాడు. రాక్షస బల్లులు, శిలాజాలు, పురాతన అవశేషాల గురించి కొంతకాలంగా దేవాన్ష్ పరిశోధన చేస్తున్నాడు. వివిధ పుస్తకాలలో ప్రచురితమైన అంశాలను క్రోడీకరించి.. తాను తెలుసుకున్న విషయాలను.. ఆశ్చర్యానికి గురిచేసే అంశాలను.. ఆకట్టుకునే విధంగా రూపొందించాడు. ఈకాలపు పిల్లలకు అర్థమయ్యే విధంగా వాటిని రూపొందించాడు. వీటిని పాడ్ కాస్ట్ రూపంలో తన యూట్యూబ్ ఛానల్ లో ప్రసారం చేయబోతున్నాడు.సాధారణ యూట్యూబ్ ఛానల్ మాదిరిగా కాకుండా.. దానికోసం ఒక డైనోసార్ ప్రపంచాన్ని సృష్టించాడు దేవాన్ష్. ప్రాచీన ప్రపంచంలోకి ప్రేక్షకుడి లాగా తన తండ్రిని ఆహ్వానించాడు. దీనిపై అనేక ప్రశ్నలు నారా లోకేష్ అడిగితే.. దేవాన్ష్ ఏ మాత్రం తడుముకోకుండా సమాధానం చెప్పాడు. ఇదే విషయాన్ని నారా లోకేష్ సోషల్ మీడియాలో ప్రస్తావించారు. దీనికి సంబంధించిన స్పెషల్ వీడియోను సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు.నారా దేవాన్ష్ కొంతకాలంగా శిలాజాలు.. పురాతన సంఘటనలు.. వందల సంవత్సరాల క్రితం జీవించిన జంతువులు.. వంటి వాటి గురించి తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నారు. తాను తెలుసుకున్న విషయాలను.. పాడ్ కాస్ట్ రూపంలో చెప్పడానికి నారా దేవాన్ష్ ప్రయత్నిస్తున్నారు. నారా లోకేష్ ప్రోమో వీడియో రిలీజ్ చేయడంతో.. నారా దేవాన్ష్ యూట్యూబ్ ఛానల్ మీద అంచనాలు భారీగా పెరిగిపోయాయి.

# కమలంపై పసుపు గుర్రు




విశాఖపట్టణం మే 19, ఏపీలో కూటమి ప్రభుత్వానికి సారథ్యం వహిస్తోంది తెలుగుదేశం. కేంద్ర ప్రభుత్వంలో సైతం కీలక భాగస్వామి. అందుకే రాష్ట్ర ప్రయోజనాల తో పాటు రాజకీయ ప్రయోజనాల విషయంలో రాష్ట్రానికి పెద్ద పీట వేస్తోంది కేంద్రం. అయితే అదే స్థాయిలో ఏపీ నుంచి బిజెపి ప్రాతినిధ్యం కోరడం తెలుగుదేశం పార్టీకి లోటు. తాజాగా రాజ్యసభ పదవులకు సంబంధించిన ఎంపిక విషయంలో బిజెపి పట్టుబడుతుండడంతో టిడిపి సీనియర్లు మదన పడుతున్నారు. మరోసారి ఏపీ నుంచి రాజ్యసభ పదవి కోరుతోంది బిజెపి. కానీ ఆ పదవులపై ఆశలు పెట్టుకున్న తెలుగుదేశం సీనియర్లు పెదవి విరుస్తున్నారు. ఎన్ని రోజులపాటు పార్టీ కోసం కష్టపడితే.. తమకు ఎటువంటి ప్రయోజనం లేకుండా పోతుందని.. తమకు వచ్చే అవకాశాలను బిజెపి తన్నుకుపోతోందని ఆవేదనతో ఉన్నారు.ఏపీలో కూటమి అధికారంలోకి వచ్చి రెండేళ్లు అవుతోంది. టిడిపి సీనియర్లు చాలామంది పదవుల కోసం ఎదురుచూస్తున్నారు. ఇందులో సీట్లు త్యాగం చేసిన వారు ఉన్నారు. టిడిపి ఆవిర్భావం నుంచి పనిచేస్తున్న వారు ఉన్నారు. అయితే ఈ రెండేళ్ల కాలంలో రెండుసార్లు రాజ్యసభ, అదే స్థాయిలో ఎమ్మెల్సీ పదవుల భర్తీ జరిగింది. ఆ సమయంలో బిజెపి ఎంట్రీ ఇస్తోంది. పదవులను తీసుకుంటోంది. రెండుసార్లు రాజ్యసభ పదవి అలానే తీసుకుంది. ఎమ్మెల్సీ పదవులను సైతం కూటమి ఖాతాలో పొందింది. ఇప్పుడు మరోసారి రాజ్యసభ పదవి కోరుతుండడంపై టిడిపి సీనియర్లలో ఆగ్రహం వ్యక్తం అవుతోంది.ఒకసారి బిజెపితో చెడి చాలా రకాలు ఇబ్బందులు పడ్డారు చంద్రబాబు. అందుకే కేంద్ర పెద్దలతో సఖ్యత గా గడుపుతున్నారు. ప్రస్తుతం రాష్ట్రం నుంచి నలుగురు రాజ్యసభ సభ్యులు పదవీ విరమణ చేయనున్నారు. ఆ పదవులన్నీ టిడిపి కూటమికి దక్కనున్నాయి. అయితే ఇప్పుడు ఆ నాలుగింటిలో ఒక పదవిని కోరుతోంది బిజెపి. జనసేనకు ఒకటి సర్దుబాటు చేయాల్సి ఉంటుంది. ఎందుకంటే ఆ పార్టీకి రాజ్యసభలో ప్రాతినిధ్యం లేదు. అందుకే కచ్చితంగా ఇవ్వాల్సి ఉంటుంది. అయితే బిజెపితో పాటు జనసేనకు రెండు పోతే టిడిపికి మిగిలేది కేవలం రెండు మాత్రమే. ఆ రెండింటిలో పదవీ విరమణ చేస్తున్న సానా సతీష్ కు కొనసాగింపు ఇవ్వాల్సి ఉంటుంది. ఇక మిగిలింది ఒకటే. దానికోసం చాలామంది ఆశావహులు ఎదురుచూస్తున్నారు. బిజెపి పోటీలో లేకపోతే.. టిడిపి కి మూడు, జనసేనకు ఒకటి తేలిపోయేది. అలా కాకుండా బిజెపి సైతం ఒక పదవి కోరుతుండడం పై టీడీపీ సీనియర్లు ఆగ్రహంగా ఉన్నారు. కానీ రాష్ట్ర ప్రయోజనాల దృష్ట్యా సర్దుబాటు చేసుకోవాల్సిందని చంద్రబాబు భావిస్తున్నారు. కానీ ఇన్ని రోజులు పార్టీ కోసం పనిచేసిన తమ పరిస్థితి ఏంటి అని టిడిపి సీనియర్లు మదనపడుతున్నారు.

# టీడీపీలో షాడోల రాజ్యం

విజయనగరం, మే 19, విజయనగరం అసెంబ్లీ నియోజకవర్గం అంటే గుర్తుకు వచ్చేది పూసపాటి వారి కుటుంబమే. మూడు తరాలుగా వారు ఎమ్మెల్యేలుగా ఈ ప్రాంతాన్ని పాలిస్తున్నారు. పీవీజీ రాజుతో మొదలైన వారి ప్రజా ప్రాతినిధ్యం ఆయన మనవరాలు అదితి గజపతిరాజు దాకా కొనసాగుతోంది.

మధ్యలో అశోక్ గజపతి రాజు ఏడు సార్లు గెలిచి అనేక మంత్రిత్వ శాఖలను నిర్వహించారు. ఇపుడు ఆయన గోవా గవర్నర్ గా రాజ్యాంగ బద్ధ బాధ్యలతో బిజీగా ఉన్నారు. ఆయన కుమార్తెగా వారసురాలిగా 2019లో పొలిటికల్ ఎంట్రీ ఇచ్చిన అదితి గజపతి రాజు ఆ ఎన్నికల్లో ఓటమి పాలు అయినా 2024 లో గెలిచి తన సత్తా చాటుకున్నారు. ఇక గెలిచిన తరువాత ఎమ్మెల్యే పెద్దగా జనంలోకి రారు అన్న విమర్శలు అయితే వినిపిస్తున్నాయి. నిత్యం ప్రజలతో మమేకం కావాలని పార్టీ ఆదేశాలు ఒక వైపు ఉంటే ఎమ్మెల్యే మాత్రం తనదైన శైలిలో రాజకీయం చేస్తున్నారు అని అంటున్నారు. ఆమెకు పార్టీలో ఇద్దరు కీలక నేతలు షాడోలుగా మారారని అంటున్నారు. జనంలో ఏ మాత్రం పలుకుబడి లేని ఈ ఇద్దరు నాయకులలో ఒకరు వైసీపీ నుంచి వచ్చి టీడీపీలో చేరిన వారు అయితే మరొకరు సెటిల్మెంట్స్ చేస్తూ ఏకంగా ఎమ్మెల్యే దగ్గర తన పలుకుబడి పెంచుకుని అతి ముఖ్య సలహాదరుగా మారిపోయారని అంటున్నారు. ఇపుడు సీన్ ఎలా ఉంది అంటే ఈ ఇద్దరి సలహా సంప్రదింపులు లేకుండా ఎమ్మెల్యే కనీసం ఏదీ వినే పరిస్థితి లేదని సొంత పార్టీలోనే గుసగుసలు పోతున్నారు. ఇదే ఇపుడు ప్రచారంలో కూడా ఉంది. పర్యవసానంగా అంతా వారే అన్నట్లుగా పరిస్థితి మారింది.

వారు ఏమి చెబితే అదే జరుగుతోందని ఒక విధంగా షాడో ఎమ్మెల్యేలుగా వారు మారిపోయారని అంటున్నారు. ఇక ప్రతీ విషయం వారు కనుసన్నలలోనే సాగుతోందని వారికి తెలియకుండా ఎమ్మెల్యే కూడా ఏమీ చేయడం లేదని అంటున్నారు. దీతో ఉద్యోగుల బదిలీల నుంచి కాంట్రాక్టుల కేటాయింపులు అధికారిక వ్యవహారాలు అన్నీ కూడా ఈ ఇద్దరే చక్కదిద్దుతున్నారని అంటున్నారు. వీరి వల్ల మేలు జరగకపోగా పార్టీకి చెడ్డ పేరు వస్తోందని ప్రభుత్వానికి ఇబ్బందిగా ఉందని అంటున్నారు.

ఇక అశోక్ గజపతి రాజు అయితే అను నిత్యం కార్యకర్తలతో మమేకం అయ్యేవారు. ఆయనకు క్షేత్ర స్థాయిలో జరిగే ప్రతీ విషయం మీద అవగాహన ఉండేదని అంటున్నారు. అందుకే ఆయన సుదీర్ఘ కాలం ఎమ్మెల్యేగా గెలిచి జనం గుండెలలో నిలిచారు అని అంటున్నారు. దానికి భిన్నంగా వారసురాలి పాలన సాగుతోంది అని అంటున్నారు. ఎంతసేపూ షాడోల మీద ఆధారపడడం వల్ల సమస్యలు వస్తున్నాయని అంటున్నారు. తాజాగా చూస్తే విజయనగరం కార్పోరేషన్ లో ఏకంగా 28 మంది అధికారులను ఒక్కసారిగా బదిలీ చేయడం సంచలనం అయింది. దీని వెనక షాడోల ప్రమేయం ఉందని అంటున్నారు. ఈ తరహా పరిణామాలు పార్టీలో మొదటి నుంచి ఉంటూ వస్తున్న సీనియర్ నేతలకు ఏ మాత్రం జీర్ణించుకోలేనివి గా ఉన్నాయని చెబుతున్నారు. మరి ఎమ్మెల్యే తీరు మార్చుకుని షాడోల పాలనకు చెక్ పెట్టకపోతే రానున్న రోజులలో పర్యవసనాలు కూడా వేరేగా ఉండొచ్చు అని అంటున్నారు. చూడాలి మరి ఏమి జరుగుతుందో. ఈ ప్రచారంలో ఏ మేరకు నిజం ఉందో.

# ఒక్క ఛాన్స్ అంటున్న తమ్ముళ్లు...

గుంటూరు, మే 19, ఒక్క 'ఛాన్స్'- ఈ మాట ఏపీ ప్రజలకు కొత్తకాదు. నాయకులకు కూడా కొత్తకాదు. అయితే.. ఇప్పుడు ఈ మాట క్షేత్రస్థాయినాయకుల నోటి నుంచి వినిపిస్తోంది. పదవులు దక్కని వారు కూటమి పార్టీల్లో చాలా మంది ఉన్నారు. వారంతా ఒక్క ఛాన్స్ కోసం వేచి చూస్తున్నారు. మరో 1000కిపైగా పోస్టులను భర్తీ చేయాల్సి ఉందని చెబుతున్నారు. అదే సమయంలో మంత్రి వర్గంపై ఆశలు పెట్టుకున్న టీడీపీ సీనియర్లు కూడా వేచి చూస్తున్నారు. ఇక, వైసీపీ విషయానికి వస్తే.. పార్టీ పరంగా పుంజుకుంటుందో లేదో వారు అంచనాలు వేసుకుంటున్నారు. వచ్చే ఎన్నికల నాటికి కూడా పార్టీ పుంజుకునే పరిస్థితి లేకపోతే.. ఎవరిక వారు సొంత దారులు వెతుక్కు నేందుకు తమ ఛాన్స్ తాము చూసుకునేందుకు రెడీ అవుతున్నారు. ఇలాంటి వారిలో ఎక్కువ మంది జనసేనపైనే ఆశలు పెట్టుకున్నట్టు తెలుస్తోంది. ఇప్పటికిప్పుడు జనసేన ఒంటరి పోరుకు రెడీ అవుతుందన్న క్లూ ఇచ్చినా.. పదుల సంఖ్యలో పెద్ద నేతలు వైసీపీకిరాం రాం చెప్పడం ఖాయమని తెలుస్తోంది. తమ కు అనుకూలంగా ఉండే పార్టీలనే ఎంచుకుంటున్నారు. కొన్ని కొన్ని నియోజకవర్గాల్లో వైసీపీ శిబిరాలు ఖాళీ అయ్యాయి. నాయకులు ఉన్నా..జెండా మోసే కార్యకర్తలు లేరు. వీరంతా కూడా.. తమకు కలిసి వచ్చిన పార్టీ కోసం వేచి ఉన్నారు. మహిళా నాయకులది కూడా దాదాపు ఇదే దారిగా కనిపిస్తోంది. వచ్చే ఎన్నికల నాటికి నియోజకవర్గాల పునర్విభజన ఉంటే సరే.. లేకపోతే.. తమకు అవకాశం ఇచ్చే పార్టీవైపు చూస్తున్న వారు లెక్కలు వేస్తున్నవారు కూడా పెరుగుతున్నా రు.. పదవులు దక్కే అవకాశం తక్కువగానే ఉందని అంచనా వేస్తున్నవారు.. రాజకీయాలకు దూరంగా ఉండాలని భావిస్తున్నారు. అదేసమయంలో అవకాశం కోసం చూస్తున్న వారసులు రాజకీయాలను వేడెక్కిస్తున్నారు. ఇలా.. రకరకాలుగా రాష్ట్రంలో రాజకీయాలు మార్పు దిశగా అడుగులు వేస్తున్నాయి. ఎవరి నోట విన్నా.. ఒక్క ఛాన్స్ కోసం చూస్తున్నామన్న మాటే వినిపిస్తుండడ గమనార్హం. మరి ఆ ఛాన్స్ ఏ పార్టీ ఇస్తే. ఆ పార్టీకే ఇప్పుడు జై కొట్టేందుకు నాయకులు సిద్ధపడడం గమనార్హం.

# కేంద్ర మంత్రి పదవికి ఈటల రాజేందర్ పేరు..?

## తెలంగాణ బీజేపీలో జోరుగా ప్రచారం



హైదరాబాద్ తెలంగాణ రాజకీయాల్లో సంచలనంగా మారిన భగీరథ్ పోక్సో కేసు వ్యవహారం ఇప్పుడు ఢిల్లీ రాజకీయ వర్గాల్లో కూడా హాట్ టాపిక్గా మారినట్లు రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది. రాష్ట్రంలో పెరుగుతున్న రాజకీయ పరిణామాలు, కేంద్ర మంత్రివర్గంలో మార్పులపై ఊహాగానాల మధ్య తెలంగాణకు చెందిన నేతలకు కీలక బాధ్యతలు అప్పగించే అవకాశాలపై జోరుగా ప్రచారం జరుగుతోంది. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం రెండేళ్ల పాలన పూర్తి చేసుకోనున్న నేపథ్యంలో కేంద్ర మంత్రివర్గంలో భారీ పునర్వ్యవస్థీకరణ జరిగే అవకాశమున్నట్లు ఢిల్లీ భారతీయ జనతా పార్టీ వర్గాల్లో చర్చ నడుస్తోంది. ఇదే సమయంలో రాష్ట్రాల వారీగా రాజకీయ సమీకరణాలు, సామాజిక వర్గాల ప్రాతినిధ్యం, రాబోయే ఎన్నికల వ్యూహాలను దృష్టిలో పెట్టుకుని కొన్ని కీలక మార్పులు ఉండొచ్చన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ క్రమంలో తెలంగాణకు చెందిన పలువురు నాయకుల పేర్లు చర్చకు వస్తుండగా, ముఖ్యంగా మల్కాజ్గిరి ఎంపీ, తెలంగాణ ఉద్యమకారుడిగా గుర్తింపు పొందిన ఈటల రాజేందర్ పేరు ప్రముఖంగా వినిపిస్తున్నట్లు సమాచారం. ఆయనకు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి పదవి అప్పగించే అవకాశాలపై ఢిల్లీ రాజకీయ, భారతీయ జనతా పార్టీ వర్గాల్లో జోరుగా ప్రచారం సాగుతున్నట్లు సమాచారం.

తెలంగాణలో బీసీ సామాజిక వర్గ సమీకరణాలు, పార్టీ విస్తరణ, రాబోయే ఎన్నికల వ్యూహాలు, రాష్ట్రంలో భారతీయ జనతా పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా అధిష్టానం ఆలోచిస్తున్న నేపథ్యంలో ఈటల రాజేందర్కు కీలక బాధ్యతలు అప్పగించే అవకాశాలపై ఊహాగానాలు వినిపిస్తున్నాయి. మరోవైపు కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ పదవిపై కూడా రాజకీయ చర్చ మొదలైంది. భగీరథ్ పోక్సో కేసు నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా రాజకీయ విమర్శలు, ప్రతిపక్ష పార్టీల నిరసనలు, సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్న చర్చలతో బండి సంజయ్పై ఒత్తిడి పెరిగినట్లు రాజకీయ వర్గాలు .అభిప్రాయపడుతున్నాయి. ఈ నేపథ్యంలో కేంద్ర మంత్రివర్గంలో తెలంగాణకు సంబంధించి మార్పులు జరిగే అవకాశాలపై ఊహాగానాలు వ్యక్తమవుతున్నాయి.

# వంట నూనెలపై భారం తప్పదా...



న్యూఢిల్లీ, మే 19, ప్రజలకు ధరల పోటు తప్పేలా లేదు. వంట నూనెల ధరలు పెరిగే సూచనలు కనిపిస్తున్నాయి. దీనికి కారణం కేంద్రం తీసుకోబోయే నిర్ణయమే.స్థానిక రైతులకు మద్దతివ్వడం, రూపాయిపై ఒత్తిడిని తగ్గించడం కోసం వంట నూనెలపై దిగుమతి సుంకాలను పెంచే ప్రతిపాదనను భారత ప్రభుత్వం పరిశీలిస్తోంది. వంట నూనెలపై అధిక దిగుమతి పన్నులు.. రైతులు తమ పంటలకు మెరుగైన ధరలు పొందేందుకు సాయపడతాయా, అలాగే భారీ సరుకుల దిగుమతులతో ముడిపడి ఉన్న విదేశీ మారక ద్రవ్య ప్రవాహాలను అరికట్టగలవా అనే విషయాన్ని అధికారులు సీరియస్ గా పరిశీలిస్తున్నారు.ఈ ఏడాది ఆసియాలో రూపాయి అత్యంత బలహీనమైన కరెన్సీగా కొనసాగుతోంది. వంట నూనెలు, ఎరువులు, బంగారం, ముడి చమురు వంటి దిగుమతి చేసుకునే వస్తువులపై ఆధారపడటాన్ని తగ్గించేందుకు ప్రభుత్వం ప్రయత్నాలను ముమ్మరం చేస్తున్న తరుణంలో ఈ చర్చలు జరుగుతున్నాయి. ఈ నెల ప్రారంభంలో వంట నూనెతో సహా దిగుమతి చేసుకునే వస్తువులపై ఆధారపడటాన్ని తగ్గించుకోవాలని ప్రధాని రేంద్ర మోదీ దేశ ప్రజలను కోరారు. అంతేకాదు అనవసరమైన దిగుమతులను అరికట్టేందుకు గత వారం బంగారం, వెండిపై దిగుమతి సుంకాన్ని 15 శాతానికి పెంచిన సంగతి తెలిసిందే.భారతదేశం తన వంట నూనె అవసరాలలో దాదాపు 60% దిగుమతి చేసుకుంటుంది. తద్వారా ప్రపంచంలోనే వంట నూనెల అతిపెద్ద కొనుగోలుదారుగా ఉంది. దిగుమతి సుంకాలలో ఏ పెరుగుదల అయినా ప్రధానంగా ఇండోనేషియా, మలేషియా, అర్జెంటీనా, బ్రెజిల్, రష్యా, యుక్రెయిన్ నుండి దిగుమతి అయ్యే పామాయిల్, సోయాబీన్, సన్ ఫ్లవర్ నూనెల రవాణాను ప్రభావితం చేయొచ్చు.ప్రపంచవ్యాప్తంగా ఆహార ధరలు వేగంగా పెరుగుతున్న తరుణంలో ఈ ప్రతిపాదన కూడా వచ్చింది. ఇరాన్ సంఘర్షణ సరఫరా గొలుసులకు అంతరాయం కలిగించి వంట నూనెలు, ధాన్యాలు, మాంసం ఉత్పత్తుల ధరలను పెంచింది.ప్రపంచంలో అత్యంత విస్తృతంగా ఉపయోగించే వంట నూనె అయిన పామాయిల్.. సంఘర్షణ ప్రారంభమైనప్పటి నుండి సుమారు 12% పెరిగింది. పెరుగుతున్న ఇంధన వ్యయాలను భర్తీ చేసుకునే ప్రయత్నంలో భాగంగా ఇండోనేషియా, మలేషియాలో బయో ఫ్యూయల్ ఉత్పత్తి పెరగడం కూడా ఈ పెరుగుదలకు పాక్షికంగా కారణమైంది. అయితే, దిగుమతి సుంకాలను పెంచడానికి భారత్ తీసుకోబోయే చర్య కొనుగోళ్లను నెమ్మదింపజేసి, ఇటీవలి ధరల పెరుగుదలను అదుపు చేయగలదు.కాగా, దిగుమతి సుంకాల పెంపుపై ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదని తెలుస్తోంది. దేశీయ ధరలను తగ్గించి, ప్రాసెసర్లకు ఉపశమనం కల్పించే ప్రయత్నంలో భాగంగా గత సంవత్సరం ముడి పామ్, సోయాబీన్, సన్ ఫ్లవర్ నూనెలపై ప్రాథమిక దిగుమతి సుంకాన్ని 20% నుండి 10%కి తగ్గించింది కేంద్రం. సుంకం తగ్గింపు వల్ల కలిగే ప్రయోజనాలను వినియోగదారులకు అందించాలని పరిశ్రమను కోరింది ప్రభుత్వం.ఇదిలా ఉండగా, పెరుగుతున్న ముడి చమురు ధరల ఒత్తిడి కారణంగా భారత రూపాయి మరింత బలహీనపడి, సోమవారం అమెరికా డాలర్తో పోలిస్తే 96.35 వద్ద రికార్డ్ కనిష్ట స్థాయికి పడిపోయింది.


# పొగలో ప్రజల వంటలు

## ప్రచారాల్లో మాత్రమే అభివృద్ధి: గ్యాస్ కొరతపై కట్టెల పొయ్యితో నిరసన తెలిపిన ఎంపీ గడ్డం వంశీకృష్ణ



పెద్దపల్లి గ్యాస్ కొరతతో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రతిబింబిస్తూ, పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ కట్టెల పొయ్యిపై స్వయంగా వంట చేస్తూ నిరసన తెలిపారు.ఈ సందర్భంగా ఎంపీ గారు మాట్లాడుతూ, "దేశం అంతర్జాతీయ వేదికలపై గొప్పగా కనిపించడం ఒక వైపు అయితే, గ్రామాల్లో ప్రజలు గ్యాస్ సిలిండర్ లేక మళ్లీ కట్టెలకు వెళ్లాల్సిన పరిస్థితి మరో వైపు ఉంది. ఇది కేంద్ర ప్రభుత్వ విధానాల వైఫల్యానికి నిదర్శనం" అన్నారు.గ్యాస్ సరఫరాలో తీవ్ర అంతరాయం ఏర్పడడంతో పేద మరియు మధ్యతరగతి కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలు మళ్లీ పొగలో వంట చేయాల్సి రావడం దురదృష్టకరమన్నారు.ప్రచారాలకంటే ప్రజల ప్రాథమిక అవసరాలపై దృష్టి పెట్టాలని, గ్యాస్ సరఫరాను తక్షణమే పునరుద్ధరించాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఎంపీ డిమాండ్ చేశారు.ప్రజల సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ వారి తరఫున పోరాటం కొనసాగిస్తామని ఎంపీ స్పష్టం చేశారు.

# కమల్ హాసన్ స్ఫూర్తిదాయక నిర్ణయం - ప్రశంసల వెల్లువ



సినిమా పరిశ్రమ క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొంటున్న ఈ సమయంలో యూనివర్సల్ స్టార్ కమల్ హాసన్ తీసుకున్న ఒక నిర్ణయం ఇప్పుడు అందరి ప్రశంసలు అందుకుంటోంది.ప్రైవేట్ చార్టర్స్, లగ్జరీ ట్రావెల్స్ను పక్కన పెట్టి సాధారణ ఎకానమీ ఫ్లైట్లో ప్రయాణిస్తూ నేరుగా షూటింగ్ సెట్స్కు వెళ్లిన కమల్ హాసన్ సింప్లిసిటీ స్ఫూర్తిగా నిలిచింది.ఎంత స్టార్ డమ్ ఉన్నప్పటికీ సినిమాపై ప్రేమ, బాధ్యత ముఖ్యమని కమల్ హాసన్ మరోసారి నిరూపించారు.ప్రస్తుతం సినీ పరిశ్రమ కొత్త ఆలోచనల వైపు అడుగులు వేస్తున్న సమయంలో ఆయన తీసుకున్న ఈ నిర్ణయం ఇండస్ట్రీకి ఒక స్ఫూర్తిదాయకమైన సందేశంగా మారింది.పరిశ్రమ కోసం మార్పు మన నుంచే మొదలుకావాలనే కమల్ హాసన్ తీసుకున్న చొరవకు సోషల్ మీడియాలో ప్రశంసలు అందుతున్నాయి.

సినిమా రంగంలో జరగబోయే గొప్ప మార్పులకు ఇది తొలి అడుగు కానుంది.

# కేంద్ర కేబినెట్ విస్తరణ...?

న్యూఢిల్లీ, మే 19, దేశంలో ఐదు రాష్ట్రాల ఎన్నికలు ముగిసిపోయాయి. ఆయా రాష్ట్రాల్లో కొత్త ప్రభుత్వాలు కూడా ఏర్పడ్డాయి. ఇప్పుడు కేంద్రం వంతు వచ్చింది. మిషన్ 2029కి ఇప్పటి నుంచే మోడీ సన్నాహాలు మొదలు పెట్టినట్లుగా తెలుస్తోంది. ప్రభుత్వంలోనూ.. పార్టీలోనూ కీలక మార్పులు చేయాలని భావిస్తున్నట్లుగా సమాచారం. 2029లో తిరిగి అధికారంలోకి రావడమే లక్ష్యంగా భారీ మార్పులు జరగవచ్చని సంకేతాలు వెలువడుతున్నాయి.ఈనెల 26తో మోడీ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తి కాబోతుంది. ఈ నేపథ్యంలో కేంద్ర కేబినెట్ను విస్తరించాలని భావిస్తున్నారు. మోడీ తన మొదటి, రెండవ పర్యాయాల్లో మంత్రివర్గాన్ని క్రమం తప్పకుండా విస్తరించారు. ప్రస్తుత మంత్రివర్గంలో 72 మంది సభ్యులు ఉండగా.. గరిష్టంగా 81 మంది మంత్రులను నియమించుకునే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో మంత్రివర్గ విస్తరణ చేయాలని భావిస్తున్నారు.ఇక ఇటీవల బీహార్, ఉత్తరప్రదేశ్లోని ఎన్డీఏ ప్రభుత్వాలు కూడా తమ మంత్రివర్గాలను విస్తరించాయి. బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నవీన్ తన బృందాన్ని కూడా ఏర్పాటు చేస్తారని తెలుస్తోంది. ఈ క్రమంలోనే కేంద్ర మంత్రివర్గంలో మార్పులు జరుగుతాయనే ఊహాగానాలకు ఆజ్యం పోసింది.గత రెండు పర్యాయాలను పరిశీలిస్తే.. ప్రభుత్వం ఏర్పడిన ఆరు నెలల తర్వాత నవంబర్ 2014లో మోడీ తన మంత్రివర్గాన్ని తొలిసారిగా విస్తరించారు. సుమారు ఏడాదిన్నర తర్వాత జూలై 2016లో రెండవ విస్తరణ జరిగింది. సెప్టెంబర్ 2017లో జరిగిన మొదటి పర్యాయపు చివరి విస్తరణలో పలువురు మంత్రులకు పదోన్నతి లభించింది. ఇక రెండవ పర్యాయంలో ప్రభుత్వం ఏర్పడిన దాదాపు రెండేళ్ల తర్వాత జూలై 2021లో మంత్రివర్గాన్ని తొలిసారిగా విస్తరించారు. మే 2023లో పోర్ట్ఫోలియోల పునర్వ్యవస్థీకరణ జరిగింది. ఇక మోడీ జూన్ 9, 2024న మూడవసారి ప్రమాణ స్వీకారం చేశారు. ఇప్పుడు రెండేళ్లు పూర్తికాబోతున్నాయి. ఫలితంగా మళ్లీ మంత్రివర్గ విస్తరణపై ఊహాగానాలు తీవ్రమయ్యాయి. ప్రస్తుతం మంత్రివర్గంలో 72 మంది సభ్యులు ఉండగా.. గరిష్టంగా 81 మంది మంత్రులను నియమించవచ్చు. కొంతమంది కొత్తవారికి అవకాశం ఇచ్చే అవకాశం ఉన్నప్పటికీ.. వారి పనితీరు ఆధారంగా కొంతమంది ప్రస్తుత మంత్రులను తొలగించాలనే చర్చ కూడా జరుగుతోంది. వచ్చే ఏడాది ఏడు రాష్ట్రాల్లో జరగనున్న ఎన్నికల దృష్ట్యా ప్రాంతీయ, కుల సమతుల్యత సాధించబడుతుందని భావిస్తున్నారు. ఒకవేళ విస్తరణ జరిగితే బీహార్ నుంచి ప్రాధాన్యత దక్కవచ్చని ఊహాగానాలు వినిపిస్తున్నాయి.ఇక బీజేపీ వర్గాల సమాచారం మేరకు.. పలువురు కొత్త ముఖాలను జాతీయ ప్రధాన కార్యదర్శులుగా నియమించే అవకాశం కూడా ఉంది. యువ అధ్యక్షుడు నితిన్ నబిన్తో సమన్వయం కొనసాగించేందుకు రాష్ట్రాల నుంచి జాతీయ స్థాయికి తీసుకువస్తారని తెలుస్తోంది.

# మంత్రివర్గ ప్రక్షాళనకు రెడీ

హైదరాబాద్, మే 19, తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటయి రెండున్నరేళ్లు కావస్తుంది. ఇప్పటికీ మంత్రివర్గంలో పూర్తిగా భర్తీ చేయలేదు. ఇంకా మంత్రివర్గంలో రెండు స్థానాలు ఖాళీలున్నాయి. ఎప్పటికప్పుడు మంత్రివర్గంలో ఖాళీలను భర్తీ చేస్తామని ఊరిస్తూనే ఉన్నారు. కానీ ఇంతవరకూ భర్తీ చేయకపోవడంతో ఆశావహుల్లో నిరాశ కలుగుతుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీ వెళ్లినప్పుడల్లా పార్టీ పెద్దలతో మంత్రివర్గ విస్తరణపై చర్చించడానికి అంటూ ప్రచారం జరుగుతుండటం, రేవంత్ రిక్త హస్తాలతో తిరిగి రావడం సాధారణంగా మారింది. స్థానిక సంస్థల ఎన్నికలు ఇంకా పూర్తి కావాల్సి ఉంది. అవి పూర్తయిన తర్వాతనే మంత్రివర్గ విస్తరణ ఉంటుందని పార్టీలో ప్రచారం జరుగుతుంది.తెలంగాణలో పంచాయతీ, మున్సిపల్ ఎన్నికలు ముగిశాయి. ఇక గ్రేటర్ హైదరాబాద్ కార్పొరేషన్ తో పాటు ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు జరగాల్సి ఉంది. ఈ ఎన్నికలు ముగిసిన తర్వాత రేవంత్ రెడ్డి ప్రస్తుతం ఉన్న మంత్రివర్గంలో పూర్తి స్థాయి ప్రక్షాళన చేయాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. రెండున్నరేళ్లు కొందరికి మంత్రిగా అవకాశం కల్పించాం కాబట్టి, వారిని తప్పించి, వారి స్థానంలో కొత్త వారిని నియమించుకోవాలన్నది రేవంత్ రెడ్డి ఆలోచనగా ఉంది. ఇది పూర్తి స్థాయి ఎన్నికల టీంగా రేవంత్ రెడ్డి ఏర్పాటు చేసుకోవాలని భావిస్తున్నట్లు చెబుతున్నారు. అయితే అందుకు హైకమాండ్ నుంచి గ్రీన్ సిగ్నల్ అందాల్సి ఉంటుంది.ప్రస్తుత మంత్రివర్గంలో సామాజికవర్గం పరంగా కొందరిని తప్పించాల్సిన పరిస్థితులున్నాయి. అలాగే పనితీరు ఆధారంగా మరికొందరిని బయటకు పంపాల్సిన అవసరం ఉంది. అలాగే 2028 ఎన్నికల్లో పార్టీకిమంచి ఊపు తెచ్చే వారిని ఎంపిక చేసుకుని ముందుకు వెళ్లాలన్న భావనలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నారు. ప్రధానమైన వారిని కొందరిని అలాగే ఉంచి జిల్లాల వారీగా కొందరిని మార్చి, కొత్త వారికి అవకాశాలను కల్పిస్తే అందరికీ అవకాశం దొరికినట్లవుతుందని, అప్పుడు అసంతృప్తి, అసహనాలు ఉండవన్న అంచనాలో రేవంత్ రెడ్డి ఉన్నారు. ఈ మేరకే ఢిల్లీకి వెళ్లినప్పుడల్లా హైకమాండ్ ఎదుట ఈ ప్రతిపాదన పెట్టినా అందుకు హైకమాండ్ సుముఖత వ్యక్తం చేయకపోవడంతో అందుకు సరైన సమయం కోసం వేచి చూస్తున్నారని తెలిసింది.

# యూ టర్న్ ల విజయ్...



చెన్నై, మే 19, రాజకీయ నాయకులు నాలుక మడత పెట్టడం కొత్తేమీ కాదు. మడమ తిప్పడం కూడా వింత కాదు. పైగా దేశవ్యాప్తంగా క్రెడిట్ చోరీ రాజకీయాలు దర్జాగా సాగుతున్నాయి. గొప్పగా ఉంటే నాది అని.. చెత్తగా ఉంటే అవతలివాడిదని చెప్పుకోవడం ఇప్పటి కాలంలో అలవాటుగా మారింది. ఇలాంటి వ్యవహారాలకు తలలు పండిన రాజకీయ నాయకులు పాల్పడుతుంటారు. ఇది తప్పా? ఒప్పా? అనే విషయాలను పక్కన పెడితే.. ఇటువంటి వ్యవహారాలు రాజకీయ నాయకులకు అలవాటుగా మారిపోతున్నాయి.తలలు పండిన రాజకీయాలు మాత్రమే కాదు.. కొత్తగా రాజకీయాల్లోకి వచ్చిన వారు కూడా ఇలాంటి వ్యవహారాలకు పాల్పడటం నిజంగా ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. తమిళనాడులో ముఖ్యమంత్రిగా విజయ్ ప్రమాణ స్వీకారం చేసి పది రోజులు కూడా కావడం లేదు. పైగా ఆయన అధికారాన్ని దక్కించుకోవడానికి అనేక రకాల ప్రయత్నాలు చేశారు. పుష్ప సినిమా మాదిరిగా సోఫాలు కూడా పంపించారు.. ఎన్డీఏ కూటమిలో ఉన్న ఏఐడీఎంకే మద్దతు తీసుకోబోనని చెప్పిన ఆయన.. కొద్ది రోజులకే మాట మార్చారు. అసెంబ్లీలో బలపరీక్ష నెగ్గడానికి ఆయన అన్నాడీఎంకే సపోర్ట్ తీసుకోవాలి.. అంతేకాదు ఇంకా అనేక రకాలుగా ఆయన నాలుక మడత పెడుతూనే ఉన్నారు. కేవలం ఈ పది రోజుల్లోనే ఆయన ఈ పని చేయడం నిజంగా ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది.తన వ్యక్తిగత జ్యోతిష్యుడిని ముఖ్యమంత్రి కార్యాలయంలో ఉన్నతమైన అధికారిగా విజయ్ నియమించుకున్నారు. దీనిపై ప్రతిపక్షాలు తీవ్రస్థాయిలో మండిపడ్డాయి. హేతువాద సంఘాలు తోడయ్యాయి. దీంతో విజయ్ వెనక్కి తగ్గక తప్పలేదు. పైగా జ్యోతిష్యుడి నియామకం పట్ల వెంటనే స్పందించారు విజయ్. 24 గంటల్లో అతడు నియామకాన్ని రద్దు చేశారు.సనాతన ధర్మాన్ని డీఎంకే ఎమ్మెల్యే ఉదయనిధి తీవ్రంగా విమర్శించారు. ఆ సమయంలో విజయ్ సైలెంట్ గా ఉన్నారు. ఇప్పుడు విజయ మంత్రివర్గంలో కీలక మంత్రి అధర్వ.. బహిరంగంగానే ఉదయనిది వ్యాఖ్యలను తప్పుపట్టారు. ఇది ఆ పార్టీలో ఉన్న అంతర్గత వ్యవహారాలను బయటపెట్టింది.ఎన్డీఏ కూటమికి అనుకూలంగా ఉండే ఏ పార్టీ మద్దతు తీసుకోబోమని విజయ్ ప్రకటించారు. ఫ్లోర్ టెస్ట్ సమయంలో సిద్ధాంతాన్ని పక్కన పెట్టి ఏఐడీఎంకే కు చెందిన 25 మంది తిరుగుబాటు ఎమ్మెల్యేల సపోర్ట్ తీసుకున్నారు.ఎన్నికల ప్రచారం సమయంలో ప్రతి మహిళకు 2500 ఆర్థిక సహాయం చేస్తామని విజయ ప్రకటించారు. అయితే ఆ పథకాన్ని ఇంతవరకు ప్రారంభించలేదు. పైగా ఇప్పుడు అమల్లో ఉన్న వెయ్యి రూపాయల పథకాన్ని కూడా నిలిపివేస్తామని.. దానిని పునర్ వ్యవస్థీకరిస్తామంటూ చెబుతున్నారు.స్థూలంగా చూస్తే తమిళనాడు సీఎం పరిపాలనకు.. అరవింద్ కేజ్రీవాల్ వ్యవహరించిన తీరుకు పెద్దగా తేడా కనిపించడం లేదు. సోషల్ మీడియాలో విజయ్ గురించి కొంతమంది గొప్పగా చెప్పవచ్చు. పి ఆర్ టీం రకరకాల వీడియోలను విడుదల చేయవచ్చు. కానీ అంతిమంగా ఫీల్డ్ రియాలిటీ మాత్రమే నిలబడుతుంది. ఎందుకంటే రీల్ కంటే రియల్ చాలా విలువైనది.

# 28 నుంచి భారీగా పెరగనున్న ధరలు

## 3 రకాలుగా సాగు భూముల విలువ సవరణ

హైదరాబాద్, మే 19, తెలంగాణవ్యాప్తంగా వ్యవసాయ, వ్యవసాయేతర భూములు, అపార్ట్‌మెంట్ల ప్రభుత్వ మార్కెట్ విలువను సుమారు 50 శాతం వరకు పెంచేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. బహిరంగ మార్కెట్ ధరలకు, ప్రభుత్వ విలువలకూ మధ్య ఉన్న భారీ వ్యత్యాసాన్ని తగ్గించడమే లక్ష్యంగా ఈ నెల 28 నుంచి కొత్త ధరలను అమలు చేయాలని భావిస్తున్నారు. దీనివల్ల ప్రభుత్వానికి ఏటా రూ.1500 కోట్ల అదనపు ఆదాయం సమకూరనుంది.

ముఖ్యంగా ఓఆర్ఆర్ లోపల, హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లోని ఐటీ కారిడార్లు, కమర్షియల్ జోన్లలో ఈ పెంపు ఉండనుంది.

తెలంగాణవ్యాప్తంగా రియల్ ఎస్టేట్ రంగానికి కీలకమైన భూముల రిజిస్ట్రేషన్ విలువల సవరణకు ప్రభుత్వం ముమ్మర సన్నాహాలు చేస్తోంది. గ్రామీణ ప్రాంతాలు, జాతీయ రహదారులు, పట్టణాలకు సమీపంలో ఉన్న సాగు, సాగేతర స్థిరాస్తుల విలువలను సగటున 50 శాతం వరకు పెంచాలని స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ నిర్ణయించింది. బహిరంగ మార్కెట్ ధరలకు, సర్కారు నిర్ణయించిన విలువలకు మధ్య కొండంత వ్యత్యాసం ఉండటమే దీనికి ప్రధాన కారణం. ప్రముఖ ఆర్థికవేత్త అరవింద్ సుబ్రహ్మణ్యం కమిటీ సిఫార్సులను పరిగణనలోకి తీసుకుని ఈ ప్రక్రియను చేపడుతుండగా.. ప్రజలపై ఒకేసారి భారీ భారం పడకుండా ఉండాలని రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులకు స్పష్టం చేశారు. ఈ నెల 28 నుంచే కొత్త రేట్లను అమల్లోకి తెచ్చే అవకాశం ఉంది.ఈ సవరణ ప్రకారం.. రాష్ట్రంలో ప్రస్తుతం ఎకరా వ్యవసాయ భూమి కనిష్ఠ ప్రభుత్వ విలువ రూ.1.75 లక్షలు ఉండగా.. దానిని రూ.2.75 లక్షలకు పెంచనున్నారు. ఇక ఓఆర్ఆర్ పరిధి లోపల డిమాండ్ ఎక్కువగా ఉన్నందున ఎకరా కనిష్ఠ విలువను రూ.8.75 లక్షల నుంచి రూ.15 లక్షలకు పెంచాలని నిర్ణయించారు. వట్టినాగులపల్లి వంటి హాట్ స్పాట్లలో బహిరంగ మార్కెట్ ధర ఎకరాకు రూ.100 కోట్లకు పైగా పలుకుతుండగా.. ప్రస్తుతం అక్కడ కేవలం రూ.2 నుంచి రూ.2.5 కోట్లుగా ఉన్న ప్రభుత్వ విలువను రూ.4 కోట్లకు సవరించనున్నారు. హైదరాబాద్ మహానగర పరిధిలోని దాదాపు 350 ప్రాంతాలలో స్థానిక మార్కెట్ డిమాండ్‌ను బట్టి విడివిడిగా ధరలను ఖరారు చేయనున్నారు. జూబ్లీహిల్స్ లాంటి ఏరియాల్లో గజం విలువ రూ.80 వేల నుంచి రూ.90 వేలకు పెరిగే అవకాశం ఉంది.అపార్ట్‌మెంట్లు, కమర్షియల్ కాంప్లెక్స్‌ల ఫ్లాట్ల చదరపు అడుగు ధరల్లో కూడా 75 శాతం వరకు మార్పులు రానున్నాయి. ప్రస్తుతం చదరపు అడుగు రూ.3500 నుండి రూ.4000 వరకు ఉన్న విలువల స్థానంలో రూ.6000 వరకు నిర్ధారించనున్నారు.

అదేవిధంగా వాణిజ్య ప్రాంతాలలో బహిరంగ మార్కెట్ ధరలు రూ.8000 నుండి రూ.12000 వరకు ఉండటంతో ప్రభుత్వ ల్యాండ్ వాల్యూను రూ.6600గా ఫిక్స్ చేయాలని అధికారులు భావిస్తున్నారు.

వంద అడుగుల రోడ్లు, ప్రధాన లింక్ రోడ్లు ఉన్న ఏరియాల్లో స్థానిక వృద్ధిని బట్టి రేట్లు పెరగనున్నాయి.ప్రస్తుతం స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ద్వారా ఏడాదికి రూ.15 వేల కోట్ల ఆదాయం లభిస్తుండగా.. ఈ తాజా సవరణల ద్వారా ప్రభుత్వ ఖజానాకు అదనంగా మరో రూ.1500 కోట్ల రాబడి చేకూరనుంది. గతంలో 2021, 2022 సంవత్సరాల్లో చివరిసారిగా ఈ విలువల సవరణ జరిగింది. ఆ తర్వాత ఐటీ రంగ విస్తరణ, మౌలిక వసతుల మెరుగుదల వల్ల హైదరాబాద్ చుట్టుపక్కల విల్లాలు హైరైజ్ బిల్డింగుల నిర్మాణాలు పెరిగి భూముల ధరలు ఆకాశాన్నంటాయి. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. కాగా ఈ కొత్త ధరల అమలు ప్రక్రియను ప్రారంభించిన ఆరు నెలల తర్వాత మార్కెట్ సరళిని బట్టి అధికారులు మరోసారి సమీక్ష నిర్వహించనున్నారు.ఎకరం భూమి కనీసం పదిహేను లక్షలు పెరిగే అవకాశం ఉందని చెప్పారు.

అవుటర్ రింగ్ రోడ్డు, ఇన్నర్ రింగ్ రోడ్డు పరిధి ప్రామాణికంగా ధరలు పెంపు ఉంటుందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చెప్పారు. త్వరలోనే దీనిపై అధికారిక ప్రకటన ఉంటుందని ఆయన చెప్పారు.అరవింద్ సుబ్రహ్మణ్యం నివేదిక ఆధారంగా గత ప్రభుత్వం రెండుసార్లు భూముల ధరలు పెంచిందన్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి 2022 నుంచి భూములు ధరలు పెంచలేదని గుర్తు చేశారు. భూముల ధరలు పెరుగుతాయని దానితో పాటు ప్రభుత్వానికి రిజిస్ట్రేషన్ పరంగా ఆదాయం కూడా లభిస్తుందని చెప్పారు. వరంగల్ మున్సిపాలిటీ పరిధిలో అభివృద్ధి పనులను వేగవంతం చేయనున్నామని చెప్పారు.

# బండి భగీరధ్ కేసులో క్రెడిట్ వార్




హైదరాబాద్, మే 19, బండి భగీరథ్‌పై నమోదైన పోక్సో కేసు ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో పెను తుపానును సృష్టిస్తోంది. ఈ కేసు కేవలం చట్టపరమైన పరిధిని దాటిపోయి రాజకీయంగా మారింది. బీజేపీ, కాంగ్రెస్ ను ఒకే గాటన కట్టేందుకు బీఆర్ఎస్ ప్రయత్నిస్తోంది. మరో వైపు అధికార కాంగ్రెస్ , బీజేపీ మధ్య ఒక హై-వోల్టేజ్ మైండ్ గేమ్ కు వేదికైంది. తెలంగాణ రాజకీయాలు ఇప్పుడు బండి భగీరథ్ కేసు చుట్టూ తిరుగుతున్నాయి. బీజేపీ దశ మారుస్తారని భావిస్తున్న కీలక నేత కుమారుడు కావడం.. భగీరథ్‌పై పోక్సో చట్టం కింద కేసు నమోదు కావడం, ఆయన లొంగిపోవడం వంటి పరిణామాలు రాష్ట్రంలో రాజకీయ వేడిని పెంచాయి. ఈ కేసును కాంగ్రెస్ సర్కార్ ఒక బలమైన రాజకీయ ఆయుధంగా మలచుకుంటుండగా, బీజేపీ దీనిని హనీ ట్రాప్‌గా అభివర్ణిస్తూ ఎదురుదాడికి దిగుతోంది. అదే సమయంలో బీఆర్ఎస్ రెండు పార్టీలు కలిసి బాధితురాలికి అన్యాయం చేస్తున్నాయని ఆరోపిస్తోంది. బండి సంజయ్ బర్తరఫ్‌కు కేటీఆర్ డిమాండ్ చేస్తున్నారు. ఆయన మంత్రిగా ఉంటే.. కేసును ప్రభావితం చేస్తారని అంటున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ విషయంలో అత్యంత వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నారు. కేసు నమోదైన నాటి నుంచే దర్యాప్తులో ఎందుకు జాప్యం జరుగుతోందని డీజీపీని ప్రశ్నించడం ద్వారా, తన ప్రభుత్వం చట్టం అమలులో ఎవరికీ మినహాయింపు ఇవ్వదని గట్టి సందేశం పంపారు. కేంద్ర మంత్రి కుమారుడైనా సరే వదిలేది లేదని చెప్పడం ద్వారా, ప్రజల్లో తన ఇమేజ్‌ను పెంచుకోవడానికి కాంగ్రెస్ ప్రయత్నిస్తోంది. ముఖ్యంగా మహిళల భద్రత, పోక్సో కేసుల తీవ్రతను ప్రస్తావిస్తూ బీజేపీని ఆత్మరక్షణలో పడేసేలా కాంగ్రెస్ తన సోషల్ మీడియా విభాగాన్ని రంగంలోకి దింపింది.మరోవైపు బీజేపీ ఈ కేసును నేరుగా బండి సంజయ్ రాజకీయ ప్రతిష్టపై జరిగిన దాడిగా చిత్రీకరిస్తోంది. ప్రధాని మోదీ సభ , హిందూ ఏక్తా యాత్రల సమయంలోనే ఈ కేసును వెలుగులోకి తేవడం వెనుక లోతైన కుట్ర ఉందని బండి సంజయ్ ఆరోపిస్తున్నారు. నన్ను రాజకీయంగా ఎదుర్కోలేకే నా కుమారుడిని టార్గెట్ చేశారు అనేది బీజేపీ ప్రధాన వాదన. అంతేకాకుండా, బాధితురాలు మైనర్ కాదని, ఆమెకు రెండు వేర్వేరు పుట్టిన తేదీ ధృవీకరణ పత్రాలు ఉన్నాయనే వార్తలను బీజేపీ సోషల్ మీడియాలో వైరల్ చేస్తూ వచ్చింది. అయితే బీజేపీకి ఏదీ కలసి రాలేదు. బాధితురాలు మైనర్‌గా తేలడంతో జైలుకు వెళ్లక తప్పలేదు. ఈ గొడవ వల్ల క్షేత్రస్థాయిలో బీజేపీ కార్యకర్తలు మరింత దూకుడుగా వ్యవహరిస్తున్నారు. ఇది కేవలం భగీరథ్ వ్యక్తిగత విషయం కాదని, పార్టీ గౌరవానికి సంబంధించిన అంశంగా వారు భావిస్తున్నారు. కాంగ్రెస్ మాత్రం తన న్యాయ పాలనను ప్రజల్లోకి తీసుకెళ్లడానికి దీనిని ఒక ఉదాహరణగా చూపిస్తోంది. ఈ రెండు పార్టీలను ప్రజల్లో దోషులుగా నిరూపించాలని బీఆర్ఎస్ ప్రయత్నిస్తోంది. రాబోయే రోజుల్లో ఈ కేసు దర్యాప్తు వేగం పుంజుకునే కొద్దీ తెలంగాణ రాజకీయం మరిన్ని మలుపులు తిరగడం ఖాయం.

కొత్త కేసులతో ఇబ్బందులు

బండి సాయి భగీరథ్‌పై నమోదైన పోక్సో కేసులో పోలీసులు మరో కీలక నిర్ణయం తీసుకున్నారు. దర్యాప్తు ముమ్మరం చేసిన కొద్దీ ఈ కేసులో రోజుకో కొత్త ట్విస్ట్ వెలుగులోకి వస్తోంది. తాజాగా ఈ కేసులో పోలీసులు నిందితుడు బండి భగీరథ్‌పై మరింత కఠినమైన బీఎన్ఎస్ సెక్షన్‌ను జోడించారు. ఒకే బాధితురాలిపై పలుమార్లు అత్యాచారానికి పాల్పడినట్లు అభియోగాలు ఉండటంతో పోలీసులు ఈ కొత్త సెక్షన్‌ను నమోదు చేసినట్లు తెలుస్తోంది.ఈ కేసుకు సంబంధించి బండి భగీరథ్‌పై భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) లోని 64(2)(ఎ) సెక్షన్‌ను అదనంగా చేర్చారు. తీవ్రమైన నేరాలకు సంబంధించిన ఈ సెక్షన్‌ను జోడించడంతో నిందితుడికి చట్టపరంగా ఇబ్బందులు మరింత పెరిగే అవకాశం ఉందని న్యాయ నిపుణులు భావిస్తున్నారు. ఈ కొత్త కేసు ప్రకారం తప్పు చేసినట్లు రుజువైతే భగీరథ్‌కు 10 ఏళ్ల వరకు జైలుశిక్ష పడుతుందని తెలుస్తోంది. బాధితురాలి నుంచి సేకరించిన మరికొన్ని వివరాలు, సాంకేతిక ఆధారాల ప్రకారమే పోలీసులు ఈ చర్యలు చేపట్టినట్లు సమాచారం.మరోవైపు, ప్రస్తుతం రిమాండ్ ఖైదీగా చర్లపల్లి జైలులో శిక్ష అనుభవిస్తున్న బండి సాయి భగీరథ్‌ను కలిసేందుకు ఆయన కుటుంబ సభ్యులు సిద్ధమయ్యారు. జైలు నిబంధనల ప్రకారం నేడు వారు చర్లపల్లి జైలుకు వెళ్లి ములాఖత్ ద్వారా భగీరథ్‌ను కలవనున్నారు. కఠినమైన సెక్షన్లు తోడవడంతో తదుపరి లీగల్ ప్రాసెస్, బెయిల్ పిటిషన్లపై ఈ ములాఖత్‌లో కుటుంబ సభ్యులు, న్యాయవాదులు చర్చించే అవకాశం ఉందిబండి భగీరథ్ పోక్సో కేసులో పోలీసులు దర్యాప్తును వేగవంతం చేశారు. గత కొన్ని రోజులుగా సోషల్ మీడియా వేదికగా నిందితుడికి మద్దతుగా విపరీతంగా ప్రచారం నిర్వహిస్తూ, అతడు నిర్దోషి అని చిత్రీకరించే ప్రయత్నం చేసిన పలువురు సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్లపై కేసులు నమోదయ్యాయి. ఈ వ్యవహారంలో మొత్తం 27 మంది ఇన్‌ఫ్లూయెన్సర్లపై ఫిర్యాదులు రాగా, ప్రాథమిక విచారణ అనంతరం అందులో 14 మందిపోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. మిగిలిన వారిపై కూడా దర్యాప్తు కొనసాగుతోందని, త్వరలోనే తదుపరి చర్యలు తీసుకుంటారని అధికారులు తెలిపారు.

# అమీర్ పేట జంక్షన్ లో ఎన్టీఆర్ విగ్రహం..

హైదరాబాద్, మే 19, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల సందర్భంగా తాను మాట ఇచ్చినట్లు టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు శరవేగంగా ఏర్పాట్లు చేస్తున్నారు. హైదరాబాద్ నగరంలోని అత్యంత రద్దీగా ఉండే అమీర్ పేట చౌరస్తాలో తెలుగువారి అన్న ఎన్టీఆర్ విగ్రహం ప్రతిష్టించేందుకు పనులు ప్రారంభమయ్యాయి. సెటిలర్లు, టీడీపీ సానుభూతిపరులు, ఎన్టీఆర్ అభిమానుల ఓట్లే టార్గెట్ గా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ విషయంలో వ్యూహాత్మకంగా పావులు కదుపుతున్నారని అంటున్నారు. తెలంగాణ గడ్డపై టీడీపీ అనుకూల వ్యాఖ్యలు చేస్తే రాజకీయంగా నష్టం జరుగుతుందనే అనుమానాలను పటాపంచలు చేస్తూ సీఎం రేవంత్ రెడ్డి అడుగులు వేస్తున్నారని వ్యాఖ్యానిస్తున్నారు. అమీర్‌పేట్ లోనే కాకుండా, హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డు సమీపంలో 'ఎన్టీఆర్ లిటరేచర్ కమిటీ' వంద అడుగుల విగ్రహానికి సీఎం రేవంత్ రెడ్డి చర్యలు తీసుకోవడంపై ఆసక్తికర చర్చ జరుగుతోంది. తెలుగుజాతి గర్వించదగ్గ మహానాయకుడు, దివంగత నేత నందమూరి తారక రామారావు అంటే రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రజలకు ఒక ఎమోషన్. పార్టీలకు అతీతంగా అన్నగారిని ఆరాధించే కోట్లాది మంది అభిమానులు రెండు రాష్ట్రాల్లో ఉన్నారు. ఎన్టీఆర్ అభిమానులు ఎక్కువగా ఆయన స్థాపించిన టీడీపీకి అనుకూలంగా ఉంటారు. అయితే తెలంగాణ ఏర్పాటు తర్వాత టీడీపీ ఉనికి కోల్పోగా, ఆ పార్టీ సానుభూతిపరులు, అభిమానులు మాత్రం తరచూ తమ ప్రభావం చూపడానికి ప్రయత్నిస్తుంటారని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతుంటారు. ప్రధానంగా హైదరాబాద్ నగరంలో భారీగా ఉండే టీడీపీ సానుభూతిపరులను ఆకర్షించడానికి తెలంగాణ పార్టీలు విస్తృతంగా ప్రయత్నిస్తుంటాయి. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో ఈ విషయమై పెద్ద డిబేట్ కూడా కొనసాగింది. ఆ సమయంలో కీలకమైన టీడీపీ సానుభూతిపరుల ఓటర్లను కైవసం చేసుకోడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యూహాత్మకంగా పావులు కదిపారు. అమీర్‌పేట్ లో ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారని గుర్తు చేస్తున్నారు. రేవంత్ రెడ్డి ఇక ఎన్నికల ప్రచార సమయంలో అమీర్‌పేట్ జంక్షన్ వద్ద సీనియర్ ఎన్టీఆర్ భారీ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తానని రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీని నిలబెట్టుకునేలా ప్రస్తుతం పనులు మొదలయ్యాయి. ఎమ్మెల్యే నవీన్ యాదవ్ ఆధ్వర్యంలో విగ్రహ ఏర్పాటు పనులు తాజాగా ప్రారంభించారు. ప్రస్తుతం పునాది పనులను ప్రారంభించారని ఇది పూర్తయిన వెంటనే విగ్రహాన్ని ఏర్పాటు చేసి అవిష్కరిస్తారని అంటున్నారు. హైదరాబాద్‌లో అమీర్‌పేట్, మైత్రీవనం ప్రాంతాలంటే నిత్యం లక్షలాది మంది విద్యార్థులు, ఉద్యోగులు, సాధారణ ప్రజలతో కిటకిటలాడే అత్యంత కీలకమైన జంక్షన్లు. అలాంటి చోట ఎన్టీఆర్ విగ్రహాన్ని ప్రతిష్ఠించడం వెనుక ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యూహాత్మక రాజకీయ అడుగులు ఉన్నాయనే చర్చ నడుస్తోంది.తెలుగుదేశం పార్టీ నుంచి తన రాజకీయ ప్రస్థానం ప్రారంభించిన సీఎం రేవంత్ రెడ్డి రాష్ట్రంలో ఆ పార్టీ ఓటర్లను కాంగ్రెస్ వైపు మళ్లించే ప్రణాళికలో భాగంగా పకడ్బందీగా వ్యూహం రచిస్తున్నారని అంటున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో రాష్ట్రంలో టీడీపీ తిరిగి బలపడటం సాధ్యం కాదని, టీడీపీ ఓటర్లు తన నాయకత్వం కిందకు రావాలని బలమైన సంకేతాలు పంపేలా సీఎం రేవంత్ రెడ్డి వ్యవహరిస్తున్నారని విశ్లేషిస్తున్నారు. ఈ వ్యూహం అమలులో భాగంగా అమీర్‌పేట్ లో విగ్రహం ఏర్పాటుకు చకచకా పనులు జరుగుతున్నాయని, మరోవైపు ఔటర్ రింగ్ రోడ్డు సమీపంలో 'ఎన్టీఆర్ లిటరేచర్ కమిటీ' ప్రతిపాదించిన 100 అడుగుల ఎన్టీఆర్ విగ్రహం, ఎన్టీఆర్ నాలెడ్జ్ సెంటర్ ఏర్పాటుకు కూడా సానుకూల నిర్ణయం తీసుకున్నారని అంటున్నారు.

# ఎదురెదురుగా ఢీకొన్న బైకులు.. ఒకరు మృతి



గన్నవరం- కంకిపాడు రోడ్డులో రెండు ద్విచక్ర వాహనాలుఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఒకరు మృతి చెందగా.. మరొకరికి తీవ్ర గాయాలు అయ్యాయి.మృతుడుకేసరపల్లి గ్రామానికి చెందిన వేముల శేషగిరి(33)గా గుర్తించారు. మరొకరికి తీవ్ర గాయాలు కావడంతో 108 వాహనంలో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉయ్యూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కంకిపాడు పోలీసులు దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# 63 అంతస్తులతో స్కైవెన్ ప్రాజెక్ట్

ప్రీమియం లగ్జరీ నివాసాలను అందించేందుకు ఈస్ట్రాన్, పింగ్లే వెంచర్స్ అండ్ రియాల్టీ (పీవీఆర్) సంస్థలు 'ది స్కైవెన్' పేరుతో హైదరాబాద్ కోకాపేట్ లో 63 అంతస్తుల నివాస భవనాన్ని కి సంబంధించిన పోస్టర్ను బంజారాహిల్స్ లోని పార్క్ హయత్ హోటల్లో బ్రోచర్ను ప్రారంభించారు. రెండెకరాల్లో 233 మీటర్ల ఎత్తుతో నిర్మిస్తున్న ఈ స్కైస్క్రాపర్ లో పెంట్ హౌస్లు, స్కై విల్లాలు, నాలుగు బెడ్రూమ్స్ ఇళ్లు అందుబాటులో ఉంటాయి.

# రియల్ ఎస్టేట్ లో పుష్పరాజ్...

హైదరాబాద్, మే 19, ఆయన ఒకప్పుడు కలెక్టర్ గా పని చేశారు. తన తెలివితేటలతో భారీగా భూములు సంపాదించారు. హైదరాబాద్ చుట్టుపక్కల ప్రాంతంలో విపరీతంగా భూములు కొన్నారు. ఆ భూములు ఇప్పుడు వేలకోట్ల ఆస్తులు అయ్యాయి. కలెక్టర్ గా ఉన్నప్పుడు ఇప్పటి ముఖ్యమంత్రికి ఆయన పాదాభివందనం కూడా చేశారు. కలెక్టర్ ఉద్యోగానికి స్వచ్ఛందంగా రాజీనామా చేశారు. ఓ రాజకీయ పార్టీలో చేరారు. ఇప్పుడు ఏకంగా ఎమ్మెల్సీగా పనిచేస్తున్నారు.ఇప్పుడు ఆయన చేతిలో ఎన్నో కీలకమైన ప్రాజెక్టులు ఉన్నాయి. హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్ దగ్గర ఉన్న ఓ కాస్ట్లీ ప్రాంతంలో ఎకరం భూమిని ఆయన ఏకంగా 100 కోట్లు పెట్టి కొన్నారు. ఇటువంటి కోట్లు ఆయనకు లెక్క కావు. లెక్కలోకి కూడా రావు. ఇప్పుడు ఏకంగా ఆయన దాదాపు పదికి మించిన ప్రాజెక్టులను చేతుల్లో పెట్టుకున్నారు. తెల్లాపూర్ ప్రాంతంలో 13 ఎకరాల విస్తీర్ణంలో అపార్ట్మెంట్ నిర్మించారు. ఇందులో 1500 ప్లాట్లు అందుబాటులో ఉన్నాయి. ఇదే తెల్లాపూర్లో మరో చోట 24 ఎకరాల్లో బహుళ అంతస్తులు నిర్మించారు. ఇందులో ఏకంగా మూడు వేల ప్లాట్లు అందుబాటులో ఉన్నాయి. తెల్లాపూర్ ప్రాంతంలో 21 ఎకరాల విస్తీర్ణంలో అతిపెద్ద అపార్ట్మెంట్ నిర్మించారు. ఇందులో కూడా 3500 ప్లాట్లు అందుబాటులో ఉన్నాయి. తెల్లాపూర్ ప్రాంతంలో ఏడు ఎకరాల విస్తీర్ణంలో అపార్ట్మెంట్ నిర్మించారు. ఇందులో 500 ప్లాట్లు అందుబాటులో వచ్చాయి.హైదరాబాద్ నగరంలో అత్యంత ఖరీదైన నియో పోలీస్ ఏరియాలో ఏడు ఎకరాలలో బహుళ అంతస్తులు నిర్మించారు. ఇదే ఏరియాలో 8 ఎకరాల విస్తీర్ణంలో 600 ప్లాట్లు నిర్మించారు. నార్సింగి, మంచిరేవుల, కోకాపేట, అత్తాపూర్, గచ్చిబౌలి వంటి ప్రాంతాలలో దాదాపు ఐదువేల ప్లాట్ల విస్తీర్ణంతో బహుళ అంతస్తులను నిర్మించారు.

ఒక రకంగా తెలంగాణ రియల్ ఎస్టేట్లో ఒకప్పుడు అపర్ణ, మై హోమ్, జనప్రియ వంటి కంపెనీలు నెంబర్ వన్ స్థానంలో ఉండేవి. కానీ ఆ కంపెనీలను ఈ మాజీ కలెక్టర్ కంపెనీ దాటేసింది. హైదరాబాదులోనే దాదాపు పదివేల ప్లాట్ లకు మించిన సామర్థ్యంతో బహుళ అంతస్తులు నిర్మిస్తోంది. కొన్ని ప్రాంతాల్లో అయితే ఇప్పటికే భారీగా భూములను కొనేసింది. ఈ ప్రకారం చూసుకుంటే ఆ మాజీ కలెక్టర్ రియల్ ఎస్టేట్ బిజినెస్ లో పుష్ప రాజ్ లాగా అవతరించే అవకాశం ఉందని బిజినెస్ ఎక్స్పర్ట్స్ చెప్తున్నారు.ఆయన ఒక పార్టీ నుంచి ఎమ్మెల్సీగా గెలిచినప్పటికీ.. ఇప్పుడు అధికార పార్టీతో దగ్గరగా ఉంటున్నట్టు తెలుస్తోంది. పైగా అధికార పార్టీలో ఒక కీలక నాయకుడితో ఇటీవల బంధుత్వం కూడా పెంచుకున్నారని సమాచారం. అందువల్లే ఈ స్థాయిలో రియల్ ఎస్టేట్ వ్యాపారంలో దూకుడు కొనసాగిస్తున్నారని.. వేల కోట్లను సులభంగా సంపాదిస్తున్నారని టాక్ వినిపిస్తోంది.

ఏది ఏమైనప్పటికీ ఏ ఎండకు ఆ గొడుగు పట్టడంలో ఈ మాజీ కలెక్టర్ సిద్ధహస్తుడని మార్కెట్ వర్గాలు చెవులు కోరుకుంటున్నాయి. చూడాలి మరి ఈ మాజీ కలెక్టర్ ఇంకా ఏ స్థాయిలో దూసుకుపోతారో.. ఇంకా ఏ రేంజ్ లో హైదరాబాద్ రియల్ ఎస్టేట్ మార్కెట్ ను తన చేతుల్లో పెట్టుకుంటారో..

# ట్రాన్స్ ఫర్ చేసిన అరగంటలోనే రివర్స్...

## సైబారాబాద్ కమిషనరేట్ లో ఏం జరుగుతోంది

హైదరాబాద్, మే 19, శాంతిభద్రతల పరిరక్షణలో రాష్ట్రంలోనే అత్యంత కీలకమైన, ప్రతిష్టాత్మకమైన సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ ఇప్పుడు బదిలీల గందరగోళంలో కొట్టుమిట్టాడుతోంది. పరిపాలనాపరమైన సమన్వయ లోపమో, లేక అంతర్గత ఒత్తిళ్లకు తలొగ్గడమో తెలియదు కానీ, ఇటీవల తీసుకున్న కొన్ని నిర్ణయాలు పోలీస్ శాఖలోనే తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. కాగితాలపై బదిలీల ఫైళ్లు పరుగులు పెడుతున్నా.. క్షేత్రస్థాయిలో మాత్రం స్టేషన్లు వెలవెలబోతున్నాయి. ఫలితంగా సిబ్బంది కొరతతో ఐటీ కారిడార్లో పోలీసింగ్ వ్యవస్థ తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటోంది.మే 2న సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో ఒకేసారి 65 మంది ఇన్స్పెక్టర్లను బదిలీ చేస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. సాధారణంగా ఇలాంటి భారీ బదిలీల వెనుక వారం రోజుల పాటు తీవ్రస్థాయిలో కసరత్తు జరుగుతుంది. కానీ, ఏమైందో ఏమో తెలీదు కానీ.. ఉత్తర్వులు వెలువడిన కొద్ది గంటల్లోనే ఆ ఆర్డర్లను నిలిపివేస్తూ (హోల్డ్ పెడుతూ) మరో ఆదేశం రావడం డిపార్ట్మెంట్లో కలకలం రేపింది. ఆర్డర్ వచ్చింది.. సీట్ మారుతుందనుకునే లోపే బ్రేక్ పడింది' అంటూ ఇన్స్పెక్టర్లు సైతం తలలు పట్టుకునే పరిస్థితి వచ్చింది. ఈ వెనకడుగు వెనుక రాజకీయ ఒత్తిళ్లు ఉన్నాయా? లేక అంతర్గత వ్యూహాత్మక లోపాలు ఉన్నాయా? అనే చర్చ జోరుగా సాగుతోంది.ఇన్స్పెక్టర్ల బదిలీల వ్యవహారం ఒక కొలిక్కి రాకముందే.. కమిషనరేట్ పరిధిలోని 32 మంది సబ్ఇన్స్పెక్టర్లను (ఎస్ఐలను) జోన్-6 చార్మినార్కు సరెండర్ చేస్తూ హుటాహుటిన ఉత్తర్వులు జారీ అయ్యాయి. పైగా, ఆర్డర్లు వచ్చిన వెంటనే వారందరినీ రిలీవ్ చేయడంతో వారంతా కొత్త ప్రాంతాల్లో రిపోర్ట్ చేయడానికి వెళ్ళిపోయారు.దీనికి బదులుగా హైదరాబాద్ సిటీ నుంచి మరో 32 మంది ఎస్ఐలను సైబరాబాద్కు కేటాయించాలనే ప్రతిపాదనలు అయితే సిద్ధం చేశారు కానీ, వారు క్షేత్రస్థాయిలో విధుల్లో చేరడానికి ఇంకా ముహూర్తం కుదరలేదు. వెళ్ళిన వారు వెళ్ళిపోయారు.. రావాల్సిన వారు రాలేదు. మధ్యలో స్టేషన్లలో ఉన్న సీట్లు ఖాళీగా ఉండిపోయాయి. దీనివల్ల మిగిలిన సిబ్బందిపై పనిభారం రెట్టింపు అయ్యింది.గ్లోబల్ సిటీగా ఎదుగుతున్న హైదరాబాద్కు గుండెకాయ లాంటి ఐటీ కారిడార్ పరిధిలోని పోలీస్ స్టేషన్లపై ఈ బదిలీల ప్రభావం తీవ్రంగా పడింది. మాదాపూర్, గచ్చిబౌలి, రాయదుర్గం, నార్సింగి, కూకట్పల్లి, బాచుపల్లి. అంతర్జాతీయ స్థాయి ఐటీ కంపెనీలు, లక్షలాది మంది ఉద్యోగుల రాకపోకలు, నిత్యం ట్రాఫిక్ జాంలు, వీఐపీల బందోబస్తులు, హై-ప్రొఫైల్ నేరాలు. ఇలాంటి అత్యంత సున్నితమైన, బిజీ స్టేషన్లలో ఎస్ఐల కొరత స్పష్టంగా కనిపిస్తోంది. శాంతిభద్రతల పరిరక్షణ,క్రైమ్ ఇన్వెస్టిగేషన్, రాత్రి పూట పెట్రోలింగ్, బాధితుల నుంచి ఫిర్యాదుల స్వీకరణ వంటి బాధ్యతలను కొద్దిమంది సిబ్బందే అదనపు షిఫ్టులు చేస్తూ నిర్వహించాల్సి వస్తోంది. సుదీర్ఘ గంటల పనివల్ల క్షేత్రస్థాయి సిబ్బంది తీవ్ర మానసిక, శారీరక ఒత్తిడికి లోనవుతున్నారు .సాధారణంగా పోలీసు సిబ్బంది లో ఒకరిని బదిలీ చేసినప్పుడు, ఆ స్థానంలో మరొకరు వచ్చి చేరేవరకు పాతవారిని రిలీవ్ చేయకూడదనేది' కనీస పరిపాలనా నియమం. కానీ సైబరాబాద్లో మాత్రం కాగితాల్లో భర్తీ చూపిస్తూ, క్షేత్రస్థాయిని ఖాళీ చేసేశారు. ఐటీ కారిడార్ లాంటి సున్నితమైన ప్రాంతాల్లో ఇలాంటి భద్రతా లోపాలు లేదా సిబ్బంది కొరత కొనసాగితే.. భవిష్యత్తులో అది శాంతిభద్రతల సమస్యలకు దారితీసే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, గందరగోళానికి గురైన బదిలీల ప్రక్రియను క్రమబద్ధీకరించి, ఐటీ కారిడార్ స్టేషన్లకు తక్షణమే పూర్తిస్థాయి సిబ్బందిని కేటాయించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# గ్రేటర్ ఎన్నికలకు గులాబీ ప్లాన్



హైదరాబాద్, మే 19, గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలకు ఇంకా సమయం ఉన్నప్పటికీ, భాగ్యనగర రాజకీయం అప్పుడే వేడెక్కింది. జీహెచ్ఎంసీ పీఠంపై మరోసారి గులాబీ జెండాను ఎగురవేయడమే లక్ష్యంగా బీఆర్ఎస్ తన వ్యూహాలకు పదును పెడుతోంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో అధిక స్థానాలను సాధించి తన పట్టును నిరూపించుకున్న బీఆర్ఎస్, అదే జోష్తో మున్సిపల్ ఎన్నికల బరిలోకి దిగేందుకు సమాయత్తమవుతోంది. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్వయంగా రంగంలోకి దిగి, ఓటర్ల జాబితా సవరణ నుంచి సభ్యత్వ నమోదు వరకు ప్రతి అంశాన్ని ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటూ కేడర్కు దిశానిర్దేశం చేస్తున్నారు.గత ఎన్నికల అనుభవాలను దృష్టిలో ఉంచుకుని, తమ పార్టీ సానుభూతిపరులైన ఓటర్ల పేర్లు జాబితా నుంచి గల్లంతు కాకుండా బీఆర్ఎస్ పకడ్బందీ చర్యలు చేపట్టింది. కేంద్ర ఎన్నికల సంఘం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియపై పార్టీ శ్రేణులను పూర్తిగా అలర్ట్ చేసింది. ఈ నెల 25 నుంచి ఈ ప్రక్రియ రాష్ట్రంలో ప్రారంభం కానుండటంతో, ప్రతి డివిజన్, పోలింగ్ బూత్ పరిధిలో ఓటర్ల జాబితాను క్షుణ్ణంగా పరిశీలించాలని కేటీఆర్ ఆదేశించారు.అయితే, ఈ ప్రక్రియను మానిటరింగ్ చేసేందుకు బూత్ లెవెల్ ఏజెంట్ల లిస్ట్ ఇవ్వాలని అధిష్టానం ఆదేశించగా, మొత్తం 119 నియోజకవర్గాల్లో 38 నియోజకవర్గాల నుంచి ఇంకా లిస్ట్ అందకపోవడంపై ఇటీవల పార్టీ అధినేత కేసీఆర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిని సీరియస్గా తీసుకున్న కేటీఆర్.. గ్రేటర్ హైదరాబాద్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలకు చెందిన ముఖ్య నేతలతో అత్యవసర సమావేశం నిర్వహించారు. గులాబీ క్యాడర్ బలంగా ఉన్న ప్రాంతాలపై ప్రత్యేక ఫోకస్ పెట్టాలని స్పష్టం చేశారు. కొత్త ఓటర్ల నమోదు, తప్పుల సవరణ, అర్హులైన ఓటర్ల వద్ద అవసరమైన అర్హత పత్రాలు ఉండేలా చూసే బాధ్యతను ఈ బీఎల్ఏలకు అప్పగించారు.2018, 2023 అసెంబ్లీ ఎన్నికల్లో హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో బీఆర్ఎస్ అత్యధిక స్థానాలను కైవసం చేసుకుంది. గతంలో వరుసగా రెండు సార్లు గ్రేటర్ మేయర్ పీఠాన్ని కూడా దక్కించుకుంది. ఈ నేపథ్యంలో ఎస్ఐఆర్ ప్రక్రియ వల్ల ఈ జిల్లాల్లోని ఓటర్లు ఎక్కువగా ప్రభావితం అయ్యే అవకాశం ఉందని భావించి, ముస్లిం మైనారిటీ ఓటు బ్యాంకుపై పార్టీ ప్రత్యేక దృష్టి సారించింది. పాతబస్తీ మినహా మిగిలిన అన్ని ప్రాంతాల్లో మైనారిటీలు బీఆర్ఎస్ వైపే నిలిచారు. అందుకే, తమ పార్టీ ఎమ్మెల్యేలు ఉన్న చోటా, లేని చోటా బూత్ ల వారీగా బీఎల్ఏలను నియమించి సానుకూల ఓట్లను కాపాడుకునేందుకు క్షేత్రస్థాయి యాక్షన్ ప్లాన్ సిద్ధం చేశారు.ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే వరకు వేచి చూడకుండా, ప్రజల్లోనే ఉండాలని మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు, డివిజన్ ఇంచార్జ్లను కేటీఆర్ ఆదేశించారు. గ్రేటర్ పరిధిలోని ప్రధాన సమస్యలైన డ్రైనేజీ వ్యవస్థ లోపాలు, తాగునీటి ఎద్దడి, దెబ్బతిన్న రోడ్లు, స్థానిక మౌలిక వసతుల కల్పనలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలు? లాంటి వాటిని ఎండగడుతూ ప్రజల్లోకి వెళ్లాలని దిశానిర్దేశం చేశారు. తెలంగాణ భవన్ వేదికగా కేటీఆర్ ఈ మొత్తం వ్యవహారాన్ని స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. దీనితో పాటు, డిజిటల్ పద్ధతిలో ప్రతి ఇంటిని టచ్ చేస్తూ ముమ్మరంగా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించాలని స్పష్టం చేశారు.ఎన్నికలకు ముందే వ్యూహాత్మక అడుగులు వేస్తూ, కేడర్లో జోష్ నింపుతున్న గులాబీ బాస్ ల చర్యలు గ్రేటర్ రాజకీయాల్లో సరికొత్త వేడిని పుట్టిస్తున్నాయి. రాబోయే మున్సిపల్ పోరులో గ్రేటర్ కోటపై మళ్లీ గులాబీ జెండా ఎగురుతుందో లేదో చూడాలి.

# హైడ్రాపై హోంశాఖకు ఫిర్యాదులు

హైదరాబాద్, మే 19, తెలంగాణలో సంచలనం సృష్టిస్తున్న 'హైడ్రా' కార్యకలాపాలు ఇప్పుడు వివాదాస్పదంగా మారాయి. హైకోర్టు ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను బేఖాతరు చేస్తూ హైడ్రా ముందుకు వెళ్తోందని బాధితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలంలోని సీయోట్ మారుతీ హిల్స్ కాలనీలో కోర్టు ఆదేశాలకు విరుద్ధంగా తవ్వకాలు జరుపుతున్నారని కాలనీ రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆరోపించింది.బషీర్బాగ్లో జరిగిన సమావేశంలో అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ.. 1990-92 మధ్య ప్రైవేటు పట్టా భూములను కొనుగోలు చేసి, అన్ని అనుమతులతో కాలనీని అభివృద్ధి చేశామని తెలిపారు. అయితే, 2016లో ఎఫ్టీఎల్ పరిధిని తప్పుగా చూపడం వల్ల 86 మంది ప్లాట్ యజమానులు తీవ్రంగా నష్టపోతున్నారని వివరించారు. ఈ విషయంలో జనవరి 5న హైకోర్టు ఎటువంటి తవ్వకాలు చేపట్టవద్దని మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చినప్పటికీ, హైడ్రా వాటిని లెక్కచేయకుండా పనులు కొనసాగిస్తోందని వారు పేర్కొన్నారు.మరోవైపు, హైడ్రా కమిషనర్ రంగనాథ్పై కేంద్ర హోం శాఖకు ఫిర్యాదు అందింది. సివిల్ సర్వీస్ నిబంధనలు-1968ని కమిషనర్ ఉల్లంఘించారని బీఆర్ఎస్ నేత ఎడ్ల సుధాకర్ రెడ్డి కేంద్ర హోం శాఖ అదనపు కార్యదర్శి రాకేశ్కుమార్ సింగ్కు ఫిర్యాదు చేశారు. అంబర్పేట మండలం సర్వే నంబర్ 563/1లోని బతుకమ్మకుంట భూవివాదం కోర్టు విచారణలో ఉండగా, ఆ అంశాలపై మీడియా ముందు తప్పుడు కథనాలు ప్రచారం చేస్తూ తన ప్రతిష్టను దెబ్బతీస్తున్నారని ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారు. కోర్టు పరిధిలో ఉన్న అంశాలను బహిరంగంగా చర్చించడం నిబంధనలకు విరుద్ధమని ఆయన విమర్శించారు. బాధితులకు న్యాయం చేయాలని , కోర్టు తీర్పులను గౌరవించాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

### లులు హైపర్ మార్కెట్ లో నాసిరకం నిల్వలు
### పలు ఆహార పదార్థాలతో పురుగులు

హైదరాబాద్ కూకట్పల్లి లులు హైపర్మార్కెట్లో ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీలు జరిపారు. పలు ఆహార పదార్థాల్లో పురుగులు, నాసిరకం నిల్వలు గుర్తించారు. కిచెన్లో అపరిశుభ్రత, పాడైపోయిన కూరగాయలు, పురుగుల సంచారం వెలుగులోకి వచక్చాయి. గడువు సమీపించిన ఆహార పదార్థాలపై తప్పుదారి పట్టించే లేబుళ్లు వున్నట్లు అధికారులు గుర్తించారు. శనగపిండి, ఆటా, పప్పుల్లో పురుగులను గుర్తించారు. గడువు ముగిసిన ఎఫ్ఎస్ఎస్ఏఐ లైసెన్స్తో ప్యాక్డ్ ఫుడ్ విక్రయం నడుస్తోంది. మాంస వ్యర్థాలతో మూసుకుపోయిన డ్రెయిన్లు వున్నాయి. సుమారు 150 కిలోల ఆహార పదార్థాలు స్వాధీనం చేసుకున్నారు. కల్తీ, అధిక కృత్రిమ రంగుల అనుమానంతో ఆహార నమూనాలు సేకరించారు.

### నన్ను చంపాలని చూస్తున్నారు
### పాస్టర్ అభినయ్ దర్శన్

విజయవాడ పాస్టర్ ప్రవీణ్ పగడాల లాగే నన్ను చంపాలని చూస్తున్నారు. పోలీసులు విచారణ మీద నాకు నమ్మకం లేదని పాస్టర్ అభినయ్ దర్శన్ అన్నారు. మంగళవారం తనపై జరిగిన దాడి తరువాత మీడియాతో అయన మాట్లాడారు. ప్రవీణ్ పగడాల నాలుగు బ్రాండ్లు తాగి యాక్సిడెంట్ చేసినట్లు దొంగ సాక్ష్యాలు సృష్టించారు. నాపై దాడి చేసిన వారిని వదిలేసి, నా అనుచరులను అరెస్టు చేశారు. నేనే నాపై దాడి చేసుకున్నట్లు తప్పుడు సాక్ష్యాలు సృష్టిస్తున్నారు. పాస్టర్లందరూ దొంగలే అనే తరహాలో చిత్రీకరిస్తున్నారు. నాపై దాడి వ్యవహారంలో ఎమ్మెల్యే విశ్వేశ్వర రాజుకి సంబంధం ఉందని అనుకోను. కొంతమందిపై నాకు అనుమానం ఉంది.. వారి పేర్లు త్వరలోనే బయట పెడతానని అన్నారు.


# పొగతో వాహనదారులకు ఇబ్బందులు



గుంటూరు... నల్లపాడులో రోడ్డుకాపర్ ఫాక్స్ బార్ ఎదురు మెయిన్ రోడ్డు పక్కన ఉన్న చెత్తను కాల్చడంతోపొగలు ఎగిసి పడుతున్నాయి. ఈ పొగ వాహనదారులకు ఇబ్బంది గా మారుతోంది. ఒక పక్క గుంటూరు జిల్లా కలెక్టర్ సీ.యం సాయి కాంత్ వర్మ,మున్సిపాలిటీ సిబ్బంది ఎవరు కుడా చెత్త తగులపెట్టవద్దు అని చెప్తున్నాను. కాని కొంత మందికి అది పట్టనట్టు చెత్తను కాలుస్తూనే ఉన్నారు.. దినికి సంబందించిన వారిపై చర్యలు తీసుకుంటారా లేదాఅని వేచి చూడాలి.

# కవాడిగూడలో మహిళ దారుణ హత్య

హైదరాబాద్ నగరంలోని గాంధీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కవాడిగూడలో ఓ మహిళ దారుణ హత్యకు గురైంది. కవాడిగూడలోని రత్నదీప్ బిల్డింగ్ నాలుగో అంతస్తులో శ్వేత అనే మహిళను గుర్తుతెలియని వ్యక్తి కత్తితో పొడిచి హత్య చేసి పరారయ్యాడు. సమాచారం అందుకున్న వెంటనే గాంధీనగర్ పోలీసులు, క్లూస్ టీం సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఘటనకు సంబంధించిన ఆధారాలను సేకరిస్తూ దర్యాప్తు చేపట్టారు. సీసీ కెమెరా ఫుటేజీల ఆధారంగా నిందితుడి వివరాలను గుర్తించే ప్రయత్నం చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. హత్యకు గల కారణాలపై విచారణ కొనసాగుతోంది.



# ఒస్మాన్నగర్ కేజీబీవీలో అదనపు తరగతి గదుల నిర్మాణానికి మంత్రి వివేక్ శంకుస్థాపన



సంగారెడ్డి, మే 19: కార్మిక మరియు గనుల శాఖ మంత్రి డా. జి. వివేక్ వెంకటస్వామి మంగళవారం సంగారెడ్డి జిల్లాలోని రామచంద్రాపురం మండలం, ఒస్మాన్నగర్ గ్రామంలోని కేజీబీవీ పాఠశాలలో అదనపు తరగతి గదుల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. రూ.60 లక్షల అంచనా వ్యయంతో ఈ పనులు చేపడుతున్నారు. సంగారెడ్డి జిల్లా పర్యటనలో భాగంగా ఈ కార్యక్రమానికి హాజరైన మంత్రికి స్థానిక నాయకుల ఘన స్వాగతం పలికారు. అనంతరం జిల్లాలోని పలు ప్రాంతాల్లో పర్యటిస్తూ వివిధ అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. భవిష్యత్ తరాల మెరుగైన భవిత కోసం రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొస్తోందని మంత్రి అన్నారు.

# పంచాయతీరాజ్ శాఖను మరింత పారదర్శకంగా తీర్చిదిద్దుదాం

**స్వచ్ఛ రథం తరహాలోనే గ్రీన్ షాప్ విధానం ప్రజల్లోకి తీసుకువెళ్లండి**

**రోడ్ల పురోగతి తెలిసేలా ప్రత్యేక డ్యాష్ బోర్డు**

**స్వమిత్వ కార్యక్రమంలో రెవెన్యూ, సర్వే శాఖలతో సమన్వయం అవసరం**

పంచాయతీరాజ్, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖల ఉన్నతాధికారులతో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. స్థానిక సంస్థలు చేసే అభివృద్ధి పనులు మరింత పారదర్శకంగా ప్రజలకు తెలియాలి. ఇందు కోసం ప్రత్యేకంగా ఒక పబ్లిక్ డాష్ బోర్డును తయారు చేయండి. దీనిలో రాష్ట్రంలో జరుగుతున్న రోడ్ల నిర్మాణం, సంబంధిత అభివృద్ధి పనులు, అలాగే రోడ్ల పరిస్థితి ఎప్పటికప్పుడు తెలుసుకునే వెసులుబాటు ప్రతి ఒక్కరికి కల్పించాలని అధికారులను ఆదేశించారు.



పంచాయతీరాజ్ శాఖ 2025-26 ఆర్థిక సంవత్సరానికి స్వర్ణ పంచాయతీ పోర్టల్ ద్వారా ఆన్ లైన్ విధానంతో పారదర్శకంగా పన్నులు వసూళ్లు చేసిందని చెప్పారు. పంచాయతీలు ఆదాయ వనరులు మరింత పెంచుకొని ముందుకు సాగాలని, ఇదే రీతిలో సమష్టి కృషిని కొనసాగించి వచ్చే ఆర్థిక సంవత్సరంలోనూ ఆ స్ఫూర్తిని కొనసాగించాలని సూచించారు. పంచాయతీరాజ్ శాఖ, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖల ఉన్నతాధికారులతో సోమవారం క్యాంపు కార్యాలయంలో పవన్ కళ్యాణ్ ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ పవన్ కళ్యాణ్ గారు ఇటీవల పంచాయతీరాజ్ శాఖ ప్రగతిపై చర్చించారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ "శాలిడ్ వేస్ట్ మేనేజ్మెంటులో భాగంగా తీసుకొచ్చిన స్వచ్ఛరథాల విధానం మంచి ఫలితాలను ఇస్తోంది. స్వచ్ఛందంగా ప్రజలు రథాల వద్దకు వచ్చి పొడి వ్యర్థాలను ఇచ్చి, నిత్యావసరాలను తీసుకెళ్లడం బాగుంది. దీన్ని ప్రతి నియోజకవర్గంలోనూ అమలు చేస్తున్నాం. ఈ విధానాన్ని మరింత విస్తరించేలా ఆలోచన చేయండి. దీంతోపాటు గ్రీన్ షాప్ పేరుతో తిరుపతి జిల్లాలో పైలెట్ ప్రాజెక్టుగా తీసుకొచ్చిన విధానాన్ని మరింత విస్తరించి, రాష్ట్రమంతటా అమలు చేయాలి. స్వచ్ఛరథాల ద్వారా ఏప్రిల్ నెలలో 18.86 లక్షల కేజీల చెత్తను సేకరించాం. ఆ వ్యర్థాల విలువ రూ. 3 కోట్ల వరకు ఉంటుంది. గ్రీన్ షాపులను ఇదే స్ఫూర్తితో ప్రజలకు దగ్గర చేయాలి. పొడి వ్యర్థాలను గ్రీన్ షాపుల్లో ఇస్తే, ప్రజలు నిత్యావసరాలను తీసుకెళ్లొచ్చని విస్తృత ప్రచారం కల్పించండి. తద్వారా ప్రజలకు పరిశుభ్రతపై అవగాహన పెంచండి రోడ్లు పూర్తి చేయడానికి నిర్దుష్ట సమయంపంచాయతీ రాజ్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో చేపడుతున్న రోడ్ల నిర్మాణ పనులు నిర్దుష్ట సమయంలో నాణ్యతతో పూర్తయ్యేలా చూడండి. రోడ్ల నిర్మాణం, పనుల పురోగతి ఎప్పటికప్పుడు తెలుసుకునేలా ప్రత్యేకమైన డ్యాష్ బోర్డును ప్రజలకు అందుబాటులోకి తీసుకురండి. రోడ్ల నిర్మాణ పనులను అధికారులు బాధ్యతగా తీసుకోవాలి. ప్రతి పని మొదలుపెట్టే ముందు కచ్చితంగా ఎప్పటిలోగా పూర్తి చేస్తామనేది సమయం పెట్టుకోండి. ప్రజల వినతుల ద్వారా వచ్చే ప్రతి రోడ్డు పని చక్కగా జరగాలి. ప్రజలకు శాఖ తరఫు నుంచి పూర్తి జవాబుదారీ తనం కనిపించాలి. రోడ్ల విషయంలో నాణ్యతకు పెద్దపీట వేయాలి. నిరంతరం క్షేత్రస్థాయి పరిశీలనలు ఉంటేనే రోడ్ల పరిస్థితి అర్థం అవుతుంది. దీనిపై ఉన్నతాధికారులు దృష్టి సారించాలి" అని చెప్పారు. ఈ సమావేశంలో పంచాయతీరాజ్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కాంతిలాల్ దండే, పంచాయతీరాజ్ కమిషనర్ కృష్ణతేజ, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగం ఈఎన్సీ బాలునాయక్ పాల్గొన్నారు.

# నీటిపారుదల రంగానికి కొత్త దిశ

**36 ప్రాజెక్టులకు స్పష్టమైన గడువులు**

**రాష్ట్ర జలవనరుల అభివృద్ధి శాఖ మంత్రి**

**డా.నిమ్మల రామానాయుడు**

అమరావతి, : రాష్ట్రంలోని మొత్తం 36 ప్రాజెక్టులకు స్పష్టమైన గడువు పెట్టుకుని పటిష్టమైన కార్యాచరణ ప్రణాళికత్ష పూర్తి చేయాలనే లక్ష్యాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు నిర్దేశించడం జరిగిందని రాష్ట్ర జలవనరుల అభివృద్ధి శాఖ మంత్రి డా.నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు. సోమవారం రాష్ట్ర సచివాలయం ప్రచార విభాగంలో మంత్రి నిమ్మల రామానాయుడు పాత్రికేయులతో మాట్లాడుతూ నేడు రాష్ట్ర ముఖ్యమంత్రి అధ్యక్షతన ఇరిగేషన్ ప్రాజక్టులపై సమగ్ర సమీక్ష జరిగిందని, ఇందులో 25 పాత ప్రాజెక్టులతో పాటు 11 కొత్త ప్రాజెక్టులను గుర్తించి ప్రాధాన్యతా క్రమంగా పూర్తి చేయాలనే లక్ష్యాన్ని నీటిపారుటల శాఖకు నిర్ధేశించడం జరిగిందన్నారు. ప్రతి ప్రాజెక్టుకు శంకుస్థాపన, పురోగతి, పూర్తి గడువులు ఖచ్చితంగా నిర్దేశించబడటం జరిగిందన్నారు. 2026?2028 కాలానికి 36 ప్రాజెక్టుల సమగ్ర కార్యాచరణ ప్రణాళిక?..గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిన 25 ప్రాజెక్టులతో పాటు, సీఎం గుర్తించిన మరో 11 ప్రాజెక్టులను కలిపి మొత్తం 36 ప్రాజెక్టులకు స్పష్టమైన ప్రాధాన్యతా క్రమం, దశలవారీ గడువులు, అమలు ప్రణాళిక రూపొందించబడిందన్నారు. 2026 జూలై నాటికి పోలవరం ఒఓఅ ద్వారా ఉత్తరాంధ్రకు నీటి సరఫరా, గుంటూరు ఛానల్ మోడరేషన్ పనుల శంకుస్థాపన, తుంగభద్ర కొత్త 33 గేట్ల ప్రారంభం వంటి కీలక పనులు అమలులోకి వస్తాయన్నారు. 2026 ఆగస్టు నాటికి వెలిగొండ ప్రాజెక్టు ఫేజ్?1 పూర్తి, అనంతపురం జిల్లాలో పేరూరు బ్రాంచ్ కెనాల్ శంకుస్థాపన, పాలేరు రిజర్వాయర్ పనులు ప్రారంభం కానున్నాయన్నారు. 2026 అక్టోబర్ నాటికి హంద్రీ?నీవా (ఊఔూా) ఫేజ్?2 పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకోవడం




జరిగిందన్నారు. నవంబర్ 2026లో నేరేడి బ్యారేజ్ శంకుస్థాపన జరగనుందన్నారు. 2026 డిసెంబర్ నాటికి పెన్నా?సర్వేపల్లి రిజర్వాయర్ పూర్తి చేయాలని నిర్ణయించడం జరిగిందన్నారు. 2027 జనవరి నాటికి మడ్డువలస స్టేజ్?2 పూర్తి కావడంతో పాటు నీవా బ్రాంచ్ కెనాల్ మూలపల్లి వరకు ప్రారంభం కానుందన్నారు. 2027 ఏప్రిల్ నాటికి హీరమండలం ఎత్తిపోతల లిఫ్ట్ పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకోవడం జరిగిందన్నారు. 2027 జూన్ నాటికి నాగావళి?చంపావతి నదుల అనుసంధానం, బుడమేరు వరద రక్షణ పనులు, కొల్లేరు ప్రక్షాళన, ముక్త్యాల ఎత్తిపోతల పథకం మరియు పోలవరం ప్రాజెక్టు పూర్తి చేయాలని ప్రణాళిక రూపొందించబడిందన్నారు. 2027 జూలై నాటికి వంశధార స్టేజ్?2, చింతలపూడి ఎత్తిపోతల పథకం, మహేంద్రతనయ?గజపతినగరం బ్రాంచ్ కెనాల్స్, తోటపల్లి డిస్ట్రిబ్యూటరీలు పూర్తి చేయాలని లక్ష్యం నిర్దేశించడం జరిగిందన్నారు. 2027 డిసెంబర్ నాటికి మూలపల్లి లిఫ్ట్ ద్వారా కళ్యాణి డ్యామ్ వరకు నీటి అనుసంధానం, మడకశిర బ్రాంచ్ కెనాల్, జంజావతి రిజర్వాయర్ ప్రాజెక్టు పూర్తి చేయాలని నిర్ణయించడం జరిగిందన్నారు. 2028 డిసెంబర్ నాటికి తారకరామ సాగర్, వేదావతి ఎత్తిపోతల ప్రాజెక్టు, అనంతపురం జిల్లాలో భైరవానితిప్ప (బఖ), అప్పర్ పెన్నార్ ప్రాజెక్టులు, ఉఔూా విస్తరణ (కడప?రాజంపేట?కోడూరు), సోమశిల?స్వర్ణముఖి లింక్ కెనాల్, గోదావరి డెల్టా ఆధునీకరణ (ఒఎఆంఖీ సర్వే ఆధారంగా), ూఖీఓఅ విస్తరణ (40,000 నుండి 80,000 క్యూసెక్కులకు), ఉఔూా కోడూరు వరకు విస్తరణ, అలాగే వరికపూడిశల ప్రాజెక్టు పూర్తి చేయాలని సమగ్ర లక్ష్య ప్రణాళిక రూపొందించబడిందన్నారు. ఈ విధంగా 2026 నుండి 2028 వరకు రాష్ట్ర నీటిపారుదల రంగాన్ని సమూలంగా మారుస్తూ, ప్రతి ప్రాజెక్టుకు స్పష్టమైన లక్ష్యం, గడువు, అమలు దిశను ప్రభుత్వం ఖరారు చేసిందని మంత్రి తెలిపారు.

## నడిరోడ్డుపై మూడు వాహనాలు దగ్ధం

రాజంపేట రైల్వే కోడూరు మండలం బాలుపల్లి చెక్ పోస్ట్ వద్ద ప్రమాదం జరిగింది. ఆగి వున్న లారీని వెనుక నుంచి ఇన్నోవా కారు ఢీకొంది. ఆ ఇన్నోవా కారును మరో కారు ఢీకొంది. ఘటనలో ముగ్గురికి గాయాలు అయ్యాయి. వారిని తిరుపతి ఆస్పత్రికి తరలించారు. మూడు వాహనాలు మాత్రం మంట్లో దగ్ధం అయ్యాయి. అగ్ని మాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు.

# ప్రభుత్వ యంత్రాంగంలో ఉన్న ప్రతీ ఒక్కరి సహకారం వల్లే వ్యవస్థలు గాడిలో పడ్డాయి

**పారదర్శకతతో ప్రతి ఒక్కరూ వ్యవహరించాలి**

**అధికారులు, సిబ్బందితో సీఎం చంద్రబాబు టెలీ కాన్ఫరెన్స్**

అమరావతి ఆర్టీజీఎస్ నుంచి జిల్లా కలెక్టర్లు, రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఉద్యోగులు, క్షేత్ర స్థాయి సిబ్బందితో సీఎం చంద్రబాబు టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రభుత్వ ప్రాధాన్యతలను టెలీకాన్ఫరెన్సులో వివరించారు. ప్రభుత్వ సేవల అమలు... అర్జీల పరిష్కారంపై సీఎం చంద్రబాబు దిశానిర్దేశం చేసారు. సుమారు 40 వేల మందితో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు.

టెలికాన్ఫరెన్సు ద్వారా క్షేత్ర స్థాయి అధికారులు ముఖ్యమంత్రితో నేరుగా మాట్లాడారు. ముఖ్యమంత్రితో కిందిస్థాయి ఉద్యోగులు మాట్లాడే అవకాశం కల్పించినందుకు పలువురు ఉద్యోగులు హర్షం వ్యక్తం చేసారు. కాకినాడ జిల్లాకు చెందిన ఉద్యోగి గృహ నిర్మాణానికి సంబంధించి కొన్ని సూచనలు చేసారు. స్పందించిన సీఎం మంచి సూచన చేశారు...అమలు చేస్తామంటూ సదురు ఉద్యోగికి చెప్పారు. ప్రజలకు సంతృప్తికర సేవలు అందించడంలో టాప్-3లో నెల్లూరు, తూర్పుగోదావరి, పల్నాడు జిల్లాల కలెక్టర్లు నిలిచారు.

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలన ధ్యేయంగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. విధ్వంసమైన రాష్ట్రాన్ని గాడిలో పెడుతున్నాం. అందరి సహకారం వల్లే బెస్ట్ రిఫార్మర్ ఆఫ్ ద ఇయర్ అవార్డు దక్కింది. ప్రభుత్వ యంత్రాంగంలో ఉన్న ప్రతీ ఒక్కరి సహకారం వల్లే వ్యవస్థలు గాడిలో పడ్డాయని అన్నారు. 2047 స్వర్ణాంధ్ర సాధనకు లక్ష్యాలు పెట్టుకున్నాం... పది సూత్రాలను అమలు చేస్తున్నాం. 23 నెలల్లో రూ. 23 లక్షల కోట్ల పెట్టుబడులు ఆకర్షించాం... 24 లక్షల ఉద్యోగాలకు అవకాశాలు వచ్చాయి. గూగుల్, ఆర్సెల్లార్ మిట్టల్, ఆమ్కా వంటి కీలక ప్రాజెక్టులు వచ్చాయి...త్వరలో బీపీసీఎల్ వంటి ప్రాజెక్టుకు శంప్రకుస్థాపన చేసుకుంటాం. ఆమ్కా ప్రాజెక్టు ద్వారా పుట్టపర్తి-బెంగళూరు మధ్య ఎరో స్పేస్ సిటీగా అభివృద్ధి జరుగుతుంది. టీంగా పని చేయాలి... అభివృద్ధి సాధించాలి. ప్రభుత్వంపై ప్రజలకు నమ్మకం కలిగేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలి. ఈ రెండేళ్ల కాలంలో ప్రజలకు ప్రభుత్వంపై నమ్మకం పెరిగింది. ప్రభుత్వ సేవలపై తీసుకుంటున్న ఫీడ్ బ్యాక్ లెక్కలే దీనికి నిదర్శనం. ప్రభుత్వ సేవల్లో పెన్షన్ల పంపిణీ కార్యక్రమం అగ్ర భాగాన నిలిచింది. ప్రభుత్వ సేవలు అందించడమే కాకుండా... ప్రజలతో సఖ్యతగా మెలగుతుండడం వల్లే పెన్షన్ల పంపిణీ టాప్ లో నిలిచిందని అన్నారు.

పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల అమల్లో ఏమైనా గ్యాప్ ఉంటే.. జిల్లా యంత్రాంగం అలెర్ట్ కావాలి. జిల్లాల్లో 80 శాతం మంది పనితీరు బాగుంది... అభినందనలు. ప్రతి ఒక్కరి పనితీరును విశ్లేషిస్తున్నాం... బాగా పని చేసిన వారిని గౌరవిస్తాం.. గుర్తిస్తాం. అర్జీల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి. ఆర్థిక-ఆర్థికేతర సమస్యలుగా విభజించుకుని పని చేయాలి. ఆర్థికేతర సమస్యలను 100 శాతం పరిష్కరించాల్సిందే. స్పీడ్ ఆఫ్ డెలివరింగ్ గవర్నెన్స్ అన్ని చోట్లా రావాలి. ఒఓఅం ప్రాజెక్టుకు 36 రోజుల్లో అనుమతులిచ్చి... శంకుస్థాపన కార్యక్రమం చేపట్టాం. ఒఓఅం ప్రాజెక్టు విషయంలో ప్రభుత్వం స్పందించిన తీరు చూసి జాతీయ స్థాయిలో చర్చ జరుగుతోంది.

అవినీతి అనేది కన్పించకూడదు.. పారదర్శకతతో ప్రతి ఒక్కరూ వ్యవహరించాలి. నెల్లూరు కలెక్టర్ చేసిన ప్రయోగాన్ని చూసి ప్రతి నియోజకవర్గంలో నాలుగు సార్లు పర్యటనలు చేసేలా ప్రణాళికలు రూపొందించాం. తాగునీరు సమస్యలు లేకుండా చర్యలు తీసుకుంటున్నాం.. దీనిపై క్షేత్ర స్థాయిలో మరింత అలెర్టుగా ఉండాలి. చిన్నచిన్న పనులైనా వెంటనే స్పందించండి.. సమస్యలను పరిష్కరించండి. ప్రభుత్వంపై ప్రజలకు నమ్మకం కలగాలి... అదే బ్రాండుగా మారాలి.

తక్కువ ఖర్చుతో ఇంపాక్ట్ చూపించేలా పనితీరు మెరుగుపర్చుకోవాలి. వేసవిలో తాగునీటి సమస్యలు ఉత్పన్నం కాకుండా చూసుకోవాలని అన్నారు.

# పొదుపు ఉద్యమానికి ఇ-సైకిళ్ల ఊతం

**స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు కార్యాలయాలకు ఇ-సైకిళ్లు**

**ఈవీ కంపెనీలతో సీఎం వీడియో కాన్ఫరెన్స్**

**ఈవీలు, ఛార్జింగ్ స్టేషన్ల ఏర్పాటుపై సీఎం చంద్రబాబు సమీక్ష**

అమరావతి, మే 18: ఇంధన పొదుపు కోసం చేపట్టే కార్యాచరణలో భాగంగా ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని పెంచేలా ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. ఆంధ్రప్రదేశ్ లో ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం ఉద్యమంగా మార్చేలా ప్రణాళికలు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. ఈవీ సైకిళ్లు, ఈవీ వాహనాల ను పెద్ద ఎత్తున ప్రోత్సహించేలా చర్యలు తీసుకోవాలని సీఎం దిశానిర్దేశం చేశారు. సోమవారం రాష్ట్ర సచివాలయం నుంచి ఈవీ కంపెనీల ప్రతినిధులతో వీడియో కాన్ఫరెన్సు ద్వారా మాట్లాడారు. రాష్ట్రంలో స్వర్ణ గ్రామ,స్వర్ణ వార్డు కార్యాలయాలకు ఎలక్ట్రిక్ సైకిళ్లు అందించేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. మొత్తం 16 వేల ఎలక్ట్రిక్ సైకిళ్లను ఆ కార్యాలయాల సిబ్బందికి అందించాలని సీఎం నిర్దేశించారు.ఈవీ వాహనాలను సులభంగా కొనుగోలు చేసేలా రుణాలను అందించే ప్రయత్నం చేయాలని.. దీని కోసం ఓ ప్రత్యేక ఎస్పీవీని ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. ఈఎంఐ విధానంలో ఈవీ సైకిళ్లను ఇచ్చేలా కార్యాచరణ చేపట్టాలన్నారు. ఎలక్ట్రిక్ వాహనాలతో పాటు ఛార్జింగ్ స్టేషన్ల లాంటి మౌలిక సదుపాయాలను కూడా ఏర్పాటు చేయాలని సూచించారు. ఛార్జింగ్ స్టేషన్లతో పాటు మౌలికసదుపాయాల కల్పించటంపై ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని సీఎం పేర్కొన్నారు.



# సిద్దిపేట జిల్లా వ్యాప్తంగా రైతులు అందోళన

సిద్దిపేట సిద్దిపేట జిల్లా వ్యాప్తంగా అన్నదాతలు రోడెక్కారు. నెల రోజులైనా ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేయడంలేదని రోడ్డెక్కి నిరసనకు దిగారు. రాయపోల్ మండల పరిధిలోని వీరానగర్ వద్ద, దుబ్బాక మండలం తిమ్మాపూర్ వద్ద, సిద్దిపేట మండలం పుల్లూరు వద్ద రోడ్డుపై బైఠాయించారు. వర్షం పడితే తీరని నష్టం కలుగుతుందని, వెంటనే పంట కొనుగోలు చేయాలని రైతుల డిమాండ్.

## భూ భారతి పేరిట అసైన్డ్ భూములు కొల్లగొడుతున్న కాంగ్రెస్ నాయకులు

హైదరాబాద్ కాంగ్రెస్ నేతలు భూభారతి పేరిట అసైన్డ్ భూమినలను కొల్లగొడుతున్నారని బీఆర్ఎస్ నేత క్రిశాంక్ ఆరోపించారు. అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్న అసైన్డ్ భూముల్లో ఎంపి వేం నరేందర్ రెడ్డి మైనింగ్ చేస్తున్నాడు. 2010లో, 2015లో వేం నరేందర్ రెడ్డి ఎలక్షన్ అఫిడవిట్లో అసైన్డ్ భూములు గురించి ఎక్కడా లేదు.. కాని 2026లోని ఎలక్షన్ అఫిడవిట్లో వాటి వివరాలు ఉన్నాయి. వేం నరేందర్ రెడ్డి భార్య విజయ లక్ష్మి పేరు మీద ఉన్న శ్రీ సాయి కృష్ణ గ్రానైట్స్ కంపెనీ కింద ఈ భూములు ఉన్నాయి. అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్న అసైన్డ్ భూముల సర్వే నంబర్, శ్రీ సాయి కృష్ణ గ్రానైట్స్ కంపెనీ ఉన్న భూములు ఒకటే సర్వే నంబర్ కింద ఉన్నాయి. అవి అసైన్డ్ భూములని ఆర్డీవో, అడిషనల్ కలెక్టర్, కలెక్టర్ సంతకాలు కూడా ఉన్నాయి. ఇందులో కచ్చితంగా పాత మహబూబాబాద్ కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ ప్రాత్ర కూడా ఉందని అయన అన్నారు. అందుకే వేం నరేందర్ రెడ్డి రాజ్య సభకి పోతు.. నువ్వు కూడా నా వెంట రా అని కలెక్టర్కి ఢిల్లీలోని తెలంగాణ భవన్లో స్పెషల్ సెక్రటరీ పదవి ఇప్పించాడని అన్నారు.

## హనుమాన్ విగ్రహం ధ్వంసం చేసిన గుర్తు తెలియని వ్యక్తులు

హనుమకొండ న్యూ శాయంపేటలో ఉద్రిక్తత నెలకొంది. హనుమాన్ విగ్రహాన్ని గుర్తు తెలియను వ్యక్తులు ధ్వంసం చేసిన విషయం తెలుసుకుని విగ్రహ ధ్వంస స్థలానికి హిందూ సంఘాలు, భక్తులు భారీగా చేరుకున్నారు. న్యూ శాయంపేట ప్రధాన రహదారిపై ధర్నా కు దిగడంతో వాహనాలు భారీగా నిలిచిపోయాయి. విగ్రహం ధ్వంసం చేసిన వారిపైన కఠినచర్యలు తీసుకోవాలని నిరసనకారులు డిమాండ్ చేసారు. హనుమాన్ భక్తులు, బజరంగదళ్ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్ఆరు. ఈ నేపథ్యంలో పోలీసులు హనుమాన్ భక్తులకు మధ్య తోపులాట జరిగింది. పరిస్థితి ఉద్రిక్తతంగా మారింది.

## టీడీపీ ప్రచారాన్ని ఖండించిన వైసీపీ ఎమ్మెల్యే

పాడేరు పాస్టర్ అభినయ్ దర్శన్ పై దాడి ఘటనను ఎమ్మెల్యే విశ్వేశ్వర రాజు తీవ్రంగా ఖండించారు. ఈ అంశంపై తనపై టీడీపీ నేతలు చేస్తున్న ప్రచారాన్ని అయన ఖండించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పాస్టర్ అభనయ్ దర్శన్పై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నా. దాడి చేసిన వారిని ప్రజల ముందు నిలబెట్టి.. కఠినంగా శిక్షించాలి. ఈ దాడి తన అనుచరులు చేశారని కూటమి నాయకులు ప్రచారం చేయడం దురదృష్టకరమని అన్నారు. ఇచ్చిన హామీలు అమలు చేయడం చేతకాక వైసీపీపై ప్రచారాలు చేస్తున్నారని అయన అన్నారు.

# కేబీఆర్ పార్కు చుట్టూ చెట్లు నరకడం పై స్టే

హైదరాబాద్ కేబీఆర్ పార్కు చుట్టూ 25 నుండి 35 మీటర్ల మీద ఉండే ఈ ఎస్ జెడ్ పరిధిలో చెట్లను నరకడంపై జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ ఉజ్జల్ భూయాన్లతో కూడిన ధర్మాసనం స్టే విధించింది. సోమాజిగూడ ప్రెస్ క్లబ్లో పర్యావరణ ప్రేమికురాలు కాజల్ మహేశ్వరి ఈ మేరకు విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఇదే విషయంపై మద్యంతర ఉపశమనం కల్పించడానికి తెలంగాణ హైకోర్టు నిరాకరణను సవాల్ చేస్తూ ఆమె సుప్రీంకోర్టు కు వెళ్లినట్లు తెలియజేశారు. తన న్యాయవాది కే వివేక్ రెడ్డి వాదనలు విన్న సుప్రీంకోర్టు కె.బి.ఆర్ జాతీయ ఉద్యానవనం చుట్టూ ఉన్న పర్యావరణ సున్నిత ప్రాంతం వెడల్పును 29.8 మీటర్ల పరిధికి తగ్గించడంపై సవాలు చేసిన ఆమె వాదనలు విన్న ధర్మాసనం ఈ మేరకు మద్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ప్రాజెక్టుల పేరుతో ప్రభుత్వం పర్యావరణ సంరక్షణకు గండి కొడుతూ అనేక ఉల్లంఘనలకు పాల్పడుతుందని దీనివల్ల వాతావరణంలో చోటు చేసుకునే అనేక మార్పులు భవిష్యత్తులో ప్రమాదకర పరిస్థితులకు దారితీస్తాయని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో పర్యావరణవేత్త మాజీ సైనికుడు మేజర్ సందీప్ కురానా, అనేకమంది పర్యావరణ ప్రేమికులు పాల్గొన్నారు.

# పలు దొంగతనం కేసుల్లో నిందితుడిని అరెస్ట్ చేసిన విజయవాడ సి.సి.యస్. పోలీసులు

## నిందితుడి వద్ద నుంచి సుమారు 12.75 లక్షల విలువైన 85 గ్రాముల బంగారు ఆభరణాలు స్వాదీనం



ఇన్స్పెక్టర్ ఎం.కిషోర్ బాబు , సిబ్బందితో కలిసి ప్రత్యేక బృందాలుగా ఏర్పడి పగలు సమయాలలో జరిగే దొంగతనాలను నివారించడంలో ప్రత్యేక దృష్టి సారిస్తూ దొంగతనం జరిగిన కేసుల్లోని సంఘటనా స్థలానికి చేరుకొని, సాంకేతిక ఆధారాలను సేకరించి, అనుమానితుల కదలికలపై పూర్తి నిఘా ఏర్పాటు చేయడం జరిగినది. ఈ నేపథ్యంలో ది.19.05.2026 తేదిన సాయంత్రం 04.00 గంటలకు సి.సి.యస్ ఇన్స్పెక్టర్ ఎం.కిషోర్ బాబు, మాచవరం క్రైమ్ ఎస్ఐ శంకర రావు కు రాబడిన పక్కా సమాచారం మేరకు వారి వారి సిబ్బందితో కలిసి మాచవరం పోలీస్ స్టేషన్ పరిదిలోని క్రీస్తురాజపురం ఏరియాలో అనుమానాస్పదంగా తిరుగుతున్న ఒక వ్యక్తిని అదుపులోనికి తీసుకుని విచారించి అతని వద్ద నుండి సుమారు 12.75 లక్షల విలువైన 85 గ్రాముల బంగారు ఆభరణాలు స్వాదీనం చేసుకుని అరెస్ట్ చేయడం జరిగింది.

# వెంకటాపురం జోరుగా మట్టి తొలకలు

## చెరువును తవ్వి నల్లమట్టి తరలింపు కన్నెత్తి చూడని రెవెన్యూ ఇరిగేషన్ శాఖ అధికారులు

గోకవరం మండలంలో ఎటువంటి అనుమతులు లేకుండా వెంకటాపురం చెరువు నల్ల మట్టి తరలిస్తున్నారు . జెసిపిలతో చెరువుని తవ్వి అక్రమంగా మట్టి తరలిస్తున్నారు. గత రెండు నెలలుగా అక్రమ మట్టి తరలింపులు జరుగుతున్నాయి. ఇంత అక్రమ మట్టి తరలించిపోతున్న ఇరిగేషన్ శాఖ రెవిన్యూ శాఖ అధికారులు మాత్రం పట్టించుకోకపోవడం కోస మెరుపు. తూతూ మంత్రంగా పరిమిషన్ లు తీసుకొని అక్రమంగా ఇటుక బట్టీలకు మట్టి అమ్ముకుంటున్నారు. అక్రమంగా లక్షలు మట్టి అమ్ముకుంటున్న స్థానిక ప్రజాప్రతినిధులు గాని ప్రభుత్వ అధికారులు కానీ స్పందించకపోవడం గమనహారం. అక్రమ మట్టి తరలింపులు ఎనకాల బడా బాబులు హస్తం ఉన్నట్లు కూడా ప్రసారం జోరుగా సాగుతుంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మట్టి మాఫియా రెచ్చిపోతుందని గుసగుసలు జోరుగా వినిపిస్తున్నాయి. చెరువును చూస్తే అక్రమార్కులు కన్నేసి రైతుల పేరు మీద తూత్ మంత్రంగా పర్మిషన్ తెచ్చుకొని అక్రమంగా మట్టి అమ్ముకొని సొమ్ము చేసుకుంటున్నారు. ఇంత జరుగుతున్న అధికార పార్టీ యంత్రాంగం మాట పక్కన పెడితే ప్రతిపక్షం కూడా నోరు ఎత్తకపోవడం పలు అనుమానాలు తావిస్తోంది. ఇప్పటికైనా సంబంధించిన శాఖ అధికారుల స్పందించి వెంకటాపురం చెరువు తవ్వి అక్రమంగా నల్ల మట్టి తరలిస్తున్న వారు పైన చర్యలు తీసుకుని అక్రమ మట్టి అడ్డుకట్టు వేయాలని పరువురు కోరుతున్నారు



# విద్యార్థుల భద్రతకు తుగ్గలి ఎస్సై చొరవ

## రోడ్డుపై స్పీడ్ బ్రేకర్ల ఏర్పాటు



తుగ్గలి విద్యార్థుల భద్రత దృష్ట్యా తుగ్గలి ఎస్సై నరేష్ స్థానిక ప్రధాన రహదారిపై స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేయించారు.మంగళవారం రోజున మంత్రాలయం?గుత్తి ప్రధాన రహదారిపై వాహనాల వేగ నియంత్రణలో భాగంగా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సమీపంలో స్పీట్ బ్రేకర్లను వేయించారు.పాఠశాల సమీపంలో వాహనాలు అతివేగంగా వెళ్లకుండా ప్రమాదాలను నివారించడానికి స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేసినట్లు తుగ్గలి ఎస్సై నరేష్ తెలియజేశారు.మంగళవారం ఎస్సై నరేష్ స్వయంగా పర్యవేక్షిస్తూ రోడ్ రోలర్ సహాయంతో తారు మిశ్రమాన్ని ఉపయోగించి స్పీడ్ బ్రేకర్లు వేయించారు.వాహనదారులు వేగ నియంత్రణ పాటించాలని సూచించారు.వాహనదారులు వేగాన్ని తగ్గించి వెళ్లడం ద్వారా, ట్రాఫిక్ నిబంధనలను పాటించడం ద్వారా ప్రమాదాలను అరికట్టవచ్చని తుగ్గలి ఎస్సై నరేష్ తెలియజేశారు.తుగ్గలి ఎస్సై నరేష్ ప్రత్యేక చొరవ చూపించి ప్రధాన రహదారిపై స్పీడ్ బ్రేకర్లు వేయించడం ద్వారా పలువురు గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో తుగ్గలి పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# హోటళ్లు,లాడ్జీల యాజమాన్యాలు అలర్ట్‌గా ఉండాలి: సిపి గౌస్ ఆలం



కరీంనగర్ నగరంలో ఇటీవల పీఎంజే జ్యువెలరీలో జరిగిన భారీ దోపిడీ ఉదంతాన్ని పురస్కరించుకుని కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని హోటళ్లు,లాడ్జీల యజమానులు, నిర్వాహకులతో కరీంనగర్ కమిషనరేట్ కేంద్రంలోని అస్త్ర కన్వెన్షన్ హాలునందు పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం ప్రత్యేక అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ. ఆయుధాలతో కూడిన ఓ అంతర్రాష్ట్ర దొంగల ముఠా నకిలీ ఆధార్ కార్డులు, తప్పుడు ఫోన్ నంబర్లు, తప్పుడు చిరునామాలు ఇచ్చి నగరంలోని పలు హోటళ్లలో దాదాపు రెండు నెలల పాటు బస చేసి, నిఘా రెక్కి నిర్వహించినట్లు పోలీసుల విచారణలో తేలిందన్నారు. ఈ నేపథ్యంలో శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజల భద్రతే ధ్యేయంగా పోలీస్ కమిషనరేట్ వ్యాప్తంగా కఠినమైన మార్గదర్శకాలను జారీ చేస్తున్నామని తెలిపారు.హోటళ్లు, లాడ్జీలకు ముఖ్య సూచనలు:ఖచ్చితమైన గుర్తింపు నిరూపణ హోటల్ లేదా లాడ్జీలలో రూములు కేటాయించే ముందు ప్రభుత్వ గుర్తింపు కార్డులను క్షుణ్ణంగా పరిశీలించాలి. కేవలం ఆధార్ కార్డులను గుడ్డిగా నమ్మకుండా,అందులోని ఫోటో,వయస్సు, చిరునామా అసలైనవా కాదా అని సరిచూసుకోవాలి. అవసరమైతే అదనపు గుర్తింపు కార్డులను అడగాలన్నారు.యాక్టివ్ మొబైల్ నంబర్ వెరిఫికేషన్: కస్టమర్లు ఇచ్చే మొబైల్ నంబర్ పనిచేస్తుందో లేదో క్రాస్-చెక్ చేసుకోవాలి. అది సదరు వ్యక్తి పేరు మీద ఉందో లేదో నిర్ధారించుకోవాలి. విదేశీయులు వస్తే నిబంధనల ప్రకారం తక్షణమే సమాచారం అందించాలి.సీసీటీవీ నిఘా రికార్డుల నిర్వహణ. ప్రతి హోటల్‌లో హై-రెజల్యూషన్ సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలి. కనీసం 90 రోజుల ఫుటేజీని భద్రపరచాలి.గెస్ట్ రిజిస్టర్, ఐడీ ప్రూఫ్స్, వాహనాల వివరాలు, చెక్-ఇన్ చెక్-అవుట్ సమయాలను డిజిటల్ రూపంలో ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలి.అనుమానాస్పద కదలికలపై నిఘా,లగేజీ లేకుండా రూమ్ తీసుకునేవారు, ఆయుధాలు లేదా అనుమానాస్పద బ్యాగులతో వచ్చేవారు, సీసీ కెమెరాల ముందుకు రాకుండా తప్పించుకునే వారిపై ప్రత్యేక నిఘా ఉంచాలి. భారీ నగదు లావాదేవీలు చేసే వారి వివరాలను వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్‌కు చేరవేయాలి.

# ధాన్యం తరలింపు అన్ లోడింగ్ లో మరింత వేగం పెంచాలి: జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్



రాజన్న సిరిసిల్ల ధాన్యం కొనుగోలు కేంద్రాల నుంచి ధాన్యం తరలింపు రైస్ మిల్లులు, గోదాముల్లో అన్ లోడింగ్ లో మరింత వేగం పెంచాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం తరలింపు, అన్ లోడింగ్, ఆన్ లైన్ ట్యాబ్ ఎంట్రీ, రైతులు, హమాలీలకు ఇబ్బందులు కలగకుండా తీసుకోవాల్సిన చర్యలు, తదితర అంశాలపై మంగళవారం ఉదయం అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ తో కలిసి పౌర సరఫరాల, సహకార శాఖ, గ్రామీణాభివృద్ధి శాఖ, మెప్మా ఇతర శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. జిల్లాలోని కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యం తూకం వేయడం, తూకం వేసిన ధాన్యాన్ని నిర్దేశించినమిల్లులు, గోదాములకు తరలించడంపై అధికారులు దృష్టి సారించి, క్షేత్ర స్థాయిలో అప్రమత్తంగా ఉండాలని, కొనుగోళ్ళ ప్రక్రియ సజావుగా పూర్తయ్యేలా చూడాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో తూకం వేసిన ధాన్యం బస్తాలను తరలించేందుకు సరిపడా వాహనాలను ట్రాన్స్పోర్ట్ కాంట్రాక్టర్లు సమాకూర్చాలని స్పష్టం చేశారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం లోడింగ్ కోసం, మిల్లులు, అపరల్ పార్క్ లో ధాన్యం అన్ లోడింగ్ చేయడం కోసం హమాలీల సంఖ్యను మరింత పెంచాలని సూచించారు.ఎండ తీవ్రత దృష్ట్యా కొనుగోలు కేంద్రాల్లో రైతులు, హమాలీలు అలాగే అన్ లోడింగ్ చేసే మిల్లులు, గోదాముల్లో హమాలీలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని,తాగు నీరు,ఓ ఆర్ ఎస్ ప్యాకెట్లు అందుబాటులో పెట్టాలని సూచించారు. ఇంకా జిల్లాలో ఉన్న గోదాములను ధాన్యం అన్ లోడింగ్ చేసేందుకు సిద్ధం చేయాలని ఆదేశించారు.రైతుల నుంచి సేకరించిన ధాన్యానికి సంబంధించిన ఆన్ లైన్ ట్యాబ్ ఎంట్రీ జాప్యం చేయవద్దని డీఆర్డీఓ,డీసీఓ, ఏవో మెప్మా, ఇతర అధికారులను ఆదేశించారు. ఆయా మండలాలకు చెందిన సంబంధిత అధికారులు కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు ఆన్ లైన్ ట్యాబ్ ఎంట్రీ వేగవంతం చేసేలా పర్యవేక్షణ చేయాలని సూచించారు.ధాన్యం కొనుగోలు కేంద్రాలను సంబంధిత శాఖల అధికారులు, మండల ప్రత్యేక అధికారులు, తహసీల్దార్లు తప్పనిసరిగా తనిఖీలు చేస్తూ సూచనలు చేయాలని సూచించారు.

# కడపలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీ నాగేంద్ర మాధవ్‌ను కలిసిన బద్వేల్ ఏఎంసీ చైర్‌పర్సన్ సుప్రజ



పోరుమామిళ్ల ?రైతు శ్రేయస్సు కోసం మరింత కృషి చేయాలని నాగేంద్ర మాధవ్ పిలుపు?సుప్రజ పనితీరుపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి ప్రశంసల జల్లు?పండిట్ దీన్ దయాల్ ప్రశక్షణ కార్యక్రమంలో భాగంగా కడప నగరానికి విచ్చేసిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీ నాగేంద్ర మాధవ్ ని బద్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ సుప్రజ మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.?ఈ సందర్భంగా బద్వేల్ నియోజకవర్గంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ ద్వారా రైతులకు అందుతున్న సేవలు, జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ఆమె నాగేంద్ర మాధవ్ గారికి వివరించారు.?రైతు శ్రేయస్సే ముఖ్యం : పీవీ నాగేంద్ర మాధవ్?సుప్రజ గారి వివరణపై స్పందించిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఆమె పనితీరును ప్రత్యేకంగా అభినందించారు. అన్నదాతల సంక్షేమమే ధ్యేయంగా, రైతు శ్రేయస్సు కోసం భవిష్యత్తులో మరిన్ని మంచి కార్యక్రమాలు చేపడుతూ, ఇంకా బాగా పనిచేయాలని ఆమెకు దిశానిర్దేశం చేశారు. చైర్‌పర్సన్‌గా రైతులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆయన ఆకాంక్షించారు.?"రైతుల సంక్షేమం కోసం నిరంతరం శ్రమించే నాయకులకు ఎప్పుడూ గుర్తింపు ఉంటుంది. సుప్రజ బద్వేల్ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలి."? పీవీ నాగేంద్ర మాధవ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు?ఈ సమావేశంలో పలువురు బీజేపీ ముఖ్య నేతలు, మార్కెట్ కమిటీ ప్రతినిధులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

# విద్యార్థులకు నగదు బహుమతి అందజేసిన సంజూష్ ఫౌండేషన్




**ఏటూరు నాగారం డివిజన్ ప్రజాబలం ప్రతినిధి మే 19**పదో తరగతిలో 500 మార్పులపై సాధించిన విద్యార్థినిలకు విద్యార్థులకు 130 మంది విద్యార్థులకు రెండు వేల రూపాయల చొప్పున కాలర్ షిప్ అందజేసిన సినీ హీరోలు సంజూష్ సంపూర్ణేష్ ఏ ఎస్ పి మహేష్ బట్ట సి ఐ శ్రీనివాస్ హెడ్మాస్టర్స్

ఏటూరునాగారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో నిర్వహించిన సంజూష్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏటూరు నాగారం కన్నాయి గూడెం విజన్సీ విద్యార్థినిలకు విద్యార్థులకు 10వ తరగతిలో 500 పైగా మార్పు సాధించిన విద్యార్థులకు కాలర్ షిప్ ప్రతి విద్యార్థికి రెండు వేల రూపాయలు చదువు నిమిత్తం ఆర్థిక సహాయం అందజేసిన ఏటూరు నాగారం మండల కేంద్రానికి చెందిన హీరో సంజోష్




మన ఊరు పై ఉన్న ప్రేమతో ప్రభుత్వ పాఠశాలలో చదువుతూ ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు స్కాలర్షిప్ అందచేయడం జరిగింది అలాగే ఇంటర్లో 900 మార్కులు పైగా సాధించిన విద్యార్థులకు విద్యార్థినిలకు ?2,000 చొప్పున 15 మందికి తన చేతులారా విద్యార్థులకు అందజేశారు ఈ కార్యక్రమంలో సంజోష్ మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదివి కన్న తల్లిదండ్రులకు ఊరికి మంచి పేరు తీసుకురావాలని ప్రతి తల్లిదండ్రులు తన బిడ్డలను మంచి స్థాయిలో చూడాలని ఉంటారు విద్యార్థులు చదువు పట్ల శ్రద్ధ చూపి చెడులను దూరం చేయాలని కోరారు చదువును భయంతో కాకుండా ప్రేమతో చదివి పై స్థాయికి ఎదగాలని చదువుకు పేదరికం అడ్డు రాదని చదువును నమ్ముకున్న విద్యార్థులు పై స్థాయికి ఎదుగుతారని చదవాలని తపన తాపత్రయం ఉన్న విద్యార్థులు ఐఏఎస్ ఐపీఎస్ డీఎస్పీ స్థాయికి ఎదిగిన ఉద్యోగులు మన ఊరిలోనే ఉన్నారని డాక్టర్లు లాయర్లు ఎంతోమంది విద్యార్థులు ఇక్కడ నుంచి ఎదిగారని హీరో సంజోష్ అన్నారు

# నిష్పక్షపాతంగా, పారదర్శకంగా అక్రెడిటేషన్ కార్డుల జారీ ప్రక్రియ.

## అర్హులైన జర్నలిస్టులకు అక్రెడిటేషన్ కార్డులు : జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు.

**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి మే 19 2026 ములుగు** మంగళవారం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన కలెక్టర్ ఛాంబర్లో జిల్లా అక్రెడిటేషన్ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లాలో పనిచేస్తున్న ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధుల అక్రిడికేషన్ దరఖాస్తులను కమిటీ పరిశీలించింది. అర్హత కలిగిన జర్నలిస్టులకు అక్రెడిటేషన్ కార్డుల జారీతో పాటు పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు మాట్లాడుతూ, మంగళవారం (ఈ రోజు) అక్రెడిటేషన్ మార్గదర్శకాలకు నూతనంగా విడుదలైన నూతన ప్రభుత్వ ఉత్తర్వుల లోని అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి, వాటిలోని అంశాలను పరిగణనలోకి తీసుకుని జిల్లాలో అర్హులైన ప్రతి ఒక్క జర్నలిస్టుకు అక్రెడిటేషన్ కార్డు అందే విధంగా చూడాలని కమిటీ సభ్యులకు దిశానిర్దేశం చేశారు.



ప్రజాస్వామ్యంలో మీడియా పాత్ర కీలకమని, ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో జర్నలిస్టులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు.ఈ సమావేశంలో జిల్లా పౌర సంబంధాల అధికారి ఎం.డి. రఫీక్, ఐహీరాజ కమిటీ సభ్యులు ఎం.డి. షఫీ అహ్మద్, గద్దం దేవేందర్, బి. పృథ్వీరాజ్, బండారి లక్ష్మణ్, ఎం.డి. అబ్దుల్ గఫార్, చుంచు రవి, కే. రాజేష్, వడ్లకొండ వీరయ్య, బి.అశోక్, జూనియర్ అసిస్టెంట్ కొత్తపల్లి శంకర్ పాల్గొన్నారు.

# అనకాపల్లి సీసీఎస్ పోలీస్ స్టేషన్ను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా

**రికార్డులు, పరిసరాలను పరిశీలించిన జిల్లా ఎస్పీ**

**మునగపాక, చోడవరం, అచ్యుతాపురం, రాంబిల్లి పరిధిలోని పలు కీలక కేసుల ఛేదన.**

**ఒరిస్సా, హైదరాబాద్లలో చాకచక్యంగా నిందితులను పట్టుకున్న సీసీఎస్, స్థానిక పోలీసులు.**

**ప్రతిభ కనబరిచిన సీసీఎస్ సిబ్బందిని పేరుపేరునా అభినందించిన జిల్లా ఎస్పీ.**

అనకాపల్లి పట్టణం, మే 19: అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా జిల్లా కేంద్రంలోని సెంట్రల్ క్రైమ్ స్టేషన్ (అఊా) ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. జిల్లా అదనపు ఎస్పీ ఎల్.మోహన రావు సమక్షంలో జరిగిన ఈ తనిఖీల్లో భాగంగా ఎస్పీ స్టేషన్ ఆవరణను పరిశీలించి, శాంతిభద్రతలు మరియు నేరాల నియంత్రణకు సంబంధించిన రికార్డులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. స్టేషన్ నిర్వహణ, రికార్డుల క్రమబద్ధీకరణపై సీసీఎస్ సీఐ కె.అప్పలనాయుడును అడిగి తెలుసుకున్నారు.అనంతరం ఎస్పీ సీసీఎస్ సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. వేసవి కాలంలో ఇళ్లు తాళాలు వేసి ఉండటం వల్ల చోరీలు జరిగే అవకాశం ఎక్కువ ఉన్నందున పాత నేరస్థులు (ఐఆబ), బ్యాడ్ క్యారెక్టర్స్ (ఃఅబ) మరియు అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై నిరంతరం నిఘా ఉంచాలని, 'ఫింగర్ ప్రింట్ ఐడెంటిఫికేషన్ సిస్టమ్' సాంకేతికతను విరివిగా ఉపయోగించాలని ఆదేశించారు.

కఠినమైన కేసులను సాంకేతికత మరియు చాకచక్యంతో ఛేదించి, పొరుగు రాష్ట్రాలకు సైతం వెళ్లి ముద్దాయిలను బంధించిన సీసీఎస్ బృందాన్ని జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా శ్లాఘించారు. ఈ ఆపరేషన్లలో పాల్గొన్న ప్రతి ఒక్క అధికారిని, కానిస్టేబుల్ను ఆయన పేరుపేరునా పిలిచి ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. రాబోయే రోజుల్లో కూడా ఇదే ఉత్సాహంతో పనిచేసి జిల్లాను నేరరహితంగా మార్చాలని పిలుపునిచ్చారు.

# జహీరాబాద్ లో ఘనంగా పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి వేడుకలు




**జహీరాబాద్, మే 19 ప్రజాబలం ప్రతినిధి :** భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) ప్రముఖ నాయకుడు, మాజీ మొదటి పార్లమెంట్ ప్రతిపక్ష నాయకుడు, సిపిఎం అఖిల భారత ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన మహానేత కామ్రేడ్ పుచలపల్లి. సుందరయ్య వర్ధంతి సందర్భంగా జహీరాబాద్ పట్టణంలోని శ్రామిక్ భవన్ లో సిపిఎం పార్టీ కార్యాలయంలో ఘనంగా నివాళు లర్పించారు.

ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి. రాంచందర్ సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పుచలపల్లి సుందరయ్య జీవితాంతం పేదలు, రైతులు, కార్మికుల హక్కుల కోసం పోరాడిన మహానేత అని కొనియాడారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో సుందరయ్య గారి పాత్ర చారిత్రాత్మకమైందని తెలిపారు. నిజాం నిరంకుశ పాలనకు, దోపిడీ భూస్వామ్య వ్యవస్థకు వ్యతిరేకంగా రైతాంగాన్ని సంఘటితం చేసి భూమి, భుక్తి, విముక్తి కోసం పోరాటాలకు నాయకత్వం వహించారని గుర్తు చేశారు. వేలాది మంది రైతులు, వ్యవసాయ కూలీలు ఎదుర్కొన్న వెట్టిచాకిరీ, అణచివేతలకు వ్యతిరేకంగా ప్రజలను చైతన్యపరిచి ధైర్యంగా ఉద్యమాలు నడిపిన గొప్ప విప్లవ నాయకుడు సుందరయ్య అని అన్నారు.

సమసమాజ నిర్మాణం కోసం, పేదల సంక్షేమం, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ఆయన చేసిన సేవలు నేటి తరానికి ఆదర్శమని పేర్కొన్నారు. ఆయన ఆశయాల సాధన కోసం ప్రజా సమస్యలపై పోరాటాలు కొనసాగించాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, పాస్తాం. తుల్జారాం, సాలిమోద్దీన్, సుకుమార్, కే. లక్ష్మణ్, బి. లక్ష్మిన్, రాజు, సంజీవ్ కుమార్ తదితర కార్యకర్తలు పాల్గొని సుందరయ్య గారికి ఘన నివాళులు అర్పించారు.

# భారతదేశాన్ని తగలబెట్టి,ప్రభుత్వాన్నికూలదోయాలని ట్రంప్ ఆదేశాలు జారీ చేశారు

## దేశం ప్రమాదం వైపు పయనిస్తోంది. ఆపరేషన్ 37 అంటే ఏమిటి

**ఆందోల్ నియోజకవర్గం ప్రతినిధి మే 19 (ప్రజాబలం) సంగారెడ్డి జిల్లా** :కింద ఇవ్వబడిన సమాచారం 24 గంటల్లోగా ప్రతి భారతీయుడికి చేరాలి. 'ఆపరేషన్ 37' అంటే ఏమిటి? భారతదేశం ఈ రోజు ఎందుకు ఇంత పెద్ద ముప్పును,ఎదుర్కొంటోంది? ఇది నిజంగా నిజం. మోదీ ప్రభుత్వాన్నికూలదోయాలనే,లక్ష్యంతో దేశ శత్రువులు, ద్రోహుల 'ఆపరేషన్ 37' ప్రారంభమైంది, మోదీని, తొలగించడానికి, అమెరికా అధ్యక్షుడు (సీఐఏ) మరియు డీప్ స్టేట్లకు 12, నెలల గడువు ఇచ్చారు. కుల,ప్రాంతీయప్రాతిపదికన, ప్రజలను విభజించడానికి, తప్పుడు ఉద్యమాలద్వారా ప్రజాశాంతికి భంగం కలిగించడానికి, నకిలీ ఓటింగ్ వంటి తప్పుడు ఆరోపణలను సాకుగా వాడుకోవడానికి ద్రోహులు ఇప్పటికే ప్రణాళికలు సిద్ధం చేశారు. జగదీష్ ధన్ఖర్, ఉదంతం దీనికి ఒక ఉదాహరణ,కొన్నిసార్లు పన్నుల పేరుతో, కొన్నిసార్లు రిజర్వేషన్ల పేరుతో, మరికొన్నిసార్లు రాజీపడే రైతు నాయకుల ద్వారా కనీసం 37 మంది బీజేపీ ఎంపీలను విచ్ఛిన్నం చేసి, బీజేపీని చీల్చడమే వారి లక్ష్యం. బంగ్లాదేశ్లో జరిగిన విధంగానే, లింగ, మతపరమైనఉద్యమాలను రెచ్చగొట్టి,గందరగోళం సృష్టించి, ప్రభుత్వాన్ని కూలదోయడానికి వారు ప్రయత్నిస్తున్నారు, దక్షిణ భారతదేశం మరియు మహారాష్ట్రలోజరుగుతున్న హిందూ నిరసనలు, అలాగే జన్మాష్టమినాడు బీఫ్ తినాలన్న కొందరు నాయకుల ప్రకటనలు, దీనికి మరిన్ని ఉదాహరణలు. ముఖ్యంగా హిందువులనువిభజించడానికి,ఉద్దేశపూర్వకప్రయత్నం జరుగుతోంది.అంతేకాకుండా, పాకిస్తాన్ను, రెచ్చగొట్టి, ఆర్థిక వ్యవస్థను నాశనం చేస్తున్న ఉక్రెయిన్-రష్యా, సంఘర్షణ వంటి సుదీర్ఘ యుద్ధంలోకి భారతదేశాన్ని లాగడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి, ప్రతిపక్షాలు, (డీప్ స్టేట్) మరియు ట్రంప్ 12, నెలల్లోగా మోదీని గద్దె దించడంలో విఫలమైతే, ఆయనపై ప్రాణాంతక దాడి చేయడానికి వారు వెనుకాడరని, కచ్చితంగా చెప్పవచ్చు, ఎందుకంటే, భారతదేశ ప్రగతి అమెరికా పతనానికి దారితీస్తోంది, నేడు, అమెరికా భారతదేశ అభివృద్ధిని చూడటానికి ఇష్టపడటం లేదు. భారతదేశం తన అత్యంత క్లిష్టమైన సమయాన్ని ఎదుర్కొంటోంది. దేశాన్ని,తనను తానురక్షించుకోవడానికి హిందువులు మరింతగా ఐక్యమవ్వాలి,అవతలి పక్షం ఎప్పటికీ మీతో ఉండదు, ఎందుకంటే వారి లక్ష్యం గజ్వా-ఎ-హింద్ను పూర్తి చేయడమే.హిందువులారా, మేల్కొనండి,ఐక్యమవ్వండి, అప్రమత్తంగా ఉండండి మరియు మీ బంధువులు, స్నేహితులు, పొరుగువారిని కూడా అప్రమత్తంగా ఉంచండి. దయచేసి దీనిని చదివి మీ స్నేహితులకు,గ్రూపులకు,పరిచయస్తులకు మరియు వారి పరిచయస్తులందరికీ ఫార్వార్డ్ చేయండి. ప్రతిఒక్కరూ ఇది కనీసం 1,000 మందికి చేరేలా చూడాలి. మీ ప్రయత్నాల యొక్క డొమినో ప్రభావం వల్ల, ఒక వారంలో ఇది 100 మిలియన్ల మందికి, మరియు మూడు వారాలలో 1 బిలియన్ మందికి చేరుతుంది, నాకు అందిన విధంగా ఫార్వార్డ్ చేయబడింది



# తెలంగాణలో పలు జిల్లాలకు వాతావరణ హెచ్చరిక గంటకు 9, కి,మీ, వేగంతో ఈదురు గాలులు



**ఆందోల్ నియోజకవర్గం ప్రతినిధి మే 19, (ప్రజాబలం) సంగారెడ్డి జిల్లా** : తెలంగాణ రాష్ట్రంలోని పలు జిల్లాలలో, వచ్చే 24 గంటల్లో ఉరుములు మెరుపులతో కూడిన, వర్షాలు కురిసే అవకాశం ఉందని, తెలంగాణ ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ హెచ్చరించింది, భద్రాద్రి, కొత్తగూడెం, ఖమ్మం, మహబూబ్నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, జిల్లాలో అక్కడక్కడ ఉరుములు మెరుపులతో పాటు, ఈదురు గాలులు వీచే అవకాశం ఉందని హెచ్చరించింది, గంటకు 40, నుంచి 50, కిలోమీటర్ల వేగంతో, గాలులు వీచే అవకాశం ఉన్నందున, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అధికారులు సూచించారు, ముఖ్యంగా రైతులు, ప్రయాణికులు, వాతావరణ పరిస్థితులను గమనిస్తూ, జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు, ఉరుములు మెరుపుల సమయంలో, చెట్ల కింద నిలబడకూడదని, అవసరమైతే తప్ప బయటకు వెళ్ళవద్దని, తెలియజేశారు.

# లారీల సంఖ్యను మరింత పెంచాలి

## జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్

### ఇల్లంతకుంట మండలం పెద్దలింగాపూర్ గ్రామంలో ఐకేపీ కొనుగోలు కేంద్రంలో కలెక్టర్, ఎస్పీ మహేష్ బి గితే తో కలిసి పరిశీలన

**రాజన్న సిరిసిల్ల జిల్లా /ఇల్లంతకుంట, మే -19(ప్రజా బలం ప్రతినిధి)**కొనుగోలు కేంద్రాల నుంచి దాన్యం తరలించేందుకు ట్రాన్స్పోర్ట్ కాంట్రాక్టర్లు లారీల సంఖ్యను మరింత పెంచాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు.ఇల్లంతకుంట మండలం పెద్దలింగాపూర్ గ్రామంలో ఐకేపీ కొనుగోలు కేంద్రంలో కలెక్టర్, ఎస్పీ మహేష్ బి గితే, జిల్లా అధికారులతో కలిసి మంగళవారం పరిశీలించారు.ధాన్యం ఎంత వచ్చింది? ఇప్పటిదాకా ఎంత కొనుగోలు చేశారో జిల్లా కలెక్టర్, ఎస్పీ ఆరా తీశారు. తరలించేందుకు సిద్ధంగా ఉన్న ధాన్యం సంచుల కోసం మరిన్ని వాహనాలను సమకూర్చాలని ట్రాన్స్పోర్ట్ కాంట్రాక్టర్లను ఆదేశించారు. రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు.

రైస్ మిల్లులో తనిఖీ

ఇల్లంతకుంట మండలం చింతలకుంట పల్లె గ్రామంలోని శ్రీ లక్ష్మీసాయి రైస్ ఇండస్ట్రీస్ లో జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గితే, జిల్లా అధికారులతో కలిసి తనిఖీ చేశారు. ధాన్యం లక్ష్యం కేటాయింపు ఎంత? ఇప్పటి వరకు ఎంత అన్ లోడ్ చేశారు? ఏ ఏ మండలాల నుంచి ధాన్యం వస్తుందో ఆరా తీశారు. హమాలీల సంఖ్యను పెంచి.. అన్ లోడింగ్ వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు.పరిశీలనలో డీఆర్డీఓ లక్ష్మీనారాయణ, డీసీఎస్ఓ బుచ్చిబాబు, మేనేజర్ నరసింహా, డీసీఓ రామకృష్ణ, తహసీల్దార్ సురేష్, ఎంపీడీఓ శశికళ తదితరులు పాల్గొన్నారు.

# దేవుడి ఉత్సవాలపై ఆంక్షల పర్వం..


## బోడపాడులో భక్తుల ఆవేదన



బ్రహ్మంగారిమఠం బోడపాడు గ్రామంలో ఆధ్యాత్మికత ఉట్టిపడాల్సిన వేళ.. ఆంక్షల నీడలు అలుముకోవడం పట్ల స్థానిక ప్రజలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో ఎంతో చరిత్ర కలిగిన ఆంజనేయ స్వామి ఆలయ హనుమాన్ జయంతి ఉత్సవాలను సాఫీగా జరగకుండా, అడుగడుగునా ఆటంకాలు సృష్టించడంపై బోడపాడు గ్రామ మహిళలు, యువత, మరియు భక్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. భక్తిభావంతో నిర్వహించుకునే దేవుడి కార్యక్రమాల్లో కూడా ఈ స్థాయి రాజకీయాలు ఏంటని స్థానికులు బాహాటంగానే ప్రశ్నిస్తున్నారు.నిజానికి, గ్రామీణ ప్రాంతాల్లో ఏటా జరిగే ఆలయ ఉత్సవాలు గ్రామస్తులందరి సమిష్టి వేడుకలు. కులమతాలకు, రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ భక్తిశ్రద్ధలతో పాల్గొనే పండుగలు ఇవి. అలాంటిది, హనుమాన్ జయంతిని పురస్కరించుకుని బోడపాడు భక్తులు ఎంతో ఇష్టంగా ఏర్పాటు చేసుకున్న ఉత్సవాల కార్యక్రమాలను సైతం యంత్రాంగం అడుగడుగునా అడ్డుకోవడం నిజంగా విచారకరం. దేవుడి సన్నిధిలో భక్తితో సాగే వేడుకల వల్ల శాంతిభద్రతలకు వచ్చే విఘాతం ఏముంటుంది? శాంతిభద్రతల పరిరక్షణ పేరుతో సామాన్య భక్తుల స్వేచ్ఛను, వారి నమ్మకాలను హరించడం ఎంతవరకు సమంజసమనే ప్రశ్నలు ఇప్పుడు ప్రతి ఒక్కరి గుండెల్లో వ్యక్తమవుతున్నాయి.ఈ నేపథ్యంలోనే.. ఆలయ సందర్శనకు విచ్చేసిన కడప పార్లమెంట్ సభ్యులు వైఎస్ అవినాష్ రెడ్డి, మైదుకూరు శాసనసభ్యులు శెట్టిపల్లి రఘురామిరెడ్డి, జిల్లా జడ్పీ చైర్మన్ ముత్యాల రామగోవిందరెడ్డి, బద్వేల్ శాసనసభ్యురాలు డాక్టర్ సుధా ముందర బోడపాడు గ్రామ మహిళలు, యువకులు తమ గోడును వెళ్లబోసుకున్నారు. “ఇంత అన్యాయమా.. దేవుడి కార్యక్రమాలు కూడా చేసుకోనివ్వరా? వీళ్లకు భగవంతుడంటే భయం లేదా?” అంటూ మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు దీనిపై ఎంపీ అవినాష్ రెడ్డి స్పందిస్తూ.. కూటమి ప్రభుత్వం పోలీసులను ముందు పెట్టి ఉత్సవాలను సాఫీగా జరగకుండా అడ్డుకుందని, తమ కార్యకర్తలపైనే కాకుండా సాక్షాత్తు ఆంజనేయ స్వామిపై కూడా కక్ష సాధింపు చర్యలకు దిగుతోందని తీవ్రంగా మండిపడ్డారు. భవిష్యత్తులో ఈ తప్పుడు ఆనవాయితీకి కూటమి ప్రభుత్వం భగవంతునికి, ప్రజలకు సమాధానం చెప్పుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో బ్రహ్మంగారి మఠం మాజీ ఎంపీపీ, మాజీ జెడ్పిటిసి, బిజీవేముల రామసుబ్బారెడ్డి, దుగ్గాయపల్లె మల్లికార్జున రెడ్డి, బద్వేల్ మాజీ చైర్మన్ వాకమల్ల రాజగోపాల్ రెడ్డి, బద్వేల్ మాజీ ఎంపీపీ వెంకటేశ్వర రెడ్డి, బ్రహ్మంగారిమఠం మాజీ సింగల్ విండో చైర్మన్ సుబ్బారెడ్డి, ఎగువ నేలటూరు మాజీ ఎంపీటీసీ వెంకటరామిరెడ్డి, బిజీ వేముల రామకృష్ణారెడ్డి,

ఐదుమాల సుబ్బారెడ్డి, గాజులపల్లి చిన్న కేశవరెడ్డి, మన్యం రామిరెడ్డి, బిజీ వేముల చిన్న వెంకట సుబ్బారెడ్డి, బిజి వేముల వెంకట సుబ్బారెడ్డి (హోటల్), బీరం పిచ్చిరెడ్డి, బిజీ వేముల సుబ్బారెడ్డి, మధుసూదన్ రెడ్డి, తిరుపాల్ రెడ్డి, నాగిశెట్టిపల్లె మాజీ సర్పంచ్ అనంతరెడ్డి, దిరశవంచ మాజీ సర్పంచ్, అమీర్ భాష లతో పాటు బద్వేల్, మైదుకూరు ప్రాంతాలకు చెందిన వైయస్ఆర్సీపీ ముఖ్య నాయకులు మరియు స్థానిక ప్రజలు భారీ సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.

# 'అగ్లీ స్టోరీ' మూవీ ప్రమోషన్స్ ప్రజల వద్దకే




ప్రేమలోని చీకటి కోణాన్ని ధైర్యంగా చూపించే ‘అగ్లీ స్టోరీ’ అంచనాలు పెంచేసింది. ట్రైలర్ కూడా ఎంతగానో ఆకట్టుకుంటుంది. నందు, అవికా గోర్ ప్రధాన పాత్రల్లో నటించిన ఈ రొమాంటిక్ థ్రిల్లర్ ట్రైలర్ ఇప్పటికే సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతోంది. ఇంటెన్స్ నెరేషన్, బలమైన ఎమోషన్స్, ఊహించని ట్విస్టులతో నిండిన ఈ ట్రైలర్ ప్రస్తుతం సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతుంది. ప్రణవ స్వరూప్ ఈ సినిమాకి దర్శకత్వం వహించారు. శ్రావణ్ భరద్వాజ్ ఈ సినిమాకి సంగీతం అందించాడు. రియా జియా ప్రొడక్షన్ వాల్యూస్ చాలా అద్భుతంగా ఉండేలా సూచిస్తున్నాయి. ఈ సినిమా కచ్చితంగా బ్లాక్ బస్టర్ హిట్ అయ్యే అవకాశాలు ఉన్నాయి.

ఇదిలా ఉంటే ఈ సినిమా ప్రమోషన్స్ విభిన్నంగా ఉన్నాయి. నందు సందడి మాములుగా లేదనే చెప్పాలి. ప్రజల వద్దకే ప్రమోషన్స్ అంటూ నందు చేస్తున్న హంగామా ఎంతగానో ఆకట్టుకుంటుంది. ఈ సినిమాని జనాల్లోకి తీసుకెళ్తుంది. బ్లింకిట్ డెలివరీ బాయ్ గెటప్ లో నందు చేసిన ప్రమోషన్ బాగా వైరల్ అవుతుంది. అలాగే మార్కెట్లో కూరగాయలు అమ్మే వ్యక్తిగా కూడా నందు హల్ చల్ చేశాడు. మొత్తానికి నందు ప్రమోషన్స్ ఈ సినిమాని జనాల్లోకి బాగా తీసుకెళ్లాయి. మరి ఈ సినిమా విడుదల అయ్యాక ఎలాంటి రెస్పాన్స్ అందుకుంటుందో చూడాలి.

# “సమ్మర్ హాలిడేస్” మూవీ నుంచి బాలనటి ఖుషి పోస్టర్




కథా బలమున్న చిత్రాలను ప్రేక్షకులకు అందిస్తూ సక్సెస్ ఫుల్ ప్రొడ్యూసర్ గా, డిస్ట్రిబ్యూటర్ గా పేరు తెచ్చుకున్నారు ధీరజ్ మొగిలినేని. ఆయన తన ధీరజ్ మొగిలినేని ఎంటర్ టైన్ మెంట్స్ బ్యానర్ పై ”సమ్మర్ హాలిడేస్” అనే చిల్డ్రన్ మూవీని త్వరలో ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. “సమ్మర్ హాలిడేస్” సినిమాను మన చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసే ఒక అందమైన కథతో దర్శకుడు శ్రీకర్ రూపొందిస్తున్నారు. ఈ చిత్రంలో మాస్టర్ రోహన్, మాస్టర్ అరుణ్, బేబి ఖుషి కీలక పాత్రల్లో నటిస్తున్నారు.

ఈ రోజు బాలనటి ఖుషి పుట్టినరోజు సందర్భంగా “సమ్మర్ హాలిడేస్” చిత్రం నుంచి ఆమె బర్త్ డే పోస్టర్ రిలీజ్ చేశారు. బాలనటి ఖుషి “మన శంకర వరప్రసాద్ గారు” సినిమాలో మెగాస్టార్ చిరంజీవి కూతురి పాత్రలో నటించి అందరిని ఆకట్టుకుంది.

“సమ్మర్ హాలిడేస్” మూవీ ఖుషికి మరింత పేరు తీసుకురానుంది. త్వరలోనే “సమ్మర్ హాలిడేస్” సినిమా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది. ఒక ఇంట్రెస్టింగ్ ఎంటర్ టైనర్ గా ప్రేక్షకుల్ని ఈ సినిమా ఆకట్టుకోనుంది.నటీనటులు - రోహన్ రాయ్, అరుణ్, తదితరులు

## భరోసా పార్టీ అధ్యక్షుడిపై ఉన్మాదుల అతి కిరాతక దాడిని ఖండించండి.

## సమగ్ర విచారణ జరిపించి దోషులను శిక్షించాలి.

### ఆదివాసీ గిరిజన సంఘం




అరకులోయ అల్లూరి సీతారామరాజు జిల్లా ప్రశాంతమైన స్వచ్ఛమైన ఆదివాసీ ప్రాంతం చింతపల్లిలో భరోసా పార్టీ అధ్యక్షులు అభినయన్ దర్శన్ పై గుర్తుతెలియని దుండగులు,ఉన్మాదులు అతికిరాతకంగా దారుణంగా మరణ ఆయుధాలతో కాపుగాసి దాడి చెయ్యడం దుర్మార్గమని, ఈ ఘటను ఆదివాసీ గిరిజన సంఘం తీవ్రంగా ఖండించింది.అరకులోయ గిరిజన సంఘం భవనంలో మీడియా సమావేశం ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్ మాట్లాడుతూ ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలు, స్వచ్ఛమైన జీవనవిధానానికి విఘాతం కలిగించే విధంగా, ఏజెన్సీ ప్రాంతంలో ఒక రాజకీయ పార్టీ అధ్యక్షుడిపై పట్టపగలు నడిరోడ్డుపై గుర్తు తెలియని దుండగులు, ఉన్మాదులు దాడి చేయడం ప్రభుత్వ వైఫల్యం. కత్తులు కర్రలతో కిరాతకా దాడి చెయ్యడం హేమమైన చర్యని ఇది పథకం ప్రకారం జరిగిన హత్య యత్నం. ఇటువంటి భౌతిక దాడుల ఏజెన్సీ ప్రాంతం లో అశాంతిని సృష్టిస్తుంది. ఆదివాసీ ప్రజల్లో భయభ్రాంతులకు గురిచేస్తుంది. ఇటువంటి అరాచక సంస్కృతి ఏజెన్సీ ప్రాంతంలో లేదని, కొంతమంది వ్యక్తులు కావాలని ఏజెన్సీ ప్రాంతంలో ఇటువంటి ఘటనకు కారణం అవుతున్నారు. ప్రజాస్వామ్యంలో ప్రజా సమస్యల మీద బహిరంగంగా మాట్లాడుకునే హక్కు రాజ్యాంగం ప్రతి ఒక్కపరుడు ఇచ్చిందని వీటిని జీర్ణించుకోలేక ఇంటివటి ఘటనకు కొంతమంది పూనుకుంటున్నారు.ప్రకృతి ఆరాధకులైన ఆదివాసులను కొన్ని వర్గాల వారు తమ ఆధిపత్యం కోసం అనేక ప్రయత్నాలు చేస్తూ ఆదివాసీ ప్రజలపై తమ మతం రంగు పూస్తున్నారు. బలవంతం రుద్దుతున్నారు. భరోసా పార్టీ అధ్యక్షులు అభినయన్ దర్శన్ పై దాడి చేసిన వారిపై ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలి. ఈ దాడి పై సమగ్ర సమాచారాన్ని ప్రజలకే ప్రభుత్వం తెలియజేయాలని కానీ ప్రభుత్వ ఇప్పటికే వీటిని పక్క దారి పట్టించే విధంగా ప్రభుత్వం వ్యవహరిస్తుందన్నారు. ఇటువంటి చర్యలకు రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు,

మేధావులు ఖండించాలని ఆదివాసీ గిరిజన సంఘం డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇటువంటి ఘటన పునరుద్దరణ కాకుండా ప్రభుత్వం పటిష్టమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఆదివాసీ సంస్కృతి సాంప్రదాయాలు పరిరక్షణ కోసం ప్రభుత్వం ఎటువంటి చర్య తీసుకోకపోవడం వల్ల ఆదివాసీ ప్రాంతంలో కొంతమంది వ్యక్తులు కావాలనే మతం పేరుతో ఆదివాసులను రెచ్చగొడుతున్నారని .ప్రభుత్వం వాటిని నివారించవలసిన బాధ్యత ఉందన్నారు,ఈ సమావేశంలో ఆదివాసీ గిరిజన సంఘం మండల కార్యదర్శి గత్తుం బుజ్జిబాబు, పాంగి నానిబాబు తదితరులు పాల్గొన్నారు

## తాతయ్య గుంట గంగమ్మ తల్లిని దర్శించుకున్న మంత్రి అనగాని సత్యప్రసాద్



తిరుపతి కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వేంకటేశ్వర స్వామి వారి సోదరి అయిన శ్రీ తాతయ్య గుంట గంగమ్మ తల్లిని ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ, రిజిస్ట్రేషన్ల శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, తుడా ఛైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి మంగళవారం దర్శించుకున్నారు. ఆలయానికి విచ్చేసిన మంత్రి అనగాని సత్యప్రసాద్, తుడా ఛైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డిలకు గంగమ్మ దేవస్థానం ఛైర్మన్ మహేష్ యాదవ్ మరియు ఆలయ అర్చకులు, అధికారులు ఘన స్వాగతం పలికారు.ఆలయ సాంప్రదాయం ప్రకారం మంత్రి అనగాని సత్యప్రసాద్, తుడా ఛైర్మన్ దివాకర్ రెడ్డి గార్లకు దేవస్థానం ఛైర్మన్ మహేష్ యాదవ్ గజమాలతో ఘనంగా సత్కరించారు.× అనంతరం వారు అమ్మవారి మూలవిరాట్టును దర్శించుకుని, ప్రత్యేక పూజలు మరియు అర్చనలు నిర్వహించారు. రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో విలసిల్లాలని, వర్షాలు సమృద్ధిగా

కురిసి రాష్ట్రం సస్యశ్యామలం కావాలని అమ్మవారిని ప్రార్థించారు. దర్శనానంతరం ఆలయ మండపంలో వేద పండితులు మంత్రికి, తుడా ఛైర్మన్‌కు వేద ఆశీర్వచనం పలికారు. ఛైర్మన్ మహేష్ యాదవ్ వారికి అమ్మవారి తీర్థప్రసాదాలు, శేషవస్త్రం మరియు అమ్మవారి పవిత్ర ప్రతిమను బహూకరించి గౌరవించారు. ఈ కార్యక్రమంలో కూటమి రాష్ట్ర ఉపాధ్యక్షుడు నరసింహ యాదవ్ తెదేపా తిరుపతి పార్లమెంట్ అధ్యక్షులు పనబాక లక్ష్మి, శ్రీధర్ వర్మ, పులిగోరు మురళి కృష్ణ,జిల్లా నాయకులు,దేవస్థానం బోర్డు సభ్యులు, ఆలయ అధికారులు, అర్చకులు మరియు భక్తులు పాల్గొన్నారు

Edited ,Printed Published & Owned by A.SRAVANTHI ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S
and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI NO ; TELTEL/2005/16755 Cell ; 92921 04449
Email;prajaabalamnews@gmail.com